RNI TELTEL/2024/89620

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

Gk MEDIA

ప్రచురణ : హైదరాబాద్, రంగారెడ్డి, సంపుటి 01, సంచిక 287, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8 గురువారం - 16 - జనవరి - 2025 , వెల రూ.5/-



దేశ సంపద పేదల కోసమా..

## సైకిల్ ట్రాక్ కోసమా?..

**సుప్రీం అసహనం**

ప్రభుత్వం వద్ద ఉన్న డబ్బుతో దేశం అంతా సైకిల్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాలని పిటిషన్ వేసిన వ్యక్తిపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం

చలి కాలంలో విపరీతమైన మంచు, వాయుకాలుష్యం వల్ల దేశ రాజధానిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి



భారత్, యూఎస్ ప్రయోజనాలను

## దెబ్బతీసే కుట్ర.. కేంద్రానికి నివేదిక

భారత్ , అమెరికా భద్రతా ప్రయోజనాలను దెబ్బతీసే దురుద్దేశంతో కొన్ని శక్తులు పని చేస్తున్న విషయాన్ని అత్యున్నత స్థాయి అధికారుల విచారణ కమిటీ గుర్తించింది

దర్యాప్తులో తెలిసిన అంశాలతో రూపొందించిన తుది నివేదికను తాజాగా భారత ప్రభుత్వానికి అందజేత



## నేవీలోకి 2 యుద్ధ నౌకలు, ఒక జలాంతర్గామి

- ముంబైలో భారత నావికాదళ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని
- మూడు నౌకలను జాతికి అంకితం చేసిన మోదీ
- దేశ చరిత్రలో ఇదే ప్రప్రథమమని వెల్లడి.. నేవీ సిబ్బందికి అభినందనలు

ఢిల్లీ: భారత దేశ చరిత్రలో మూడు యుద్ధ నౌకలను ఒకేసారి ప్రారంభించడం ఇదే ప్రప్రథమమని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. బుధవారం మహారాష్ట్రలోని మిగతా..2లో



## దేశంతోనూ పోరాటం చేస్తున్నాం

భగ్గుమన్న బీజేపీ నేతలు

రాహుల్ వ్యాఖ్యలతో కాంగ్రెస్ అసలు రూపం బయటపడిందన్న జేపీ నడ్డా

కాంగ్రెస్‌లో దాపరికం లేదు... చేదు నిజం బయటపడిందని వ్యాఖ్య

రాజ్యాంగంపై ప్రమాణం చేసిన నేత దేశంపై పోరాటం అనడం విడ్డూరమన్న నిర్మలమ్మ

# 26 నుంచి రైతు భరోసా స్కీమ్ అమలు

**రైతు భరోసా.. ప్రభుత్వం సాగు చేయని భూములను ఎలా గుర్తిస్తుందో తెలుసా?**

- సాగుకు యోగ్యమైన భూములకు రైతు భరోసా
- తెలంగాణలో రైతు భరోసా స్కీమ్ అమలు
- ఎకరానికి రూ.12 వేలు ఇస్తాం





హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్త కొత్త నిర్ణయాలు తీసుకుంటోంది. పలు అంశాలలో మార్పులు చేర్పులు చేస్తోంది ప్రభుత్వం. ఇప్పుడు తెలంగాణలో రైతు భరోసా స్కీమ్ అమలు కాబోతుంది. ఈనెల 26వ తేదీన ప్రారంభించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించగా, అందుకు మార్గదర్శకాలను కూడా విడుదల చేసింది. అనర్హులకు ఎట్టి పరిస్థితుల్లో ఈ పథకం అందించబోమని ప్రభుత్వం తేల్చి చెప్పింది. అయితే రైతు భరోసా పథకం పొందాలంటే భూమి సాగు ఉండాల్సి ఉంటుంది. సాగులో లేని భూములను రైతు భరోసా స్కీమ్ నుంచి పక్కనపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని నిర్ణయించింది. సాగు యోగ్యత లేని భూములకు రైతు భరోసా స్కీమ్‌లో సాయం అందించమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇదే విషయాన్ని మార్గదర్శకాల్లో కూడా పేర్కొంది. సాగుకు యోగ్యమైన భూములకు రైతు భరోసా కింద.. ఎకరానికి రూ.12 వేలు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సాగు చేసే ఎన్ని ఎకరాలకైనా రైతు భరోసా మిగతా..2లో

**సాగు యోగ్యత లేని భూములకు రైతు భరోసా స్కీమ్‌లో సాయం అందించమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇదే విషయాన్ని మార్గదర్శకాల్లో కూడా పేర్కొంది. సాగుకు యోగ్యమైన భూములకు రైతు భరోసా కింద.. ఎకరానికి రూ.12 వేలు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు..**



## కేటీఆర్ కు షాకిచ్చిన సుప్రీంకోర్టు

- హైకోర్టు ఆదేశాలలో జోక్యం చేసుకోబోమన్న సుప్రీంకోర్టు
- క్వాష్ పిటిషన్ వెనక్కి తీసుకున్న కేటీఆర్
- ఫార్ములా ఈ రేసు కేసులో ఎఫ్ఐఆర్ కొట్టేయాలంటూ మాజీ మంత్రి పిటిషన్

హైదరాబాద్: సుప్రీంకోర్టులో తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ ను సుప్రీం తిరస్కరించింది. బుధవారం ఉదయం కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఫార్ములా ఈ రేస్ కేసు విచారణ ప్రాథమిక దశలో ఉందని చెబుతూ హైకోర్టు ఆదేశాలలో జోక్యం చేసుకోబోమని వ్యాఖ్యానించింది. మిగతా..2లో

## నామినేషన్ దాఖలు చేసిన కేజ్రీవాల్

**ఫిబ్రవరి 5న జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు**



ఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ న్యూఢిల్లీ స్థానం నుంచి నామినేషన్ దాఖలు చేశారు. ఫిబ్రవరి 5న జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కేజ్రీవాల్..భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అభ్యర్థి ప్రవేశ్ వర్మ, కాంగ్రెస్ నాయకుడు సందీప్ దీక్షిత్లతో తలపడను న్నారు. బీజేపీ అభ్యర్థి ప్రవేశ్ వర్మ కూడా ఈరోజు నామినేషన్ దాఖలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ న్యూఢిల్లీ నుంచి నాలుగోసారి పోటీ చేస్తున్నారు. అంతకుముందు 2013, 2015, 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ స్థానం నుంచి గెలుపొందారు. న్యూఢిల్లీ స్థానం నుంచి నామినేషన్ దాఖలు చేసినట్లు కేజ్రీవాల్ ఎక్స్‌లో పోస్ట్‌లో తెలిపారు. గత 10 ఏళ్లు ఢిల్లీ ప్రజలు ఇచ్చిన ప్రేమ, ఆశీర్వాదం నాకు పూర్తి అంకితభావంతో, సేవతో పని చేసే శక్తిని, స్ఫూర్తినిచ్చాయని అన్నారు. మిగతా..2లో

## సోదరుడు మిట్టపల్లి పోస్ట్ బాధ కలిగిస్తుంది..

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కీలక ట్వీట్.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని సాంప్రదాయ డప్పు నృత్యాలతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మెగాస్టార్ చిరంజీవి ఆహ్వానించారు. ఈ సమయంలో ప్రధాని మోదీ.. డప్పు కొడుతున్న వ్యక్తిని ఆప్యాయంగా పలకరించి.. అతని చేతిని పట్టుకుని నుదిటికి తాకారు.. అయితే.. దీనికి సంబంధించిన వీడియో, ఫొటో నెట్టింట వైరల్ అయింది.. ఈ ఫొటోను తెలంగాణ గేయ రచయిత మిట్టపల్లి సురేందర్ షేర్ చేశారు.**



హైదరాబాద్: సంక్రాంతి పండగ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి.. అందరినీ ఒక్కచోట చేర్చే ప్రయత్నం చేసి అందరినీ ఆకట్టుకున్నారు.. ఢిల్లీలోని తన నివాసంలో తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రధాని మోదీతోపాటు.. మిగతా..2లో



## ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ వ్యాఖ్యలు దేశద్రోహమే

- అయోధ్య రామమందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపన రోజునే నిజమైన స్వాతంత్య్రం వచ్చిందన్న మోహన్ భగవత్
- దేశ ప్రజలను అవమానించారన్న రాహుల్ గాంధీ
- ఇలాంటి పిచ్చి మాటలు కట్టిపెట్టాలని హితవు



**సుప్రీంకోర్టులో ఏపీ సీఎం**

## చంద్రబాబుకు ఊరట..

స్కిల్ కేసులో బెయిల్ రద్దు చేయాలని గత ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ బేలా త్రివేది ధర్మాసనం కొట్టి వేసింది

గత ప్రభుత్వం దాఖలు చేసిన బెయిల్ రద్దు పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు

అవసరం అయిన సందర్భంలో విచారణకు సహకరించాలని చంద్రబాబుకు సుప్రీం కోర్టు సూచించింది

# 670 కోట్ల రూపాయల బకాయిలు విడుదల

1995 నాటి ముఖ్యమంత్రిగా ఆయన ఉద్యోగులను పరుగులు పెట్టించారు

మార్పుతో ప్రభుత్వం పనితీరు కూడా మారే అవకాశం ఉంది

## బాబు మారారు: ఉద్యోగుల టాక్



అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై ప్రభుత్వ ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బాబు మారారు! అంటూ.. సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున పోస్టులు పెడుతున్నారు. అయితే.. ఇదేదో.. తమకు కానుకలు ఇచ్చారో.. పెండింగు వేతనాలు, బిల్లులు చెల్లించారనో కాదు. చంద్రబాబు వ్యవహార శైలిలోనే వచ్చిన మార్పును వారు గమనిస్తున్నారు. దీనిని ప్రస్తావిస్తూనే వారు బాబు మారారు.. అంటూకామెంట్లు చేస్తున్నారు. ఇటీవల సంక్రాంతిని పురస్కరించుకుని 670 కోట్ల రూపాయల బకాయిలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ సొమ్ములు ఇవ్వడం సహజంగానే ఉద్యోగులకు ఆనందం కలిగించే విషయం. అయితే.. ఇంతకు మించిన ఆనందంతో ఉద్యోగులు ఉన్నారు. దీనికి కారణం.. పనిభారం తగ్గించే దిశగా ప్రభుత్వం అడుగు లు మిగతా..2లో

### దేశ సంపద పేదల కోసమా..

# సైకిల్ ట్రాక్ కోసమా?..

## సుప్రీం అసహనం

దిల్లీ: ప్రభుత్వం వద్ద ఉన్న డబ్బుతో దేశం అంతా సైకిల్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాలని పిటిషన్ వేసిన వ్యక్తిపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఖజానా నుంచి వచ్చే డబ్బును పేదలకు ఇళ్లు, ఆరోగ్యం, విద్యా మొదలైన సౌకర్యాలు కల్పించడానికి వినియోగించాలా లేక దేశంలో సైకిల్ ట్రాక్లు వేయడానికి ఉపయోగించాలా అని పిటిషనర్ను ప్రశ్నించింది. అనేక నగరాల్లో పేద ప్రజలు సరైన నివాసాలు లేక మురికి వాడల్లో నివసిస్తున్నారని.. వారికి సరైన ఆరోగ్య, విద్యా సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేసింది. దేశ ప్రజల సమస్యలు వదిలేసి సైకిల్ ట్రాక్‌లు ఏర్పాటు గురించి న్యాయస్థానాన్ని ఆశ్రయించిన మీ ఆలోచన చాలా గొప్పదని చురకలు అంటించింది. పిటిషనర్ తరపున న్యాయవాది మాట్లాడుతూ ఎంపిక చేసిన నగరాలు, పట్టణాలలో ప్రాథమిక మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి సారించే అటల్ మిషన్ ఫర్ రిజువెనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ స్కీమ్‌ను ప్రస్తావించారు. దీని కింద అనేక రాష్ట్రాల్లో సైకిల్ ట్రాక్‌లు ఏర్పాటు చేశారని తెలిపారు. చలి కాలంలో విపరీతమైన మంచు, వాయుకాలుష్యం వల్ల దేశ రాజధానిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని.. సైకిల్ ట్రాక్‌లు నిర్మించడం వల్ల వాటిని కొంత మేరకు నివారించే అవకాశం ఉందని పేర్కొన్నారు. పిటిషనర్ కోరిన విధంగా ప్రభుత్వాలు చేస్తాయని అనుకోవడం అతడి పగటి కలే అవుతుందని పేర్కొంటూ.. న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేసింది.

### భారత్, యూఎస్ ప్రయోజనాలను

## దెబ్బతీసే కుట్ర.. కేంద్రానికి నివేదిక

దిల్లీ: భారత్ , అమెరికా భద్రతా ప్రయోజనాలను దెబ్బతీసే దురుద్దేశంతో కొన్ని శక్తులు పని చేస్తున్న విషయాన్ని అత్యున్నత స్థాయి అధికారుల విచారణ కమిటీ గుర్తించింది. దర్యాప్తులో తెలిసిన అంశాలతో రూపొందించిన తుది నివేదికను తాజాగా భారత ప్రభుత్వానికి అందజేసింది. 2023 నవంబరులో ఏర్పాటైన ఈ కమిటీ విచారణకు అవసరమైన కీలక సమాచారాన్ని అమెరికా అధికారులు భారత్తో పంచుకున్నారు. కొన్ని వ్యవస్థీకృత నేర బృందాలు, ఉగ్రవాద సంస్థలు, మాదక ద్రవ్యాల ముఠాలు తదితరులు చేస్తున్న కార్యకలాపాల సమాచారాన్ని ఇచ్చిపుచ్చున్నారు. ఈ సమాచారం ఆధారంగా భారత్‌లో ఏర్పాటైన విచారణ కమిటీ స్వతంత్రంగా దర్యాప్తు చేపట్టింది. యూఎస్ అధికారులు ఇచ్చిన లీడ్‌లు తీసుకొని కూపీ లాగింది. భారత్‌లోని పలు విచారణ సంస్థల్లో పని చేస్తున్న అధికారుల నుంచి కూడా విచారణ కమిటీ కీలక సమాచారం రాబట్టింది. పలు కేసులకు సంబంధించిన దస్త్రాలను నిశితంగా పరిశీలించింది. ఈ క్రమంలో యూఎస్ అధికారులు పూర్తి సహాయ సహకారాలు అందించారు. భారత్, అమెరికా అధికారులు పలు మార్లు ఇరు దేశాల్లో పర్యటించి తెలిసిన సమాచారాన్ని పంచుకున్నారు. సుదీర్ఘ విచారణ అనంతరం అత్యున్నత స్థాయి అధికారుల విచారణ కమిటీ తమ నివేదికను భారత ప్రభుత్వానికి అందజేసింది. దేశ ప్రయోజనాలను దెబ్బతీసేందుకు కుట్ర పన్నిన ఓ వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించింది. విచారణ చేపడుతున్న క్రమంలో ఆ వ్యక్తి నేర సంబంధాలు, పూర్వాపరాలు బయటపడ్డాయని వెల్లడించింది. కావున వీలైనంత త్వరగా చట్టపరమైన చర్యలను తీసుకోవాలని కోరింది. ఇలాంటి నేరాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని చెప్పింది. ప్రభుత్వ పరంగా కొన్ని విధానాలను మెరుగు పరచుకోవాల్సి ఉందని విచారణ కమిటీ సిఫారసు చేసింది. కొన్ని మార్పులు చేస్తే ఇలాంటి నేరాలపై భారత ప్రతిస్పందన సామర్థ్యం బలోపేతమవుతుందని వ్యాఖ్యానించింది. ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూపై హత్యకు అమెరికాలో కుట్ర జరిగింది. ఈ కేసులో అమెరికా అధికారులు నిఖిల్ గుప్తా అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి అతడిని చెక్ రిపబ్లిక్‌లో అరెస్టు చేశారు. అప్పటికే పన్నూపై భారత్‌లో ఉగ్రవాదిగా నేరాభియోగాలు నమోదయ్యాయి. దీంతో హత్యకు జరిగిన కుట్రను అమెరికా భారత్‌తో ప్రస్తావించి ఆందోళనను వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో 2023లో విచారణ ఏర్పాటైంది. ఈ కేసులో భారత్‌కు చెందిన మాజీ ఇంటెలిజెన్స్ అధికారి 'సిసి-1' ప్రమేయం ఉందని గుర్తించిన విచారణ కమిటీ అతడిపై చర్యలు తీసుకోవాలని తాజాగా సూచించింది.

### సుప్రీంకోర్టులో ఏపీ సీఎం

## చంద్రబాబుకు ఊరట..

అమరావతి: సుప్రీం కోర్టులో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఊరట లభించింది. స్కిల్ కేసులో బెయిల్ రద్దు చేయాలని గత ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ బేలా త్రివేది ధర్మాసనం కొట్టి వేసింది. ఈ కేసులో ఇప్పటికే ఛార్జిషీట్ ఫైల్ చేశారని రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది ముకుల్ రోహత్గి కోర్టుకు వెల్లడించారు. ఛార్జిషీట్ దాఖలు చేసినందున బెయిల్ రద్దు పిటిషన్‌లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు జస్టిస్ బేలా త్రివేది . గత ప్రభుత్వం దాఖలు చేసిన బెయిల్ రద్దు పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అవసరం అయిన సందర్భంలో విచారణకు సహకరించాలని చంద్రబాబుకు సుప్రీం కోర్టు సూచించింది. 2023 నవంబరులో చంద్రబాబుకు ఏపీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలని ఇంటర్ లోకేటరీ అప్లికేషన్ దాఖలు చేసిన స్వర్ణాంధ్ర పత్రిక విలేకరి బాల గంగాధర్ తిలక్‌పై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మీరెవరు..? మీకేం సంబంధం..? పిల్ దాఖలు చేయడానికి ఉన్న అర్హత ఏంటి..? అని ప్రశ్నించింది. బెయిల్ వ్యవహారాల్లో మూడో వ్యక్తి ఎందుకు ఉంటారని ధర్మాసనం నిలదీసింది. సంబంధం లేని బెయిల్ వ్యవహారాల్లో పిటిషన్ ఎలా వేస్తారని జస్టిస్ బేలా త్రివేది ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ వ్యాఖ్యలు దేశద్రోహమే

ఢిల్లీ: ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. అయోధ్య రామమందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపన రోజునే భారత్ నిజమైన స్వాతంత్ర్యాన్ని పొందిందంటూ మోహన్ భగవత్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై విపక్షాలు భగ్గుమన్నాయి. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ... దేశ స్వాతంత్ర్యం గురించి మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలు దేశద్రోహం కిందకు వస్తాయని చెప్పారు. దేశంలో మన రాజ్యాంగ సిద్ధాంతం, ఆరెస్సెస్ భావజాలం మధ్య యుద్ధం జరుగుతోందని అన్నారు. 1947లో మనకు స్వాతంత్ర్యం రాలేదని చెప్పి దేశ ప్రజలను మోహన్ భగవత్ అవమానించారని దుయ్యబట్టారు. బ్రిటీష్ వారిపై పోరాడిన మన యోధులను కించపరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా ఇలాంటి పిచ్చి మాటలు మాట్లాడటాన్ని ఆపాలని అన్నారు.

## నేవీలోకి 2 యుద్ధ నౌకలు, ఒక జలాంతర్గామి

ఢిల్లీ: భారత దేశ చరిత్రలో మూడు యుద్ధ నౌకలను ఒకేసారి ప్రారంభించడం ఇదే ప్రప్రథమమని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. బుధవారం మహారాష్ట్రలోని ముంబై డాక్ యార్డ్ లో జరిగిన కార్యక్రమంలో ప్రధాని పాల్గొన్నారు. దేశీయంగా అభివృద్ధి చేసిన రెండు యుద్ధ నౌకలు, ఫ్రాన్స్ సహకారంతో అభివృద్ధి చేసిన జలాంతర్గామిని మోదీ ప్రారంభించి, జాతికి అంకితం చేశారు. ప్రపంచంలోనే భారీ, అత్యాధునిక విధ్వంసక నౌకలలో ఒకటిగా ఐఎన్ఎస్ సూరత్ నిలవనుందని ఆయన పేర్కొన్నారు. పీ 17ఏ స్టెల్త్ ఫ్రిగేట్ ప్రాజెక్టులో తొలి యుద్ధనౌక ఐఎన్ఎస్ నీలగిరిని, పీ75 కింద రూపొందించిన జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్ షీర్ లను మోదీ ప్రారంభించారు. వీటి రాకతో భారత నావికాదళం మరింత బలపడిందని చెప్పారు. యుద్ధ నౌకల అభివృద్ధిలో 75 శాతం స్వదేశీ పరిజ్ఞానం ఉందని చెప్పారు. జలాంతర్గామిని ఫ్రాన్స్ కు చెందిన నేవల్ గ్రూప్ సహకారంతో అభివృద్ధి చేశామని ప్రధాని వివరించారు. ఈ మూడింటినీ భారత దేశంలోనే తయారుచేశామన్నారు. ప్రపంచంలో బలమైన శక్తిగా భారత్ మారబోతోందని, సబ్ కా సాథ్ సబ్ కా వికాస్ లక్ష్యంగా పనిచేస్తున్నామని మోదీ చెప్పారు. ఈ సందర్భంగా నేవీ సిబ్బందికి ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు.

# దేశంతోనూ పోరాటం చేస్తున్నాం



ఢిల్లీ: ప్రతిపక్షం బీజేపీతో మాత్రమే కాదు... దేశంతోనూ కాంగ్రెస్ పోరాటం చేస్తోందని లోక్ సభలో ప్రతిపక్ష నేత, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై కేంద్రమంత్రులు, బీజేపీ నేతలు భగ్గుమన్నారు. ప్రతిపక్షం... దేశంపై కూడా పోరాటం చేస్తోందని రాహుల్ గాంధీ చెప్పడం విడ్డూరమని, ఆయన వ్యాఖ్యలతో కాంగ్రెస్ అసలు రూపం బట్టబయలు అయిందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్రమంత్రి జేపీ నడ్డా అన్నారు. ఇక దాపరికం లేదని, కాంగ్రెస్ చేదు నిజం బయటపడిందన్నారు. ఇది దేశానికి తెలిసిన విషయమే అయినప్పటికీ రాహుల్ గాంధీ ఈ విషయాన్ని చెప్పడం అభినందనీయమన్నారు. రాహుల్ గాంధీకి, ఆయన చుట్టూ ఉన్న వారికి అర్బన్ నక్సల్స్‌తో సంబంధం ఉందనే విషయం అందరికీ తెలిసిందే అన్నారు. దేశం పరువు తీయాలని, అప్రతిష్ఠపాలు చేయాలని వారు కోరుకుంటున్నారన్నారు. పదేపదే ఆయన చేస్తున్న పనులు ఇదే విషయాన్ని నిరూపిస్తున్నాయన్నారు. దేశాన్ని ముక్కలు చేసి విభజించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ఎంతో చేసిందని, ఇప్పుడు అదే విషయం చెప్పారన్నారు. దేశంపై ప్రతిపక్షం పోరాడుతోందని చెబుతోన్న రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని పట్టుకొని ఎందుకు తిరుగుతున్నారని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రశ్నించారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ప్రతిపక్ష నేత దేశంతో పోరాడుతున్నామని చెప్పడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

# 26 నుంచి రైతు భరోసా స్కీమ్ అమలు

మొదటి పేజి తరువాయి




సాగు చేసే ఎన్ని ఎకరాలకైనా రైతు భరోసా ఇస్తామని తెలిపారు. అయితే సాగు చేయని భూముల వివరాలను గ్రామ సభల్లో ప్రదర్శించాలని కలెక్టర్లను ఆదేశించింది.

సాగు చేయని వాటిని ఎలా గుర్తిస్తారు..?

రైతు భరోసా పథకం కింద సాగు చేసే ప్రతి భూములకు ప్రభుత్వం ఎకరాకు రూ.12 సాయం అందించనుంది.

వ్యవసాయానికి యోగ్యం కాని భూములు, అంటే రాళ్లు, రప్పలు, గుట్టలు, రోడ్ల నిర్మాణంలో కోల్పోయిన భూములు, మైనింగ్ చేస్తున్న భూములు, నాలా కన్వర్షన్ అయిన భూములు, రియల్ ఎస్టేట్ వెంచర్లు చేసిన భూములు, పరిశ్రమలకు తీసుకున్న భూములు, రైతుల నుంచి ప్రభుత్వం సేకరించిన భూములకు రైతు భరోసా వర్తించదని గుర్తించుకోండి. వ్యవసాయ యోగ్యం కాని భూముల వివరాలకు సంబంధించి.. రెవెన్యూ అధికారులు గ్రామాల వారీగా సమాచారాన్ని సేకరించి గ్రామ సభల ద్వారా ప్రజలకు వివరిస్తారు. సాగు యోగ్యత లేని భూములను గుర్తించేందుకు ఫీల్డ్ వెరిఫికేషన్ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరిస్తారు. ఈ బృందంలో రెవెన్యూ, వ్యవసాయం, పంచాయతీరాజ్ అధికారులు ఇందులో ఉంటారు. సాగు చేయని భూములను గుర్తిస్తారు. పంచాయతీ కార్యదర్శి, ఏవోలు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఫీల్డ్ వెరిఫికేషన్ బృందం లీడర్స్ గా ఉంటారు. ఈ బృందంలో రెవెన్యూ విలేజ్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, ఆర్ఏ, ఏఈవోలు సభ్యులుగా ఉంటారు. జిల్లా కలెక్టర్ సారథ్యంలోని డీఏవోలు, ఎంపీడీవోలు తదితర ఉన్నతాధికారులు ఈ బృందాలను పర్యవేక్షిస్తాయి. ఈ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నాన్ అగ్రికల్చర్(వ్యవసాయేతర) భూములను గుర్తిస్తారు. సర్వే నెంబర్ల ఆధారంగా వివరాలు సేకరిస్తారు. ఆర్వోఆర్, పట్టాదారు పాస్?పుస్తకాల జాబితాను పరిశీలిస్తారు. భూ భారతి పోర్టల్ నుంచి జాబితా, విలేజ్? మ్యాప్, శాటిలైట్ మ్యాప్?ల ఆధారంగా పరిశీలిస్తారు. అన్నింటిని బేరీజు వేసి వ్యవసాయ యోగ్యంకాని భూముల జాబితాను రూపొందిస్తారు. అధికారులు రూపొందించే జాబితాలు తప్పనిసరిగా గ్రామ సభల ముందు పెడుతారు. ఇందులో ఆయా భూముల వివరాలను ప్రదర్శిస్తారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే కూడా పరిశీలిస్తారు. ఈ మొత్తం వివరాల సేకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత గ్రామ సభ ఆమోదముద్ర వేస్తుంది. గ్రామాల వారీగా జాబితాలను గుర్తించి.. వ్యవసాయ యోగ్యంకాని భూముల పట్టికను ఫైనల్ చేస్తారు. ఈ భూములకు రైతు భరోసా అందించరని గుర్తించుకోండి. ఈ క్షేత్రస్థాయి సర్వే ప్రక్రియ జనవరి 16 నుంచి ప్రారంభం కానుంది. జవరి 25లోపు ఈ ప్రక్రియను పూర్తి చేసి జనవరి 26 నుంచి రైతు భరోసా స్కీమ్ ను ప్రభుత్వం ప్రారంభించనుంది.

# సోదరుడు మిట్టపల్లి పోస్ట్ బాధ కలిగిస్తుంది..



ఈ వేడుకల్లో ప్రధాని మోదీతోపాటు.. మెగాస్టార్ చిరంజీవి, కేంద్ర మంత్రులు, బిజెపి అగ్రనేతలు, తెలుగు రాష్ట్రాల ఎంపీలతో పాటు ఢిల్లీలో ఉండే తెలుగు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, అనేకమంది ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డప్పు నృత్యాలు, భోగిమంటలు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు, పతంగుల హంగులు.. సంప్రదాయక వంటకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.. ఇలా సంక్రాంతి పర్వదినాన.. ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసిలా ఆతిథ్య ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలోనే ఓ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని సాంప్రదాయ డప్పు నృత్యాలతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మెగాస్టార్ చిరంజీవి ఆహ్వానించారు. ఈ సమయంలో ప్రధాని మోదీ.. డప్పు కొడుతున్న వ్యక్తిని ఆప్యాయంగా పలకరించి.. అతని చేతిని పట్టుకుని నుదిటికి తాకారు.. అయితే.. దీనికి సంబంధించిన వీడియో, ఫొటో నెట్టింట వైరల్ అయింది.. ఈ ఫొటోను తెలంగాణ గేయ రచయిత మిట్టపల్లి సురేందర్ షేర్ చేసి.. ఇది ఎంత అద్భుతమైన దృశ్యం అంటూ పేర్కొన్నారు.. తమను అంటరాని వారిగా భావించే వారని.. ఎప్పుడైనా నాయకులు వారిని మనుషులుగా భావించారా? అంటూ రాసుకొచ్చారు.. ఈ దృశ్యం తన హృదయాన్ని కదిలించిందని.. 'మోడీ గారు.. దయచేసి తెలంగాణకు రండి. మా గుండెలను డప్పు చేసి కొడతాం'.. అంటూ రాసుకొచ్చారు.. అయితే.. మిట్టపల్లి సురేందర్ చేసిన పోస్ట్ పై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు.. మిట్టపల్లి సురేందర్ పోస్ట్ ను ఫొటోగా మార్చి మళ్లీ ట్వీట్ చేసిన కిషన్ రెడ్డి.. సోదరుడు మిట్టపల్లి సురేందర్ పోస్ట్ బాధ కలిగిస్తుందన్నారు.. కొద్దిమంది రాజకీయ నేతల కపటత్వాన్ని బయటపడుతూనే మోడీ లక్షణాన్ని ఈ పోస్ట్ నిర్వచించిందంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాసుకొచ్చారు. ఇది మోదీ వ్యక్తిత్వాన్ని చూపిస్తుందని.. ఎంత ఎదిగినా అందరితో సమానమనే భావనను చూపిస్తుందంటూ కిషన్ రెడ్డి వివరించారు.

## 670 కోట్ల రూపాయల బకాయిలు విడుదల

మొదటి పేజి తరువాయి



దీనికి కారణం.. పనిభారం తగ్గించే దిశగా ప్రభుత్వం అడుగు లు వేస్తోంది. నిజానికి చంద్రబాబు హయాం అంటేనే.. పనిగంటల్లో నిక్కచ్చిగా ఉంటారని.. పనితీరు కరెక్ట్ గా ఉండాలని ఒత్తిడి చేస్తారనే పేరుంది. 1995 నాటి ముఖ్యమంత్రిగా ఆయన ఉద్యోగులను పరుగులు పెట్టించారు. ఈ క్రమంలోనే ఉద్యోగులకు-చంద్రబాబుకు మధ్య గ్యాప్ పెరిగింది. ఈ గ్యాప్ ఏళ్ల తరబడి అలానే ఉండిపోయింది. తాజాగా దీనిని తగ్గించుకునేందుకు చంద్రబాబు ప్రయ త్నిస్తున్నారు. దీనిలో భాగంగానే ఆయన ఉద్యోగ సంఘాల డిమాండ్లను పనరిష్కరించేందుకు ప్రయత్ని స్తున్నారు. ఇదేసమయంలో సెలవుల విషయంలో లిబరల్‌గా ఉంటున్నారు. తాజాగా కనుమకు సెలవు లేదు. కానీ, ఉద్యోగ సంఘాలు విన్నవించడంతో రాత్రికి రాత్రి సెలవు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకు న్నారు. ఇదే సమయంలో బదిలీల విషయంలోనూ పనితీరును ప్రామాణికంగా తీసుకుని.. మరింత వెసులుబాటు కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిఇక్కడ పనిచేస్తున్నవారికి వారంలో ఐదు రోజుల పనివిధానాన్ని కూడా.. ఇటీవ ల మరోసారి రెన్యువల్ చేశారు. ఈ పరిణామాలుఉద్యోగుల్లో చంద్రబాబుకు పాజిటివిటీని పెంచుతున్నా యి. ఇక, పనితీరు విషయంలోనూ చంద్రబాబు తన పంథాను మార్చుకున్నారు. ఎన్ని గంటలు పనిచేశా రన్నది కాదు.. ఎంత ప్రొడక్టివిటీగా పనిచేశారన్నది చూస్తున్నారు. సాయంత్రం 6 తర్వాత కార్యాలయాల్లో ఉండొద్దన్న ఆదేశాలను కూడా పాటిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఉద్యోగులు.. బాబు మారారు అంటూ పోస్టులు పెడుతున్నారు. ఈ తరహా మార్పుతో ప్రభుత్వం పనితీరు కూడా మారే అవకాశం ఉందని ఉద్యోగ సంఘాల నాయకులు చెబుతున్నారు.

## నామినేషన్ దాఖలు చేసిన కేజ్రీవాల్

మొదటి పేజి తరువాయి

ఢిల్లీ ప్రజలు ఈసారి కూడా పనిచేసే వారినే ఎంచుకుంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. దేశ రాజధానిలోని 70 అసెంబ్లీ స్థానాల్లో న్యూ ఢిల్లీ సీటు అత్యంత ముఖ్యమైన స్థానాల్లో ఒకటిగా పరిగణించబడుతుంది. 1993లో కీర్తి ఆజాద్ న్యూఢిల్లీ నుంచి బీజేపీ టికెట్‌పై గెలుపొందారు. ఆజాద్ ఇప్పుడు టిఎంసి ఎంపీ. షీలా దీక్షిత్ 1998, 2003, 2008లో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందారు. కేజ్రీవాల్ 2013లో షీలా దీక్షిత్‌పై 25 వేలకు పైగా ఓట్లతో విజయం సాధించారు. 2015లో బీజేపీ అభ్యర్థి నూపుర్ శర్మపై 31,000 ఓట్ల తేడాతో ఆయన మరోమారు విజయం సాధించారు. 2020 ఎన్నికల్లో కేజ్రీవాల్ 21,000 కంటే ఎక్కువ ఓట్ల తేడాతో బీజేపీకి చెందిన సునీల్ యాదవ్‌ను ఓడించి ఢిల్లీ అసెంబ్లీకి చేరుకున్నారు. ఈ స్థానంలో 2020 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రమేష్ సుభర్వాల్‌కు కేవలం 3,220 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఇదిలావుంటే.. వచ్చే ఫిబ్రవరి 5న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 8న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. అదే రోజున ఫలితాలు కూడా వెలువడుతాయి.

## కేటీఆర్ కు షాకిచ్చిన సుప్రీంకోర్టు

మొదటి పేజి తరువాయి



ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ ను సుప్రీం తిరస్కరించింది. బుధవారం ఉదయం కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఫార్ములా ఈ రేస్ కేసు విచారణ ప్రాథమిక దశలో ఉందని చెబుతూ హైకోర్టు ఆదేశాలలో జోక్యం చేసుకోబోమని వ్యాఖ్యానించింది. అయినప్పటికీ మీకు ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయి కదా? అంటూ కేటీఆర్ తరపు న్యాయవాదికి గుర్తుచేసింది. దీంతో క్వాష్ పిటిషన్ ను వెనక్కి తీసుకోవడానికి అనుమతించాలని కేటీఆర్ న్యాయవాది కోరగా.. సుప్రీం ధర్మాసనం అంగీకరించింది. దీంతో కేటీఆర్ తన పిటిషన్ ను ఉపసంహరించుకున్నారు. ఫార్ములా ఈ రేసులో అవినీతి జరిగిందని కేటీఆర్ పై సీబీఐ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసును కొట్టి వేయాలంటూ కేటీఆర్ తొలుత హైకోర్టును ఆశ్రయించారు. అయితే, కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ ను హైకోర్టు తోసిపుచ్చింది. దీంతో కేటీఆర్ సుప్రీంకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేయగా.. బుధవారం విచారించిన సుప్రీం ధర్మాసనం ఆయన పిటిషన్ ను తిరస్కరించింది.

# కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై కాంగ్రెస్ నేతల అబద్ధపు ప్రచారం..



హైదరాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ నేతలు, గుంపు మీడియా విష ప్రచారం చేస్తుందంటూ బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. సుప్రీంకోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై జరిగిన విచారణపై కాంగ్రెస్ నేతలు, కొన్ని మీడియా సంస్థలు తప్పుడు వార్తలు ప్రసారం చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. క్వాష్ పిటిషన్‌పై ఈ దశలో జోక్యం చేసుకోవడం సరికాదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. సుప్రీం సూచన మేరకు వెంటనే కేటీఆర్ లీగల్ టీమ్ పిటిషన్‌ను విత్ డ్రా చేసుకుంది. అక్రమ కేసులను న్యాయబద్ధంగానే ఎదుర్కొంటామని కేటీఆర్ చెప్పారు. అందులో భాగంగానే సుప్రీంకోర్టులో క్వాష్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. క్వాష్ పిటిషన్ వేసే నాటికి ఎఫ్ఐఆర్ దశలోనే ఫార్ములా ఈ కార్ కేసు ఉంది. సుప్రీంలో విచారణకు ముందే ఏసీబీ విచారణకు కేటీఆర్ సహకరించారు. సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా ఫార్ములా ఈ రేస్ కేసు విషయాలను న్యాయస్థానం దృష్టికి కేటీఆర్ లీగల్ టీమ్ తీసుకెళ్లారు. సుప్రీంకోర్టు సూచన మేరకు కేటీఆర్ లాయర్లు పిటిషన్‌ను విత్ డ్రా చేసుకున్నారు. దీనిపై కాంగ్రెస్ నేతలు, గుంపు మీడియా తప్పుడు ప్రచారం చేస్తోంది. కేటీఆర్‌కు ఎదురుదెబ్బ అంటూ దిక్కుమాలిన వ్యాఖ్యానాలు చేస్తోంది. నేషనల్ హెరాల్డ్ కేసులో తమ అప్పీల్‌ను సోనియా గాంధీ, రాహుల్ గాంధీ వెనక్కి తీసుకున్నారు. సోనియా, రాహుల్‌కు కూడా ఎదురుదెబ్బ తగిలినట్టేనా..? చరిత్రను కాంగ్రెస్ నేతలు గుర్తుంచుకోవాలని బీఆర్ఎస్ నేతలు సూచించారు.

కేటీఆర్ క్వాష్ పిటిషన్ డిస్మిస్ కాలేదు : అడ్వకేట్ మోహిత్ రావు

కేటీఆర్ క్వాష్ పిటిషన్ డిస్మిస్ కాలేదు అని కేటీఆర్ అడ్వకేట్ మోహిత్ రావు స్పష్టం చేశారు. మా లీగల్ ఒపీనియర్ ప్రకారం కేసు విత్ డ్రా చేసుకున్నాం. ఈ కేసుకు సంబంధించి ఏ కోర్టులోనైనా అప్పీల్ చేసుకునే అవకాశం ఉంది. ఏసీబీ ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నవి ప్రొసీజర్‌లోని ఇరెగ్యులారిటీకి సంబంధించిన అంశాలు. ఫార్ములా ఈ కార్ కేసు విషయమైన సుప్రీంకోర్టులో కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ ప్రసన్న వర్లే ధర్మాసనం విచారణ జరిపింది. కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై ఆర్యమా సుందరం, సిద్ధార్థ దవేలు వాదనలు వినిపించారు. ఈ కేసులో సెక్షన్ 13.1ఏ సీపీ యాక్ట్ వర్తించదని వాదనలు వినిపించాం అని మోహిత్ రావు పేర్కొన్నారు.

### క్వాష్ పిటిషన్‌ను విత్ డ్రా చేసుకోవడం వేరు.. కొట్టివేయడం వేరు : న్యాయవాది సోమ భరత్

ప్రపంచం మొత్తంలో 9 నగరాల్లోనే ఫార్ములా ఈ రేసు జరుగుతోంది. ఈ క్రమంలో హైదరాబాద్‌కు ఫార్ములా ఈ రేసును రప్పించి.. కేటీఆర్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. హైదరాబాద్ ప్రతిష్ట పెంచేందుకే ఫార్ములా ఈ రేసు నిర్వహించారు. రాజకీయ కక్షతోనే కేటీఆర్‌పై బూటకపు కేసు పెట్టారు. కేటీఆర్ ఎప్పుడూ విచారణను వ్యతిరేకించలేదు. న్యాయవ్యవస్థపై నమ్మకం ఉందని కేటీఆర్ ఎప్పుడూ చెబుతుంటారు. ఫార్ములా కేసులో క్రిమినల్ ఆధారాలు లేవని కోర్టు నమ్మింది. క్వాష్ పిటిషన్ విత్ డ్రా చేసుకోవడం వేరు.. కొట్టివేయడం వేరు. అబద్ధాలు, అసత్యాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. సోనియా, రాహుల్‌లో నేషనల్ హెరాల్డ్ కేసు అప్పీల్‌ను విత్ డ్రా చేసుకున్న సందర్భం ఉంది. సుప్రీంకోర్టు చెప్పినందుకే కేటీఆర్ క్వాష్ పిటిషన్ విత్ డ్రా చేసుకున్నారు. మీడియా అనేది ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండాలి. విచారణకు పూర్తిగా సహకరిస్తానని కేటీఆర్ చెప్పారని న్యాయవాది సోమ భరత్ తెలిపారు.

## స్వామి వివేకానంద 162వ జయంతివేడుకలు



రాజేంద్రనగర్ ప్రతినిధి,జనవరి 14(**నేటి శుభోదయ**): చిన్న వయస్సులోనే ప్రపంచ దేశాలన్నీ పర్యటించి భారతీయ సంస్కృతి గొప్పదనాన్ని ప్రచారం చేసిన యువతకు ఆయన రచనలు ఎంతో స్ఫూర్తి దాయకమైనమని సోమ శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ బాబుల్ రెడ్డి నగర్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 162వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం మైలర్ దేవ్ పల్లి డివిజన్ బాబుల్ రెడ్డి నగర్ లోని శ్రీ మేధ హై స్కూల్ ఆవరణలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా, స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. సోమ శ్రీనివాస్ మాట్లాడుతు.... వివేకానందుడు చిన్నతనం నుంచే ఆధ్యాత్మికత వైపు నడిచి యువతను సన్మార్గం వైపు నడవాలని సూచించారని తెలిపారు. అదేవిదంగా యువత చిన్నతనం నుంచే వివేకానందుడిని ఆదర్శంగా తీసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం లో కాళీ,వెంకట్, రమణ, జగన్, సోమ అశోక్, కిషోర్, విజయ్ కుమార్, సురేష్, సోమ సందీప్, రవి ముదిరాజ్, ఓరగంటి మలేష్, చెనప్ప, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 1 నుండి 31 వరకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు

**రవాణా శాఖ భద్రాచలం కార్యాలయంలో ప్రమాదల నివారణకు అవగాహన ఎంవిఐ సంఘం వెంకట పుల్లయ్య.**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / భద్రాచలం ,జనవరి 15, (నేటి శుభోదయ ): రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం భద్రాచలం రవాణా శాఖ యూనిట్ ఆఫీస్ భద్రాచలం కార్యాలయంలో. లెర్నర్ లైసెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, మోటార్ సైకిల్ రిజిస్ట్రేషన్, ఆటో రిజిస్ట్రేషన్ మరియు ఫిట్నెస్ కు వచ్చిన వాహన దారులకు రోడ్ సేఫ్టీ భద్రత ట్రాఫిక్ నియమాలు పాటించవలసిన జాగ్రత్తలపై రవాణా శాఖ అధికారి సంఘం వెంకట పుల్లయ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు పక్కాగా పాటించడం, వినియోగించడం, ట్రాఫిక్ సిగ్నల్ అనుసరించడం, వాహనాలను ఓవర్టేక్




చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండడం, సెల్ ఫోన్ డ్రైవింగ్, సీటు బెల్ట్ డ్రైవింగ్, మూల మలుపుల వద్ద నిదానంగా వెళ్లడం హారన్ కొట్టడం రోడ్డు ప్రమాదాల నివారణకు పక్కాగా పాటించవలసిన అంశాలు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అధిక దూరం ప్రయాణించినప్పుడు ముందు రోజు విశ్రాంతి తీసుకోవడం, శీతాకాలం వర్షాకాలంల లో రోడ్డుపై ప్రయాణించే సమయాలలో తీసుకోవలసిన జాగ్రత్తలు, తదితర అంశాలపై వాహనదారులకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో కార్యాలయం కు వచ్చిన వారితో నియమ నిబంధనలు పాటిస్తాను అనే ప్రతిజ్ఞ కూడా ప్రతి ఒక్కరితో చేయించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు, తేదీ జనవరి 1 నుండి 31, వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతీ ఒక్కరు బాధ్యతయూతంగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్స్ సంఘం వెంకట పుల్లయ్య అన్నారు.

## నేడే ఎస్ ఆర్ ఎమ్ అధినేత ముల్లంగి జన్మదిన వేడుకలు



**బంధువులు, మిత్రుల సమక్షంలో జన్మదిన వేడుకలు జరుపుకోనున్న ముల్లంగి**

పామూరు (తోటల చెరువుపల్లి)(**నేటి శుభోదయ**): ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండలం తోటల చెరువుపల్లి గ్రామ వైసిపి యువ నాయకులు ఎస్ ఆర్ ఎమ్ అధినేత ముల్లంగి శ్రీనివాసులు జన్మదిన వేడుకలు నేడు తన స్వగ్రామం తోటలచెరువు పల్లి లో బంధువులు, మిత్రుల ఆధ్వర్యంలో జరుగునని ముల్లంగి మిత్రులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ముల్లంగి శ్రేయోభిలాషులు, బంధువులు, స్నేహితులు పాల్గొంటారు

## ముల్లంగి కనకమ్మ జ్ఞాపకార్థం చీరలు పంపిణీ చేసిన ముల్లంగి శ్రీను



నేటి శుభోదయ పామూరు (తోటల చెరువుపల్లి)(**నేటి శుభోదయ**): ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండలం తోటలచెరువు పల్లి వైసీపీ యువ నాయకులు ఎస్ ఆర్ ఎమ్ అధినేత ముల్లంగి శ్రీనివాసులు సంక్రాంతి పండుగ సందర్భంగా తన తల్లి స్వర్గీయ ముల్లంగి కనకమ్మ జ్ఞాపకార్థం పలువురికి చీరలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి వేడుకలు తన పుట్టి పెరిగిన తోటల చెరువుపల్లి గ్రామంలో గ్రామస్తులతో కలిసి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో తన సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలను విస్తృత పరిచే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పేర్నంపాటి



మౌలాలి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ దాసరి ఓబయ్య, కొమ్మాలపాటి కొండలరావు, షేక్ చిన్న మౌలాలి, పిడుగురామయ్య, రామలక్ష్మణ, వీఆర్వో చెన్నకేశవులు, సుంకే నరసింహారావు, కచ్చెట్టి వర నారాయణ, షేక్ మునాఫ్, వల్లం రాఘవులు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు

## ఘనంగా ఉప్పల వెంకటేష్ జన్మదిన వేడుకలు



(**నేటి శుభోదయ**): జనవరి-15 కడ్తాల్:మండల కేంద్రంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్,మిషన్ భగీరథ వైస్ చైర్మన్,తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ జన్మదిన వేడుకలు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా డిసిసిబి డైరెక్టర్,ఆమనగల్,కడ్తాల్ మండల పిఎసిఎస్ చైర్మన్ గంప వెంకటేష్,మాజీ జెడ్పిటిసి దశరథ నాయక్,మాజీ సర్పంచ్ తెలంగాణ రాష్ట్ర సర్పంచ్ల సంఘం అధ్యక్షులు లక్ష్మీ నరసింహ రెడ్డి,కడ్తాల్ మండల కేంద్రంలో స్థానిక నాయకులతో కలిసి కేక్ కట్ చేసి ఉప్పల వెంకటేష్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు మాజీ ఎంపిటిసిలు,సింగిల్ విండో డైరెక్టర్లు,వార్డు మెంబర్ సభ్యులు,కార్యకర్తలు,అభిమాన నాయకులు,గ్రామ ప్రజలు,పార్టీ కార్యకర్తలు,శ్రేయోభిలాషులు పాల్గొనడం జరిగింది.

# రాజేంద్రనగర్ నియోజకవర్గం లో ఘనంగా సంక్రాంతి వేడుకలు

రాజేంద్రనగర్ నియోజకవర్గం ప్రతినిధి.జనవరి15(నేటి శు భోదయ): రాజేంద్రనగర్ నియోజకవర్గంలో సంక్రాంతి పండుగ వేడుకలు అంగరంగ వైభవంగా ప్రజలు జరుపుకున్నారు. వాడవాడల్లో గ్రామ గ్రామ న సంక్రాంత్రి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.భోగి,సంక్రాంతి మకర సంక్రాంతి మూడు జరుపుకున్నారు.



### మైలార్ దేవ్ పల్లి డివిజన్పరిధిలో....

రాజేంద్రనగర్ నియోజకవర్గం మరియు మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని పలు బస్తీ లోని యువకులు రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇన్చార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సంక్రాంతి శుభాకంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి నియోజక వర్గ మరియూ డివిజన్ ప్రజలందరికీ సంక్రాంతి






పండుగ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ యొక్క పండుగ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని, ప్రజలందరికీ శుభం కలగాలని భగవంతుని ఆకాంక్షించడం జరిగింది.



### శంషాబాద్ లో.......

శంషాబాద్ మున్సిపాలిటీ మండల గ్రామీణ ప్రాంతాలలో సంక్రాంతి పండగ శోభ ఉట్టి పడింది. ముందు ఆడపడుచులు రంగురంగుల ముగ్గులతో సంక్రాంతి శుభాకాంక్షలు అంటూ స్వాగతాలతో వేసిన ముగ్గులు అందరినీ అందంగా ఆకట్టు కున్నాయి. మున్సిపాలిటీ చైర్మన్ కోలన్ సుష్మా మహేందర్ రెడ్డి,వైస్ ఛైర్మెన్ బండి గోపాల్ యాదవ్, 25 వార్డుల కౌన్సిలర్లు మై గాలిపటాలు ఎగురవేస్తూ




ప్రజలందరికీ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే కౌన్సిలర్లు, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు ఎంపిటిసి జడ్పిటిసిలు వాడు కమిటీ సభ్యులకు కూడా సంక్రాంతి పండుగ శు భాకాంక్షలు తెలియజేశారు.

### ఇక గండిపేట మండలానికి వస్తే....

బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్,నర్సింగ్ మున్సిపల్, మణికొండ మున్సిపల్, ధిలో ప్రజలు సంక్రాంతి పండుగను ఘనంగా





జరుపుకున్నారు ఈ ప్రాంతంలో ఎక్కువ శాతం ఆంధ్ర ప్రజలు ఉండడంతో సంక్రాంతి పండుగకన్నుల పండుగ జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలకు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తనయుడు రాజేంద్రనగర్ టిఆర్ఎస్ ఇంచార్జ్ ఈ కార్తిక్ రెడ్డి చేతుల మీదుగా ఎద్దుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. పలువురు సినీ తరాలు, టివి నటులు మణికొండ చిత్రపురి ప్రాంతంలో ఘనంగా జరుపుకున్నారు.సాంప్రదాయ పద్ధతిలో డుడు బసవన్న వేశాధారణాలతో సందడి చేసారు. పలువురు ప్రజా ప్రతినిధులు గాలిపటాలను ఎగరవేసి ప్రజలను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.తెలంగాణ రాష్ట్ర ప్రజలు, సంక్రాంతి వేడుకల సందర్భంగా కోళ్ల పందాలు తిలకిచేందుకు ఆంధ్రకు వెళ్ళగా ప్రజలు నాయకులు పండుగ సందర్భంగా వేడుకల్ని నిర్వహించుకోవడం జరిగింది.

# ఘనంగా ముగిసిన ధనుర్మాస భజన కార్యక్రమం

**శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయం "చక్రీభజన"లో పాల్గొన్న భక్తులు...**

మంథని, చేరాలరవీందర్ నేత, జనవరి -15( నేటి శుభోదయ): ధనుర్మాసమును పురస్కరించుకొని స్థానిక శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయంలో నెల రోజులపాటు నిర్విరామంగా నిర్వహించిన భజన మంగళవారం (అర్ధ రాత్రి ) వరకు కొనసాగిన కార్యక్రమం "చక్రిభజన"తో ఘనంగా ముగిసింది. డిసెంబర్ 16 నుండి జనవరి 14 అర్ధ రాత్రి వరకు నెలరోజుల పాటు మంథని పట్టణం, పరిసర ప్రాంతంలకు చెందిన భక్తులు ఈ భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. మకర సంక్రాంతి పర్వదినమున పురస్కరించుకొని ఆలయంలో భజనపరులు పాలీలకు చెందిన భక్తులతో చక్రి భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. చూడముచ్చటగా కొనసాగిన ఈ భజన కార్యక్రమంలో పట్టణంలోని వేలాది మంది భక్తులు ఈ కార్యక్రమాన్ని తిలకించారు. స్థానికంగా ఎంతో ప్రతిష్టాత్మకత కలిగిన శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయంలో ప్రతి సంవత్సరం ధనుర్మాసంలో నెల రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. వైకుంఠ ఏకాదశి రోజున స్వామివారు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిచ్చిన కార్యక్రమంలో వేలాది మంది భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ భజన కార్యక్రమంలో అవధానుల శ్రీనివాస్, యజ్ఞంభట్ల లక్ష్మీరాజ్యం, మహావాది విజయ్ కుమార్, శ్రీరంభట్ల నరహరి, అవధానుల (భయ్యాగారి) రాజు, రామడుగు శ్రీనివాస్,



శ్రీరంభట్ల పురుషోత్తం, గట్టు లక్ష్మీ రాజ్యం, విష్ణు దాస్, మారుపాక నాగన్న, బాపు, అవధానుల హరి, పల్లి సత్యనారాయణ, చొప్పకట్ల హనుమంతు, నల్లగొండ శ్రీనివాస్, రంగి శివకుమార్, అవధానుల మధు, మహావాది కృష్ణమోహన్, బొబ్బిలి శ్రీనివాస్, కొంతం మోహన్, రావికంటి మనోహర్, రేపాల సత్యనారాయణ, భద్రయ్య, మోహన్, బ్రహ్మం, తల్లం శ్రీనివాస్, గంగా శంకర్, జంబోజి రాజేశం, బండారి ప్రసాద్, చందు, ఒల్లాల విజయ్ కుమార్, కొమురవెల్లి కృష్ణమూర్తి, రావికంటి రమేష్, కొమురోజు శ్రీనివాస్, నాగేందర్, అవధానుల సరోజన, గట్టు మాధవి భక్తులు ఆలపించిన భజన భక్తులను మంత్రముగ్ధులను చేసింది.

## ఘనంగా మాజీ ముఖ్యమంత్రి మాయావతి జన్మదిన వేడుకలు

జనగామ రవికుమార్



మంథని, జనవరి -15 ( నేటి శుభోదయ): ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, బహుజన సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి 69వ జన్మదిన వేడుకలు బిఎస్పి పార్టీ నాయకులు బుధవారం మంథని పట్టణం ప్రెస్ క్లబ్ సమావేశ మందిరంలో బహుజన సమాజ్ పార్టీ మంథని నియోజకవర్గ ఇన్చార్జి జనగామ రవికుమార్ ఆధ్వర్యంలో పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణి చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ....రాబోయే రోజుల్లో బహుజన వర్గాల ప్రజలు మాయావతిని ప్రధానిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా ఇంచార్జ్ వరికిల్ల మల్లేష్, జిల్లా అధ్యక్షులు ఇరుకిల్ల రాజనర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షులు నర్ల గొపాల్ యాదవ్, కోశాధికారి పులిపాక బోందాల, పెద్దపల్లి మాజీ



జిల్లా అధ్యక్షులు గోట్టె రాజు, పెద్దపల్లి నియెజకవర్గ అధ్యక్షులు బోంకురి దుర్గయ్య, రామగుండం నియెజకవర్గ ఇంచార్జ్ ఇరుకిల్ల కనుకయ్య, అధ్యక్షులు జనగామ లింగయ్య, పెద్దపల్లి నియెజకవర్గ కార్యదర్శి సాతురి అనిల్, మలహార్ రావు మండల అధ్యక్షులు నక్క మహెష్, ఎస్ సంపత్, మంథని నియెజకవర్గ సినియర్ నాయకులు ఇరుగురాల సదానందం, మల్లరపు రవిందర్, రామగిరి మండల అధ్యక్షులు రేణికుంట్ల మల్లేష్, బూడిద సంజి, మంథని నియెజకవర్గనాయకులు రామ్షాన్, సుల్తానాబాద్ మండల అధ్యక్షులు బోయిని రంజిత్, బీవిఎఫ్ జిల్లా నాయకులు మచ్చ రాహుల్ ఇరుగురాల సాగర్, రామగుండం కార్పోరేషన్ అధ్యక్షులు మాహంకాలి మహెష్, పెద్దపల్లి పట్టణ అధ్యక్షురాలు రామిళ్ళ శారద్, గోదవరిఖని పట్టణా అధ్యక్షులు సిరికోండ సది, నీలం గణేష్, తాండ్ర శంకర్ తాండ్ర శంకర్, జనగామ రమేష్ తదితరులు పాల్గోన్నారు.

## ఘనంగా మాజీ వైస్ ఎంపీపీ జన్మదిన వేడుకలు

**కె.ఎన్.ఆర్ యువసేన జిల్లా నాయకుడు విజయ్ రాథోడ్**



(**నేటి శుభోదయ**): జనవరి-15 ఆమనగల్లు:ఆమనగల్లు మండల మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంత రెడ్డి జన్మదిన వేడుకలు ఆమనగల్లు మండలం మంగళపల్లి గ్రామపంచాయతీలోని వారి స్వగృహంలో కె.ఎన్.ఆర్ యువసేన జిల్లా నాయకుడు విజయ్ రాథోడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శాలువాతో సన్మానించి ఘనంగా నిర్వహించారు. అనంతరం బుధవారం మాజీ వైస్ ఎంపీపీ అనంత రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ రెడ్డి,రేవతి రెడ్డి సురేందర్ రెడ్డి,శ్రీకాంత్ రెడ్డి,వెంకట్ నర్సింహ రెడ్డి,కొండల్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా మిషన్ భగీరథ మాజీ చైర్మన్ జన్మదిన వేడుకలు



(**నేటి శుభోదయ**): జనవరి-15 ఆమనగల్లు:పట్టణంలో శ్రీశైలం జాతీయ రహదారి పై ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత ఉప్పల వెంకటేష్ జన్మదిన వేడుకలు నిర్వహించారు.అనంతరం కేకు కట్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆమనగల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పత్య నాయక్,నాగిళ్ల జగన్,చుక్కనిరంజన్ గౌడ్,సాయిలు,కిషోర్ నాయక్, వద్దే గణేష్,తలకొండపల్లి మాజీ ఎంపీపీ నిర్మల శ్రీశైలం గౌడ్,తలకొండపల్లి మాజీ సర్పంచ్ జ్యోతయ్య,మాజీ సర్పంచ్ గోపాల నాయక్,తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి నరసింహ,బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంకర్,ఇమ్రాన్,కటికల శేఖర్,ప్రసాద్,శివకుమార్, రాములు.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన వాలీబాల్ పోటీలు



**(నేటి శుభోదయ):** జనవరి-15 ఆమనగల్లు:ఆమనగల్లు మండలం చంద్రాయన్ పల్లి తాండలో వాలీబాల్ సీజన్ 2 పోటీలు జరిగాయి.యువజన దినోత్సవం నుంచి పురస్కరించుకొని వాలీబాల్ పోటీలు నిర్వహించడం జరిగింది.ఇందులో భాగంగా 8 టీంలు పోటీపడి విజేతలుగా చంద్రాయన్ పల్లి తాండ సిపిటి ఈగల్స్ మొదటి బహుమతి రూ.10000/-,సిపిటి హనుమాన్ సేన రెండవ బహుమతి రూ.6000/- సోనూసూద్ యూత్ ఫోర్స్ చంద్రాయన్ పల్లి చిన్న తాండ మూడో బహుమతి రూ.3000/- సాధించడం జరిగింది.ఇందులో భాగంగా సహకరించిన గ్రామ పెద్దలు,స్పాన్సర్స్ పాపిశెట్టి రాము,రాగ్య నాయక్,గోపాల్ నాయక్,సీతారాం నాయక్,అమృనాయక్,గణేష్ నాయక్,తులసి రామ్ నాయక్,కళ్యాణ్ నాయక్,ఆమనగల్ మున్సిపాలిటీ పెద్దలు శ్రీధర్ నాయక్,హర్యానాయక్,లక్ష్మణ్ నాయక్,రాజు నాయక్ లు పాల్గొనడం జరిగింది.

## పాల్వంచ అయ్యప్ప స్వామి దేవాలయం లో
# వైభవంగా మకర జ్యోతి దర్శనం

**పాల్గొన్న రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ కొత్వాల.**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా , జనవరి 15, (నేటి శుభోదయ): మకర సంక్రాంతి సందర్భంగా అయ్యప్ప స్వామి దీక్ష పరులు పవిత్రంగా చేసుకునే మకర జ్యోతి దర్శనాన్ని కనుల పండుగల నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలోనే పేరొందిన అయ్యప్ప స్వామి దేవాలయం లో మంగళవారం సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప స్వామి దేవాలయం ప్రధాన పూజారి మాధవన్ నంబూద్రి, సహాయ పూజారి బృందావనం నరసింహ మూర్తి ల ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుండే పూజలు నిర్వహించారు. శబరిమలై జ్యోతి దర్శనం మాదిరి పాల్వంచ అయ్యప్ప స్వామి దేవాలయంలో జ్యోతి దర్శనం నిర్వహించారు. మకర జ్యోతి దర్శనంలో రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పాల్గొని పూజలు చేశారు. దేవస్థానం ట్రస్ట్ సభ్యులు మేడిద సంతోష్ గౌడ్, కనగాల రాంబాబు, బందెల శ్రీనివాస్, కాల్వ భాస్కరరావు, మిర్యాల కమలాకర్, భక్తులు అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు. సంక్రాంతి సందర్భంగా దేవాలయాల్లో పూజలు చేసిన కొత్వాల దంపతులు మకర సంక్రాంతి సందర్భంగా మంగళవారం కొత్వాల తో పాటు సతీమణి కొత్వాల విమలాదేవి దంపతులు, కుటుంబ సభ్యులు పాత పాల్వంచ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం, మైసమ్మ తల్లి దేవాలయం, ఆంజనేయ స్వామి దేవాలయాలలో ప్రత్యేక పూజలు పాల్గొన్నారు.

# బిజెపి మండల ఉపాధ్యక్షులు బీఆర్ఎస్ లో చేరిక



**(నేటి శుభోదయ):** జనవరి-15 కడ్తాల్:మండల కేంద్రంలో మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పలువురు బిజెపి నాయకులు.దశరథ్ నాయక్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు.వారికి బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలో ఆహ్వానించిన దశరథ్ నాయక్.పార్టీ లో చేరిన నాయకుల్లో సరియాతో పాటు బూత్ కమిటీ అధ్యక్షుడు వినోద్ హిరా నాయక్ కిరణ్ లతో పాటు దాదాపు 10 మంది బిజెపి నాయకులు పార్టీ లో చేరారు.వారిని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ పార్టీలో స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలో లేకున్నా బీఆర్ఎస్ పార్టీపై ప్రజలకు విశ్వాసం నమ్మకం ఉందని.అందుకే బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా ఏదో చూపిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచుల తులసి రామ్ నాయక్,శ్వేతా భూనాథ్,డైరెక్టర్ సేవ్య నాయక్,మాజీ ఉపసర్పంచ్ శారదా పాండు,రమణ,నాయకులు రమేష్,శ్రీను,సోమ్లా,దశరథ్,పత్తి శ్రీను,దేవా,రాజు,కిరణ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నాగారం లో జిల్లా స్థాయి షటిల్ టోర్నమెంట్



మంథని, జనవరి -15 (నేటి శుభోదయ): హనుమాన్ భక్తమండలి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి షటిల్ టోర్నమెంట్ ఘనంగా నిర్వహించారు. మంగళవారం మంథని మండలం నాగారం గ్రామంలో హనుమాన్ భక్త మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన షటిల్ టోర్నమెంట్ లో ప్రథమ బహుమతి గోదావరిఖనికి చెందిన పరిషి టీం, ద్వితీయ బహుమతి జిజి 8 ఇంక్లైన్ కాలనీ వారు గెలుపొందారు. ఎస్ ఆర్ కె వాటర్ ప్యూరిఫై, తను ఆఫ్ సెట్ ప్రింటర్స్, బెల్లంకొండ దయాకర్ రెడ్డిలు టోర్నమెంట్ కు సహకారం చేశారు. మంథని ఏఎస్ఐ మల్లేశం విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో నాగారం గ్రామ పెద్దలు, ప్రజలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# కురుమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ




**(నేటి శుభోదయ):** ప్రతినిధి రాజేంద్రనగర్ : బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ కురుమ సంఘం ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించు కోవడం హర్షించ దగ్గ విషయమని రాష్ట్ర కురుమ సంఘం నాయకుడు బండ సూరి పేర్కొన్నారు. కార్పొరేషన్ సంఘం క్యాలెండర్ ను మంగళవారం రాత్రి సంధ్యా నగర్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండ్లగూడ కార్పొరేషన్ కురుమ సంఘం అభివృద్ధి కోసం తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని వెల్లడించారు. సంఘం ఆధ్వర్యంలో సంఘసేవ,సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. కార్పొరేషన్ సంఘ అధ్యక్షుడు తాండ్ర రమేష్ కుమార్ ప్రధాన కార్యదర్శి కె లక్ష్మణులు మాట్లాడుతూ కులస్తులంతా సమిష్టి కృషితో క్యాలెండర్ ను రూపొందించి ఆవిష్కరించుకున్నట్టు వెల్లడించారు. నూతన సంవత్సర క్యాలెండర్ను ప్రతి కుల సోదరునికి అందజేస్తామన్నారు ప్రతి కులస్తుడు తమ ఇంట్లో తప్పనిసరిగా క్యాలెండర్ను ఏర్పాటు చేసుకోవాలన్నారు ఈ సందర్భంగా హార మైసమ్మ దేవాలయ నిర్మాణ దాత అయిన బండ సూరిని కులస్తులు అంతా కలిసి ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు, కుల సోదరులు పాల్గొన్నారు

# అర్హులైన ప్రజలకు ప్రభుత్వ పథకాలు చేరేలా పటిష్ట కార్యాచరణ....

గ్రామ సభల ద్వారా తుది లబ్ధిదారుల ఎంపిక...

జనవరి 26 నుంచి 4 నూతన పథకాల అమలు...

వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా పథకం వర్తింపు...

ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, తదితర అంశాలపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం...

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

అదనపు కలెక్టర్ డి. వేణు



మంథని, చేరాలరవీందర్ నేత, జనవరి -15, నేటిశుభోదయ : అర్హులైన ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం మంథని లోని శ్రీ లక్ష్మీ భారతి ఫంక్షన్ హాల్ లో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, నూతన రేషన్ కార్డుల జారీ, తదితర అంశాలపై నిర్వహించిన మంథని నియోజకవర్గ స్థాయి సమన్వయ సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,.... ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం నుంచి అమలు చేయబోతున్న 4 నూతన పథకాలకు అర్హులైన లబ్ధిదారులను, అనర్హులను ఎంపిక చేసి గ్రామ సభ ల ద్వారా ఆ జాబితాను ఆమోదింప చేసుకోవాలని అన్నారు. గ్రామ సభ ల ద్వారా ఆమోదింప చేసుకున్న జాబితా జనవరి 25 లోపు ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు. రైతు భరోసా పథకానికి సంబంధించి ప్రతి మండలంలోని తహసిల్దార్, మండల వ్యవసాయ అధికారి పర్యవేక్షణలో వ్యవసాయ విస్తరణ అధికారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్, సర్వేయర్లు, మైనింగ్ , సంబంధిత అధికారులు సంయుక్తంగా పని చేసి పట్టా దార్ పాస్ పుస్తకాల డేటా, గూగల్ మ్యాప్ , రెవెన్యూ మ్యాప్ వారీగా పరిశీలిస్తూ భూ భారతి (ధరణి) నుంచి వ్యవసాయ యోగ్యం కాని భూములను గుర్తించి రైతు భరోసా జాబితా నుంచి సదరు లబ్దిదారులను తొలగించాలని అన్నారు. రాళ్ళు రప్పలు ఉన్న భూములు, సాగు నీటి ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ చేసిన భూములు, పరిశ్రమల భూములు (రైస్ మిల్ పెట్రోల్ బంక్, ఆహార శుద్ధి పరిశ్రమ....), నాలా కన్వర్షన్ జరిగిన భూములు, లేఔట్ ఉన్న భూములు, ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తు భూములు, రొడ్ల భూములు, భవనాలు నిర్మించుకున్న భూముల, మైనింగ్ జరుగుతున్న భూముల వివరాలు రైతు భరోసా నుంచి తొలగించాలని అన్నారు. భూమి లేని వ్యవసాయ కూలీల



కుటుంబాలకు ఏడాదికి 12,000 రూపాయలకు రెండు విడతలుగా అందించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రారంభించిందని, 2023-24 సంవత్సరానికి 20 రోజులు పని చేసిన భూమి లేని రైతు కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుందని అన్నారు. ఈ పథకం కుటుంబం యూనిట్ గా అందించడం జరుగుతుందని, వ్యక్తిగతంగా అందించే పథకం కాదని అన్నారు. ప్రతి రెవెన్యూ గ్రామాన్ని జీపి వారిగా మ్యాప్ చేయాలని అన్నారు. జిల్లాలో 20 రోజులు ఉపాధి హామీ కూలీలుగా పని చేసిన కార్మికుల జాబితాను తీసుకొని ఆధార్ కార్డు ట్యాగ్ ప్రకారం పరిశీలిస్తూ భూమిలేని కుటుంబాలను ఎంపిక చేయాలని కలెక్టర్ తెలిపారు. గ్రామ సభలో ఎంపిక చేసిన జాబితా పై ఏవైనా అభ్యంతరాలు వస్తే సంబంధిత ఎంపిడీఓ 10 రోజుల లోగా పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

సామాజిక ఆర్థిక సర్వే కింద మన పెద్దపల్లి జిల్లాలో తేలిన ఆహార భద్రత కార్డులు లేని కుటుంబాలకు మండలాలలో ఎంపీడీవోలు, పట్టణాలలో మున్సిపల్ కమిషనర్ లు నూతన రేషన్ కార్డుల జారీ పర్యవేక్షించాలని అన్నారు. గ్రామ లేదా వార్డు సభల ద్వారా అర్హులైన జాబితాన్ని ఆమోదింప చేసుకొని రేషన్ కార్డులను 75 గణతంత్ర దినోత్సవ సందర్భంగా నూతన రేషన్ కార్డుల ప్రోసిడింగ్స్ పంపిణీ చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి నిర్వహించిన సర్వేలో భూములు ఉన్న అత్యంత పేదలకు మొదటి జాబితాలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో స్క్రూటినీ నిర్వహించి 13.93 లక్షల దరఖాస్తులను మొదటి విడతలో పరిశీలనకు జిల్లాలకు అందిస్తున్నారని, మనకు వచ్చిన దరఖాస్తులను మరొకసారి చెక్ చేసుకోని, గ్రామాల వారీగా అర్హులను ఎంపిక చేసుకొవాలని, ఎటువంటి ఒత్తిడులకు గురికాకుండా అత్యంత పేదలను ఎంపిక



చేయాలని కలెక్టర్ తెలిపారు. గ్రామ సభలు నిర్వహించి ప్రభుత్వం చేపడుతున్న 4 కార్యక్రమాల మార్గదర్శకాలు, ఉద్దేశం ప్రజలకు వివరిస్తూ పథకాల అర్హుల జాబితాను ప్రజలందరికీ తెలిసేలా ప్రదర్శించాలని, ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలను పరిష్కరించిన తర్వాత తుది జాబితా తయారు చేయాలని అన్నారు. జనవరి 23 లోపు గ్రామ సభల నిర్వహణ పూర్తి చేయాలని, గ్రామ సభ ఆమోదించిన తరువాత తుది జాబితా ఆన్ లైన్ లో జనవరి 25 సాయంత్రం లోపు నమోదు చేయాలని, జనవరి 26 నుంచి 4 పథకాల అమలును ప్రారంభించాలని కలెక్టర్ అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం. కాళిందిని, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, జడ్పీ సీఈవో , జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, మంథని రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్,తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వాసవి మాత ఆలయం వద్ద అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు





పామూరు(నేటి శుభోదయ): సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలోని ఆర్యవైశ్యుల కులదేవత శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద ఆర్యవైశ్య సోదరీ సోదరీమణుల ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**ఆటపాటలతో అలరించిన ఆర్యవైశ్య మహిళలు**



సంక్రాంతి సంబరాలలో భాగంగా ఆర్యవైశ్య మహిళలు వివిధ రకాల ఆట పాటలతో అలరించారు. ముఖ్యంగా ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, లెమన్ స్పూన్, చిన్నపిల్లల మ్యూజికల్ చైర్స్ ఆటలతో సందడి సందడిగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ ఏల్చూరి బాలకొండలరావు, దర్శి మస్తాన్ రావు, కోట నరసింహారావు, మెంటా నరసింహారావు, సేగు కృష్ణయ్య, పలువురు పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు, గ్రామస్తులు పాల్గొన్నారు

# క్రీడాకారులకు అన్నదానం యం.డి,మహముద్, కుటుంబ సభ్యులు

**కీర్తిశేషులు యండి రఫిక్ (బాబాదిన్) జ్ఞాపకార్థంగా అన్నదానం నిర్వహించారు**

**హాజరైన మాజీ ఎం.పీ.పీ.శ్రీనివాస్ యాదవ్**



**(నేటి శుభోదయ):** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో సంక్రాంతి పండగ సందర్భంగా నిర్వహించిన వెల్జాల్ ప్రీమియర్ లీగ్ 11వ సీజన్ టోర్నమెంట్ (క్రికెట్) క్రీడాకారులకు యం.డి.,మహముద్, యం.డి.గౌస్,యం.డి.అబ్బాస్ కుటుంబ సభ్యులు, కీర్తిశేషులు యం.డి. రఫిక్ (బాబాదిన్) జ్ఞాపకార్థంగా క్రీడాకారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మొదటగా బాబాదిన్ చిత్రపటానికి పూలు సమర్పించి ఆయన ఆత్మ శాంతించాలని క్రీడాకారులు,మౌనం



పాటించారు.అనంతరం క్రీడాకారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీపీ, సిఎల్.శ్రీనివాస్ యాదవ్, క్రీడాకారుల సమక్షంలో అన్నదాన కార్యక్రమం ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పి.ఎ.సి.ఎస్ వైస్ చైర్మన్ కూన రవికుమార్,మాజీ ఎంపిటిసి అంబాజీ,మాజీ సర్పంచులు, వెంకటయ్య,లింగం,రమేష్, మాజీ ఉప సర్పంచ్అజీజ్,ఈనాడు రిపోర్టర్ విష్ణువర్ధన్,యాదవ్,వానరాశివెంకటేష్,విజయ్ కుమార్, ఆరిఫ్, ఖయ్యూం, రాజు,కృష్ణయ్య, లింగం, అవినాష్, రషీద్,సంపత్,శేఖర్ ప్రసాద్,సాయికుమార్, రాఘవేందర్, యాదగిరి,ఆంజనేయులు,నాసిర్,గ్రామ పెద్దలు, క్రీడాకారులు,యువకులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వర ముక్తేశ్వర దేవాలయాభివృద్ధికి సహకరించండి...

**రామగిరి కోట ను టూరిజం హబ్ గా మార్చండి..**

**కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షేకావత్ కు మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి...**

మంథని, చేరాలరవీందర్ నేత, జనవరి -15( నేటి శుభోదయ): కాళేశ్వరం ,మంథని, రామగిరి'ని ఆధ్యాత్మిక, వారసత్వ పర్యాటక సర్క్యూట్ గా గుర్తించి అభివృద్ధి చేయాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక మంత్రి గజేంద్రసింగ్ షేకావత్ ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి శ్రీధర్ బాబు కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంత్రి శ్రీధర్ బాబు బుధవారం ఆయనను కలిసి మంథని



నియోజకవర్గ పరిధిలోని కాళేశ్వర ముక్తేశ్వరస్వామి దేవాలయం, రామగిరి కోటను టూరిజం హబ్ గా అభివృద్ధి చేసేందుకు చొరవ చూపాలని వినతి పత్రం అందజేశారు.దక్షిణ కాశీగా పేరుగాంచిన కాళేశ్వరంలో గోదావరి నది ఒడ్డున వెలిసిన కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవాలయానికి వేయ్యేళ్లకు పైగా



చరిత్ర ఉంది. దేశంలో ఎక్కడా కనిపించని విధంగా గర్భ గుడిలో రెండు శివలింగాలు పూజలందుకుంటున్నాయి. ఒకటి ముక్తేశ్వరునిది (శివుడు), మరొకటి కాళేశ్వరునిది (యముడు). ఏటా లక్షలాది మంది భక్తులు ఈ ఆలయాన్ని దర్శించుకుంటున్నారు. ఈ ఏడాది మేలో సరస్వతి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. 30 లక్షల నుంచి 40 లక్షల మంది ఇక్కడ పవిత్ర స్నానాలను ఆచరించేందుకు వస్తారని అంచనా వేస్తున్నాం. ఇక్కడే 2027లోనూ గోదావరి పుష్కరాలు జరగనున్నాయి. అప్పుడు కోటి మందికి పైగా వచ్చే అవకాశముంది. సోమ్ నాథ్, కేదార్ నాథ్, మహాకాళేశ్వర్, అయోధ్య, కాశీ ల మాదిరిగా ఎంతో ప్రత్యేకత కలిగిన ఈ ఆలయాన్ని కూడా ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక, ఎకో టూరిజం హబ్ గా అభివృద్ధి చేయొచ్చు. ఇప్పటికే ఇందుకు సంబంధించి సమగ్ర ప్రణాళికను రూపొందించాం. దీని అమలుకు కేంద్రం సహకరించాలి. భక్తుల,సౌకర్యార్థపుష్కరాలు మొదలయ్యే నాటికి ఈ అభివృద్ధి పనులను పూర్తి చేసేలా చొరవ చూపాలి' అని విజ్ఞప్తి చేశారు. 'రామగిరి కోటకు సుమారు 1200 ఏళ్ల చరిత్ర ఉంది. రామాయణంలోనూ దీని గురించిన ప్రస్తావన ఉంది . రాముడి ఆలయాలు, జలపాతాలు, ఎన్నో ఔషధ మొక్కలు ఇక్కడున్నాయి. ఒక ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రానికి కావాల్సిన అన్ని ఆకర్షణలు ఇక్కడున్నాయి. ఈ కోటను సందర్శించేందుకు ఎక్కడెక్కడి నుంచో పర్యాటకులు వస్తున్నారు. స్వదేశీ దర్శన్ 2.0 లేదా ఇతర పథకాల కింద ఈ కోటను మెగా టూరిజం హబ్ గా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలి అని కోరారు.

## బలమైన విప్లవ కార్మిక ఉద్యమాన్ని నిర్మిద్దాం

**18న కొత్తగూడెంలో ఐఎఫ్టియు విలీన సభను జయప్రదం చేయండి.**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జనవరి 15, (నేటి శుభోదయ): దేశంలో రాష్ట్రంలో ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్పొరేట్ విధానాలకు అనుగుణంగా కార్మికుల శ్రమ దోపిడీ విచ్చలవిడిగా సాగిస్తున్నాయని కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 29 కార్మిక చట్టాల పునరుద్ధరణ నాలుగు లేబర్ కోడిగా ఉపసంహరణ ఉద్యోగ ఉపాధి వేతనాల పెరుగుదల కోసం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కార్మికులు సమస్యల పోరాటాలకు సన్నద్ధం కావాల్సిన అవసరం ఉందని ఇందులో భాగంగా కొత్తగూడెంలో జనవరి 18 జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్ టి యు ఉపాధ్యక్షులు జె సీతారామయ్య అన్నారు. దేశవ్యాప్తంగా ప్రాతినిధ్యం వహిస్తున్న రెండు విప్లవ కార్మిక సంఘాలైన ఐ ఎఫ్ టి యులు సంయుక్తంగా చర్చలు జరుపుకొని విలీనానికి సిద్ధమైన సందర్భంలో తెలంగాణ రాష్ట్ర స్థాయి విలీన సభను కొత్తగూడెం క్లబ్లో ఈ నెల 18 నిర్వహిస్తున్న సందర్భంగా ఐఎఫ్ టియు కార్యాలయంలో ఆయన ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షుడు గౌని నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీతారామయ్య మాట్లాడుతూ కొత్తగూడెంలో జరిగే రాష్ట్రస్థాయి విలీన సభను జయప్రదం చేయాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు, ఆటో,మోటార్ కార్మికులు,భవన నిర్మాణ, హామాలి కార్మికులు, ఇతర అన్ని విభాగాల కార్మిక సోదరులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి రాసుద్దీన్, ఉపాధ్యక్షులు గౌని నాగేశ్వరావు, సహాయ కార్యదర్శి ఎన్.సంజీవ్, రామక్రిష్ణ, కొండలరావు, నరసింహ, లక్ష్మి, కళ్యాణి, దేవి, లావణ్య తదితరులు పాల్గొన్నారు

## మాదిగ ఉద్యోగ సమాఖ్య అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులుగా

**బి ప్రేమ్ కుమార్, రాచూరి ఏలియా**



నేటి శుభోదయ (కనిగిరి) పామూరు **(నేటి శుభోదయ):** కనిగిరి నియోజకవర్గ మాదిగ ఉద్యోగుల సమావేశం స్థానిక మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో కన్వినర్ బి ప్రేమ్ కుమార్ అధ్యక్షతన బుధవారం



నిర్వహించడం జరిగింది ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు కత్తి ఇసాక్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నియోజకవర్గ అధ్యక్షులుగా టీచర్ బి ప్రేమ్ కుమార్ ప్రధాన కార్యదర్శిగా వెల్ఫేర్ సెక్రటరీ రాచూరి ఏలియా వర్కింగ్ ప్రెసిడెంట్ గా వార్డెన్ బి కిరణ్ కోశాధికారిగా టీచర్ కె అబ్రహం ఉపాధ్యక్షులు గా సుమన్ శాస్త్రి యిర్మీయా కార్యదర్శి గా సల్మాన్ తదితరులు వారిని జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకొని ప్రమాణ స్వీకారం చేపించటం జరిగింది ఈ కమిటీ ఎం ఈ ఎఫ్ బలోపేతం చేయటానికి కృషి చేయాలనీ అదే విధంగా ఎమ్మార్పియస్ ఉద్యమానికి సహకారం అందిస్తామని తెలియజేసారు

## ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కుమారి మాయావతి ఘనంగా జన్మదిన వేడుకలు



రాజేంద్రనగర్ ప్రతినిధి(నేటి శుభోదయ): ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కుమారి మాయావతి ఘనంగా జన్మదిన వేడుకలు జరుపుకోవడం జరిగింది. రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్తా యందు డాక్టర్ బాబు జగ్జీవన్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతోత్సవాల కమిటీ చైర్మన్ పచ్చ నర్సింగ్ రావు ఆధ్వర్యంలో జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వనం నరసింహ మాదిగ, శంకర్రావు మాదిగ హాజరైనారు. ఈ సందర్భంగా కుమారి మాయావతి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా నాలుగు పర్యాయాలు చేయడం జరిగిందని వారి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు సమన్యాయం జరగాలని కోణంలో రాజ్యాధికారం చేపట్టి పేద ప్రజలకు ప్రభుత్వపరంగా అనేక సంక్షేమ పథకాలు వారి అభివృద్ధి కోసం పాటుపడడం జరిగిందని అన్నారు.అనేక చట్టాలు భూసంస్కరణలు చేయడం జరిగినది అని గుర్తు చేసారు.ఈ కార్యక్రమంలో ఫార్మసిస్టు డిఎస్పి నాయకులు పచ్చ అనిత, మరియు ఆదిరాల శ్రీనివాస్ దళిత, నాయకులు, టిఆర్ఎస్ ఉద్యమకారులు వినాయక ప్రీతం రాజ్, వీర్లపల్లి నవీన్, పత్యర నరసింహ, ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ మంత్రి శేఖర్, పి,రమేష్ దాసర రమేష్, గొడుగు . సంజీవ. అడ్వకేట్ దేశాల భూపాల్, షాబాద్ రవి, న్యాలట ప్రవీణ్ కుమార్, జేమ్స్, ఈ . వేణు, తదితరులు పాల్గొన్నారు.

## డయాలసిస్ యూనిట్లను ప్రజలకు అందుబాటులోకి తేవాలి

**జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జనవరి 15, (నేటి శుభోదయ): కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి అదనంగా



కేటాయించ బడిన డయాలసిస్ యూనిట్లను త్వరితగతిన అందుబాటులోకి తేవాలని జిల్లా కలెక్టర్ జితేశ్వి పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు. ఆసుపత్రిలో ప్రతి వార్డును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఔట్ పేషెంట్ వార్డులో ఎక్స్రే యంత్రం పనిచేయక పోవటానికి గమనించి దీనిని ఎందుకు వాడటం లేదు అని సిబ్బందిని ప్రశ్నించారు, అది పాడైందని సిబ్బంది చెప్పగా కొత్త ఎక్స్రే యంత్రాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆసుపత్రిలో ఎంతమంది డ్యూటీ డాక్టర్లు మరియు సిబ్బంది అందుబాటులో ఉన్నారు అని తనిఖీ చేశారు. ఆస్పత్రి ఆవరణలో చేపడుతున్న డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ పనులు వారం రోజులలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



డ్రైనేజీ పనులను త్వరితగతిని పూర్తి చేసి డయాలసిస్ యూనిట్లు ప్రజల అవసరానికి ఉపయోగపడేలా త్వరితగతిన ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా క్యాజువాలిటీ వార్డును మరొక చోటికి షిఫ్ట్ చేయాలని అధికారులు ఆదేశించారు. సివేస్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అన్నారు. ఈ పరిశీలనలో ఆసుపత్రి సిబ్బంది ఆర్ అండ్ బి అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు అధికారులందరూ అంకితభావంతో పనిచేయాలి

- జనవరి 26న అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాలు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను విజయవంతం చేయాలి.
- లబ్ధిదారుల ఎంపిక అనేది నిరంతర ప్రక్రియ.
- మొదటి విడతలో నిరుపేదలకు ప్రాధాన్యం.
- జిల్లా, మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలి.
- ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా అనుసరించాలి.
- ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోగా లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జనవరి 15, (నేటి శుభోదయ ): అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన తో కలిసి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ కొత్తగూడెం మరియు భద్రాచలం ఆర్డీవోలు, తాసిల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీ ఓలు మరియు తదితర అధికారులతో ప్రతిష్టాత్మకంగా జనవరి 26న అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాల (రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త ఆహార భద్రత కార్డులు (రేషన్ కార్డులు), ఇందిరమ్మ ఇళ్లు) విధివిధానాల పై టెలికాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల వంటి కీలకమైన నాలుగు సంక్షేమ పథకాల అమలును జనవరి 26న ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లా, మండల స్థాయి అధికారులందరూ నిబద్ధతతో పనిచేయాలని పేర్కొన్నారు. గ్రామ సభలను పక్కాగా నిర్వహించాలని, ఈ నెల 16 నుంచి 20 వరకు చేపట్టే క్షేత్రస్థాయి సర్వే లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అత్యంత జాగ్రత్తగా ఈ ప్రక్రియను సజావుగా పూర్తిచేయాలని, అలాగే 16 నుంచి 20 వరకు లబ్ధిదారుల ముసాయిదా జాబితా తయారీలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని, 21 నుంచి 24 వరకు నిర్వహించే గ్రామ సభలు పక్కాగా జరిగే విధంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని, 21 నుంచి 25 వరకు డేటా ఎంట్రీ లో తప్పులు దొర్లకుండా చూడాలని, ఫ్లెక్సీ లు, మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాలని, అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల నోటీసు బోర్డులో ప్రచురించాలని, గ్రామ సభల్లో వచ్చే ఫిర్యాదుల పై రిజిస్టర్ లను, కంట్రోల్ రూం లను ఏర్పాటు చేసి, అర్జీలను స్వీకరించాలని, ఈ సర్వే, గ్రామ సభల పట్ల ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని, విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని, ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు.

### రైతు భరోసా పథకం

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందు కు గాను వ్యవసాయ యోగ్యమైన భూములకు పంట పెట్టుబడి సాయం కింద ఎకరాకు రూ. 6000 చొప్పున రెండు విడతలుగా రూ. 12,000 భూ భారతి (ధరణి) పోర్టల్ లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూమికి మాత్రమే రైతు భరోసా చెల్లిస్తుందని, అలాగే ఇళ్లు (లేదా) కాలనీలుగా మారిన అన్ని రకాల భూములు, రియల్ ఎస్టేట్ భూములు, లేఅవుట్ చేసిన భూములు, నాలా కన్వర్షన్ చేసిన భూములు, మైనింగ్ చేస్తున్న భూములు, గోదాములు నిర్మించిన భూములు, వివిధ ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం సేకరించిన భూములు, రాళ్ళు, రప్పలు, గుట్టలతో నిండి, సాగుకు అనువుగా లేని భూములను గుర్తించి, తొలగించాలని సూచించారు. ఈ నెల 16వ తేదీ నుంచి ప్రతి రెవెన్యూ గ్రామాల వారీగా ఏఈఓ, ఆర్ఐ, సర్వేయర్ లు ఒక బృందంగా ఏర్పడి, కలిసికట్టుగా పనిచేయాలని, ఇందుకోసం ఆయా మండలాల తహసీల్దార్, మండల వ్యవసాయాధికారి బాధ్యులుగా ఉంటారని, వారు సంయుక్తంగా జాబితాలోని అన్ని సర్వే నంబర్ లను క్షేత్రస్థాయిలో సందర్శించి, వ్యవసాయానికి యోగ్యం కానీ భూములను ధృవీకరించు కోవాలని ఆదేశించారు. 3 లేదా 4 గ్రామాలకు కలిపి ఒక మండల స్థాయి క్లస్టర్ నోడల్ అధికారిని నియమించాలని, అలాగే ఈ ప్రక్రియ మొత్తాన్ని మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల రెవెన్యూ రికార్డులన్నీ క్రోడీకరించు కోవడంతో పాటు గ్రామాల మ్యాపులను పరిశీలించాలన్నారు. ఈ యోగ్యం కాని భూముల జాబితాను ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత జాగ్రత్తగా రూపొందించాలని, ఈ జాబితాను గ్రామ సభల్లో ప్రదర్శించాలని, చదివి వినిపించాలని, చర్చించిన తర్వాతనే వెల్లడించాలని తెలిపారు.

### ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమి లేని వ్యవసాయ కూలి కుటుంబానికి రూ. 6000 చొప్పున రెండు విడతలుగా రూ. 12,000 నగదు సాయం అందించనున్న నేపథ్యంలో 2023-24 సంవత్సరానికి గాను కనీసం 20 రోజులు ఉపాధి హామీ పని దినాలు పూర్తిచేసుకున్న భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబానికి ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. ఇందుకోసం రాష్ట్రస్థాయి నుంచి జిల్లాల వారీగా వచ్చిన ముసాయిదా అర్హుల జాబితాలో లబ్ధిదారుల ను గుర్తించే ప్రక్రియలో భాగంగా ఉపాధి హామీ కూలీ గుర్తింపు కార్డును, ఆధార్ కార్డుతో లింక్ చేయాలని, లేని వాటిని నవీకరించాలని, ఈ ప్రక్రియకు బాధ్యులుగా ఎంపిడిఓ ఉంటారని, ఎంపిడిఓలు, ఎంపిఓలు సమన్వయం%ఎ%తో పనిచేయాలని, అలాగే ప్రతి గ్రామ సభల్లో ఈ జాబితాను ప్రచురించాలని, చదివి వినిపించాలని, ఎలాంటి అపోహలు తలెత్తకుండా గ్రామ సభల్లో చర్చించి, ఆమోదించడం జరుగుతుందని సూచించారు. ఒకవేళ ఏమైనా అభ్యంతరాలు గ్రామ సభల్లో వస్తే, వాటిని స్వీకరించి, పరిశీలించి, పది రోజుల్లోగా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### కొత్త రేషన్ కార్డులు

కొత్త ఆహార భద్రత కార్డులు (రేషన్ కార్డులు) పథకంలో భాగంగా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికి ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. రాష్ట్ర స్థాయి నుంచి అన్ని జిల్లాల వారీగా కుల గణన సర్వే ఆధారంగా తయారు చేసిన రేషన్ కార్డులు లేని పేద కుటుంబాల జాబితా ప్రకారం పరిశీలించాలని, ఇందుకోసం జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), డీసీఎస్ఓ పర్యవేక్షకులుగా వ్యవహరించాలని, మండల స్థాయిలో ఎంపిడిఓ, మున్సిపాలిటీలో మునిసిపల్ కమిషనర్ ఈ మొత్తం ప్రక్రియకు బాధ్యులుగా ఉంటారని, అలాగే భూములు, ఆదాయం తదితర అంశాలను రెవెన్యూ ఇన్స్పెక్టర్ లు గుర్తించాలని, పంచాయతీ కార్యదర్శులు కుటుంబాల వివరాలను సేకరించాలని సూచించారు. అందుకు సంబంధించిన ఫీల్డ్ వెరిఫికేషన్ ఫార్మ్ లో కుటుంబాల సమగ్ర వివరాలను తప్పులు లేకుండా నమోదు చేసి, ఈ ముసాయిదా జాబితాను గ్రామ, వార్డు సభల్లో ప్రదర్శించాలని, చదివి వినిపించాలని, చర్చించిన తర్వాతే అమోదించడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే ఒక రేషన్ కార్డు ఒక వ్యక్తికి ఒకే చోట ఉండాలన్నారు.

### ఇందిరమ్మ ఇళ్ల పథకం

ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద జీఓ నంబర్ 7 ప్రకారం దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న గృహాలు, ఇళ్లు లేనివారు, పూరిగుడిసెలు ఉన్నవారు, అద్దె ఇళ్లలో నివాసం ఉన్నవారు, నిర్మాణానికి స్థలం ఉన్నవారు అర్హులను తెలిపారు. ఇందులో భాగంగా మట్టి గోడలు, పైకప్పు లేని గృహాలు, వితంతువులకు, భూమిలేని వ్యవసాయ కూలీలు, పారిశుద్ధ్య కార్మికులు, దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇందుకోసం ఈ నెల 18 లోగా ఎంపిడిఓలు, మునిసిపల్ కమిషనర్ లాగిన్ లలో ఎటువంటి లోపాలు దొర్లకుండా సూపర్ చెక్ ను పూర్తిచేయాలని ఆదేశించారు. ఒక కుటుంబానికి ఒకటే ఇల్లు కేటాయించేందుకు గాను ఏఐ, జియో ట్యాగింగ్ ద్వారా డీడూప్లికేషన్ చేయాలని సూచించారు. అలాగే ఏమైనా పొరపాట్లు ఉంటే పీడీ హౌసింగ్ కు పంపించాలని, వివరాలను సరిదిద్దేందుకు ఎడిట్ ఆప్షన్ కల్పించినట్లు వివరించారు. అదే విధంగా గ్రామ సభల నిర్వహణకు యాక్షన్ ప్లాన్ ను తయారు చేయాలని, గ్రామ సభలకు ఆర్ఐ, ఏఈఓ, పంచాయతీ కార్యదర్శి బృందంగా ఏర్పడాలని, వార్డు సభలకు వార్డు అధికారి, డిప్యూటీ తహసీల్దార్, ఏఈ బృందంగా ఉండాలని, 4 (లేదా) 5 గ్రామాలకు కలిపి క్లస్టర్ వారీగా ఎంపిడిఓ, తహసీల్దార్, సూపరింటెండెంట్ సమన్వయ బృందంగా నియమించాలని సూచించారు. ఈ మొత్తం సంక్షేమ పథకాల ప్రక్రియలు మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ ప్రక్రియకు సరిపడా కంప్యూటర్ లను ఏర్పాటు చేయాలని, డేటా ఎంట్రీ ఆపరేటర్ లను అందుబాటులోకి తీసుకోవాలని, ప్రతి క్లస్టర్ వారీగా ఒక సిస్టమ్ ఉండాలన్నారు. అలాగే ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రతులను, గ్రామ సభల తీర్మాన ప్రతులను సురక్షితంగా, ఎంతో జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు.

## వెల్జాల్ లో ముగిసిన క్రికెట్ పోటీలు

**హాజరైన మాజీ ఎం.పీ.పీ సి.ఎల్.శ్రీనివాస్ యాదవ్**

**వెల్జాల్ ప్రీమియర్ లీగ్-11(క్రికెట్) పోటీలు**

**ఆంధ్రాలో కోడిపందాలు,వెల్జాల్ లో క్రికెట్ పోటీలు**



తలకొండపల్లి**(నేటి శుభోదయ):** రంగారెడ్డిజిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో సంక్రాంతి పండగ సందర్భంగా గత ఐదు రోజులుగా నిర్వహించిన వెల్జాల్ ప్రీమియర్ లీగ్- 11(క్రికెట్) పోటీలు 11స్టార్స్ టీమ్ ఆధ్వర్యంలో విజయవంతంగా ముగిశాయి.గ్రామంలోని ఉన్నత పాఠశాలలో బుధవారం



ఏర్పాటుచేసిన బహుమతుల ప్రధాన ఉత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీపీ సి.ఎల్ శ్రీనివాస్ యాదవ్,ముఖ్య అతిథులుగా హాజరై విజయం సాధించిన జట్లకు బహుమతులను అందజేశారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సంక్రాంతి పండగకి గ్రామంలో క్రికెట్ పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉంది. సంక్రాంతి అంటే అందరూ ఆంధ్రప్రదేశ్ వెళ్లి పోతారు,కానీ మన గ్రామంలో నిర్వహించిన వెల్జాల్ ప్రీమియర్ లీ క్రికెట్ పోటీలు చూడడానికి హైదరాబాద్ నుండి మన గ్రామం,పెద్దలు,యువకులు,క్రికెట్ చూడడానికి రావడం సంతోషంగా వుంది. గ్రామంలోని యువత క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ వహించి,రోజు ప్రాక్టీస్ చేయాలని, కేవలం పండగల సందర్భంగానే ఆడితే ఆటల్లో విజయం సాధించడం కష్టమని అన్నారు. ప్రతి సంవత్సరం నిర్వహించే సంక్రాంతి పండగ సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ కు మా వంతుగా మొదటి బహుమతి15,000/- పదిహేను వేల రూపాయలు,మరియు మా నాన్న కీర్తిశేషులు సి. జంగయ్య యాదవ్ (రిటైర్డ్ హెడ్మాస్టర్) ఆయన జ్ఞాపకార్థంగా కప్పులు, షీల్డ్ లు బహుమతి ఇవ్వడం సంతోషంగా ఉంది. క్రీడాకారులకు ఎల్లవేళలా సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు. ద్వితీయ బహుమతి మాజీ ఉపసర్పంచ్ అజీజ్ తమవంతుగా 10,000/- పదివేల రూపాయలు ఇవ్వడం జరిగింది.క్రీడాకారులకు టీ షర్ట్స్ అందించిన (వి.ఎస్.ఆర్ కన్స్ట్రక్షన్స్) వనరాశి వెంకటేష్ మాట్లాడుతూ వెల్జాల్ గ్రామంలో సుమారు 200 మంది వరకు క్రీడాకారులు క్రికెట్లో పాల్గొన్నారు అంటే ఎంతో సంతోషంగా ఉందని, క్రీడలతో పాటు చదువుపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు.మొదటి బహుమతి సాధించిన వెల్జాల్ ఇండియన్స్ టీం వెల్జాల్ ప్రీమియర్ లీగ్ వ్యవస్థాపకుడు సిహెచ్ విష్ణువర్ధన్ యాదవ్ టీంకు15,000/- వేలరూపాయల నగదును అందించారు.రెండో స్థానంలో నిలిచిన వెల్జాల్ రైడర్స్ టీంకు ఉప సర్పంచ్ అజీజ్10,000/- వేల నగదును నాయకులు అందించారు.అదేవిధంగా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ కింద ఎంపికైన క్రీడాకారులకు అందజేశారు.ప్రతిరోజు నిర్వహించిన పోటీలలో విజయం సాధించిన జట్లకు మ్యాన్ ఆఫ్ మ్యాచ్ కింద షీల్డ్ లు అందజేయడం జరిగింది.వెల్జాల్ ప్రీమియర్ లీగ్ వ్యవస్థాపకుడు విష్ణువర్ధన్ యాదవ్ మాట్లాడుతూ ఈ టోర్నమెంట్ లో మా గెలవడం సంతోషంగా ఉంది.ఈ టోర్నమెంట్ విజయవంతం కావడానికి సహకరించిన 11 స్టార్స్ టీమ్ ఆర్గనైజర్స్ గా నిర్వహించడం సంతోషంగా ఉంది.క్రికెట్ అంటే నాకు చాలా ఇష్టం మన గ్రామంలో సంక్రాంతి పండగ కు యువకులంతా గ్రామానికి వస్తారు.కాబట్టి క్రికెట్ టోర్నమెంట్ పెడితే బాగుంటుందని ఆలోచనతో వెల్జాల్ ప్రీమియర్ లీగ్ ప్రారంభించడం జరిగింది. అంచలంచలుగా ఎదుగుతూ 11 వ సీజన్ కు చేరుకోవడం సంతోషం అనిపిస్తుంది. ఈ టోర్నమెంట్ విజయవంతం కావడానికి సహకరించిన దాతల కు



హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. యువకులందరూ క్రీడలు ఒక్కటే ముఖ్యం కాకుండా జీవితంలో స్థిరపడాలని సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యుడు ముజేబర్ రహమాన్, ఆమనగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెర్ల వెంకటరెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ కూన రవికుమార్,మాజీ ఎంపిటిసి అంబాజీ,మాజీ ఉపసర్పంచ్ అజీజ్,(వి.పీ.ఎల్) వ్యవస్థాపకుడు సి.హెచ్. విష్ణువర్ధన్ యాదవ్,(వి.ఎస్.ఆర్ కన్స్ట్రక్షన్స్)వానరాశి వెంకటేష్,గోపాలకృష్ణ,విజయ్ కుమార్,అబ్బాస్,స్వామి, ఆరిఫ్,శ్రీను, శ్రీరామ్,ఖయ్యూ,శేఖర్,విజయ్ కుమార్,గౌస్,సుధాకర్, రాఘవేందర్ ,ప్రసాద్,శ్రీనివాసులు,రాము,శ్రీశైలం,శివ, ఆంజనేయులు, విష్ణు, వేణు, గణేష్,క్రీడాకారులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ పల్నాడు జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షునిగా కొమ్ము. చంద్రశేఖర్ నియామకం

**ఆదేశాలు జారీచేసిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్. జగన్ మోహన్ రెడ్డి**



**(నేటి శుభోదయ):** 15 జనవరి పల్నాడు జిల్లా కారంపూడి: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షునిగా మాచర్ల నియోజకవర్గం కారంపూడికి చెందిన కొమ్ము. చంద్రశేఖర్ ను నియమిస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు జారీచేసారు. కొమ్ము. చంద్రశేఖర్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ముఖ్యంగా మాచర్ల నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఎంతగానో కృషిచేసారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో కొమ్ము. చంద్రశేఖర్ కు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చి అయన కుమార్తెను దుర్గి మార్కెట్ యార్డ్ చైర్మన్ గా నియమించడం జరిగింది. ప్రస్తుతం కొమ్ము. చంద్రశేఖర్ పల్నాడు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. అయన సేవలను పార్టీ మరింత ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో దళిత సామజికవర్గానికి చెందిన కొమ్ము. చంద్రశేఖర్ కు పార్టీ ఆయనకు పల్నాడు జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షునిగా నియమించింది. ఈ సందర్బంగా కొమ్ము. చంద్రశేఖర్ మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని తనను నియమించిన రాష్ట్ర వైసీపీ అధ్యక్షులు వైఎస్. జగన్ మోహన్ రెడ్డి, రాష్ట్ర ఎస్సి సెల్ అధ్యక్షులు టి. జే. ఆర్ సుధాకర్ బాబు, మరియు తన నియామకానికి సహకరించిన మాచర్ల మాజీ ఎమ్మెల్యే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి.రామకృష్ణరెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర నాయకులు పిన్నెల్లి. వెంకటరామిరెడ్డి లకు ఈ సందర్బంగా అయన ధన్యవాదములు తెలిపారు. కొమ్ము. చంద్రశేఖర్ నియామకం పట్ల కారంపూడి మండలంలోని వైసీపీ నాయకులు, మాచర్ల నియోజకవర్గంలోని పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

# రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలందరికీ శంషాబాద్ గ్రామ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

**సంక్రాంతి వేడుకలు ఆనందానికి, సాంస్కృతిక వైభవానికి ప్రతీకలు**

**కౌన్సిలర్ మేకల వెంకటేష్ ముదిరాజ్**



శంషాబాద్ ప్రతినిధి జనవరి 15(నేటి శుభోదయ): మకర రాశిలోనికి సూర్య భగవానుడి ప్రవేశంతో ప్రారంభమయ్యే ఉత్తరాయణ పుణ్యకాల శుభసమయాన తెలంగాణ యావత్తు ప్రజానీకం, మరియు రాజేంద్రనగర్ నియోజకవర్గ, శంషాబాద్ పురనివాసులకు, మరియు ప్రజలందరూ మకర సంక్రాంతి, కనుమ పండుగలను బంధువులు స్నేహితులతో కలిసి కుటుంబ సభ్యులందరూ ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని, మహిళా సోదరీమణులు అందరూ తమ అద్భుతమైన రంగవల్లులతో ఇంటి లోగిళ్లను సర్వాంగ సుందరంగా గొబ్బిళ్ళతో అలంకరించి నూతనత్వంతో ఇంటిల్లి పాదిని సంతోషపరచాలని, పిల్లలు యువకులు పతంగుల ఎగిరివేత కేరింతల నడుమ ఆనందోత్సాహాలతో సంతోషంగా గడపాలని, ఈ సంక్రాంతి మీ అందరి జీవితాల్లో వెలుగులు, సంతోషాలు నింపుతూ, సిరి సంపదలు, రైతుల ఇంట ధాన్యపు రాసులతో, పశు సంపదలతో, ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో జీవించాలని రైతుల ఇంట ఆనందాలు...పల్లెల్లో భోగభాగ్యాలు...ఇంటింటా సిరిసంపదలు తెలంగాణ ప్రజల్లో సంతోషాలు కలకాలం వెల్లివిరియాలని అందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ మేకల వెంకటేష్ ముదిరాజ్ మీకు, మీ కుటుంబ సభ్యులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

# టిడిపి శాశ్వత సభ్యత్వం స్వీకరించిన చంద్ర



వరికుంటపాడు **(నేటి శుభోదయ):** ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండల టిడిపి సీనియర్ నాయకులు మండల కన్వీనర్ ఉదయగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ చంద్ర మధుసూదన్ రావు ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో లక్ష రూపాయలు చెల్లించి టిడిపి శాశ్వత సభ్యత్వం స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా కాకర్ల సురేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా టిడిపి సభ్యత్వ నమోదు భారీ స్థాయిలో నమోదు కావడం జరిగిందని అలాగే శాశ్వత సభ్యత్వాలు కూడా అదే స్థాయిలో జరుగుతున్నట్లు అన్నారు. శాశ్వత సభ్యత్వం స్వీకరించిన టిడిపి కన్వీనర్ చంద్ర మధుసూదన్ రావు ను కాకర్ల అభినందించారు.

# ఘనంగా చిలుకూరులో సంక్రాంతి భోగి కనుమ వేడుకలు

**చైనా మాంజాతో జాగ్రత్త**

**ప్రతి ఒక్కరూ ప్రతి సంవత్సరం దారం మాంజను వాడాలి**




మొయినాబాద్ జనవరి 15(నేటి శుభోదయ): మండలంపరిధిలోని చిలుకూరు గ్రామంలో యవకులు సంక్రాంతి, కనుమ ,భోగి సందర్భంగా చిన్న పెద్ద అంతా కలిసి గాలిపటాలు ఎగరవేశారు ,చైనా మాంజాతో జరిగే అనర్ధాలపై పిల్లలకు అవగాహన కల్పిస్తూ యువకులు గాలిపటాలు ఎగరేసేటప్పుడు జాగ్రత్త వహించాలని చైనా మాంజాతో పలువురు వాహనదారులు, పక్షులు, సైనికకులు, వాహనదారులు, మరణించిన ఘటనలు అందరికీ తెలిసిన సంఘటనని చైనా మాంజా వాడకూడదని సంక్రాంతికి జరుపుకోవాలని గ్రామస్తులందరూ సుఖశాంతులతో ఉండాలని గ్రామ యువకులు కోరారు

# ప్రమాదవశాత్తు ఆటో డ్రైవర్ మృతి





మొయినాబాద్, జనవరి 15 (నేటి శుభోదయ) : రోడ్డు ప్రమాదంలో ఓ ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన మంగళవారం మొయినాబాద్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, ఫిర్యాదురాలు తెలిపిన మేరకు వివరాలు.. సురంగల్ గ్రామానికి చెందిన మర్ల ప్రవీణ్ కుమార్(పెంటయ్య )(41) వృత్తిరీత్యా ఆటోడ్రైవర్. మంగళవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ఆటో డ్రైవర్ మర్ల ప్రవీణ్ మొయినాబాద్ నుంచి సురంగల్ కు వెళ్తున్నాడు. కాగా మార్గమధ్య లో మెహబూబ్ కాలనీ దగ్గర ప్రమాదవశాత్తు తన ఆటో అదుపుతప్పి పడిపోవడంతో ప్రవీణ్ కు రక్త గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నానల్ నగర్ ప్రీమియం ఆసుపత్రికి తీసుకువెళ్లారు. కాగా తీవ్ర రక్తస్రావం జరిగి తను అప్పటికే మరణించడం జరిగిందని వైద్యులు నిర్ధారించారు. మృతుని భార్య మర్ల లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నామని మొయినాబాద్ పోలీసులు తెలియజేశారు.

# డివి ఆధ్వర్యంలో ఆక్సిజన్ సిటీలో సందడి సందడిగా జరిగిన సంక్రాంతి సంబరాలు

**2500 మందికి పైగా పట్టణ ప్రజలు హాజరు**

పామూరు**(నేటి శుభోదయ):** కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలో సంక్రాంతి పండుగ సందర్భంగా మాజీ సర్పంచ్ డివి మనోహర్ ఆధ్వర్యంలో కందుకూరు రోడ్డులోని ఆక్సిజన్ సిటీ నందు సంక్రాంతి సంబరాలు సందడి సందడిగా నిర్వహించారు. ఈ






సందర్భంగా పట్టణంలోని పిల్లలు, మహిళలు భారీ సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని సంక్రాంతి సంబరాలు ఆనందంగా జరుపుకున్నారు.

**అలరించిన కోలాటం, మ్యూజికల్ చైర్స్, పాటకచేరి కార్యక్రమాలు**

సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆక్సిజన్ సిటీలో నిర్వహించిన కోలాటం, మ్యూజికల్ చైర్స్, పాటకచేరి, స్లో సైకిల్, స్పీడ్ సైకిల్,గాలిపటాలు, ముగ్గుల పోటీలు అందరిని అలరించాయి. ఈ సందర్భంగా డివి మనోహర్ కుమార్తె డివి మౌనిక నిర్వహిస్తున్న ఆరోగ్య నూట్రిమిక్స్ పై పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. కల్తీ లేని, కెమికల్స్ వినియోగం లేని ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల వ్యాధులకు దూరంగా ఉండొచ్చని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా పామూరు మాజీ సర్పంచ్, స్వయంకృషి సేవా సంస్థ అధ్యక్షులు డివి మనోహర్ మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలను ప్రతి సంవత్సరం పట్టణ ప్రజలతో కలిసి జరుపుకోవడం సంతోషం గా ఉందని అన్నారు. భారీ స్థాయిలో మహిళలు పిల్లలు పాల్గొనడం వలన ఈ కార్యక్రమ%శీ% మరింత కలర్ ఫుల్ గా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ఏఎంసీ చైర్మన్ యార వ శ్రీనివాసులు, డివీ మనోహర్,, మెంటా నరసింహారావు, బొల్లా నరసింహారావు, ఉప్పలపాటి హరిబాబు, నీరు కట్టు నాయబ్ రసూల్ ,పిడుగు శ్రీనివాసులు, వరి కూటి హనుమంతరావు, చిరంజీవి, చిట్టిబాబు, సరాబు చంద్ర, నాగరాజు, పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు

# అపార్ కార్డ్ గురించి అవగాహన కలిగి ఉండాలి

**టిజిపిఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు దార మధు**



మంథని/పెద్దపల్లి/ధర్మారం, చేరాలరవీందర్ నేత, జనవరి 15 (నేటి శుభోదయ ): అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలలో ఎయిడెడ్ స్కూల్స్ లలో, కాలేజీలలో అపార్ కార్డు గురించి విద్యార్థులకు, తల్లిదండ్రులకు ప్రత్యేక అవగాహన కల్పించాలని తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాష్ట్ర నిజ నిర్ధారణ కమిటి కన్వీనర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జీ దార మధు అన్నారు. ధర్మారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అపార్ అంటే ఆటో మేటెడ్ పర్మనెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ అని తెలిపారు. దీనిని కేంద్ర ప్రభుత్వం ఇంప్లిమెంట్ చేస్తున్నారని అన్నారు. అందరికి ఆధార్ కార్డు ఉండి దానిలో 12అంకెల నంబర్ ఉంటుందని ఆ నంబర్ కొడితే అందరి బయోడేటా తెలుస్తాయని అన్నారు. అలాగే పాన్ కార్డుతో ఆర్థిక లావాదేవీలు తెలుస్తాయని, ఆధార్ కార్డు దేశ పౌరునిగా ఏ విధంగా గుర్తింపునిస్తుందో అలాగే విద్యార్థులకు కూడ కేజీ టు పీజీ వరకు ప్రైవేటు ప్రభుత్వ కాలేజీ యూనివర్సిటీలలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో వారికి ఒక ఐడి కార్డు ఎలా జారీ చేస్తారో ఆ ఐడి కార్డు పేరే అపార్ అంటారని తెలిపారు. దీని వల్ల విద్యార్థులకు చాలా వరకు బెనిఫిట్స్ జరుగుతాయని అన్నారు. అవి ఏంటంటే ఆన్లైన్లో ఏదైనా అప్లై చేయాలంటే అన్ని సర్టిఫికెట్స్ తో వెళ్లాలి ఏదైనా జాబ్ కి వెళ్లాలంటే అన్ని సర్టిఫికెట్స్ తో ఉన్న ఒక ఫైల్ తో వెళ్లాలి ఏదైనా సర్టిఫికెట్ ఎక్కడైనా పోతుందేమోనని భయంతో జాగ్రత్తగా వెళ్తామని భౌతికంగా మన వద్ద ఉండవలసినది ఇలాంటి సందర్భాల్లో మన సర్టిఫికెట్స్ పోగొట్టుకున్న వాటిని ఈ అపార్ట్ కార్డు ద్వారా పొందవచ్చునని తెలిపారు. భౌతికంగా, ఫిజికల్ గా ఎలాంటి సర్టిఫికెట్స్ వెంట తీసుకు వెళ్లకుండా అపార్ కార్డు నెంబర్ ఇస్తే ఉద్యోగాలకు, పాఠశాల, కాలేజీ, యూనివర్సిటీలలో మార్చుకొనుటకు సులువుగా ఉంటుందన్నారు. భవిష్యత్తులో విద్యార్థులకు ఈ అపార్ కార్డు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. బర్త్ సర్టిఫికెట్స్ లో ఒక పేరు స్పెల్లింగ్ మిస్టేక్స్ తో ఉంటుంది, స్టడీ సర్టిఫికెట్స్ లో స్పెల్లింగ్ మిస్టేక్స్ తో ఒక పేరు ఉంటుంది, తల్లిదండ్రుల పేర్లలో స్పెల్లింగ్ మిస్టేక్స్ తో ఉంటాయి వీటిని సరి చేసుకోవడానికి ఈ ఆపార్ కార్డు ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి తల్లిదండ్రులు, విద్యార్థులు ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్ తో, కరస్పాండెన్స్ తో సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. పోయిన సర్టిఫికెట్లను తిరిగి పొందటానికి ఈ అపార్ కార్డు ఎంతో ఉపయోగ ఉంటుందని అన్నారు. అపార్ ప్రతి విద్యార్థికి ఒక ప్రత్యేక ఐడిగా జీవితాంతం ఉపయోగపడుతుందన్నారు. జాతీయ విద్యా విధానం 2020 లో కేంద్ర విద్యా విధాన పరిషత్ అన్ని రాష్ట్రాలలోనూ ఈ అపార్ కార్డును పాస్ చేయించిందని అన్నారు. ఆధార్, బర్త్, స్కూల్ సర్టిఫికెట్స్ లో తప్పులు లేకుండా చూసుకోవలసిన బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలని దార మధు తెలిపారు. ఈ కార్యక్రమంలో టి.జి.పి.ఏ జిల్లా నాయకులు సుంచు మల్లేశం, కాల్వ కుమార్, వడ్కాపురం రవి. తదితరులు పాల్గొన్నారు.

# కార్మికశాఖ మంత్రిని శాలువాతో సత్కరించిన నగర వాసులు



ఏపీ మంత్రి వాసంశెట్టి సుభాష్ ను మర్యాదపూర్వకంగా కలసిన కోరని కిరణ్ కుమార్ మిత్ర బృందం

మొగల్తూరు 15 జనవరి **(నేటి శుభోదయ):** ఆంధ్ర మిత్రుల ఆహ్వానం మేరకు సంక్రాంతి పండుగ ఉత్సవాలలో పాల్గొనేందుకు నగరం నుండి కోరని కిరణ్ కుమార్ మిత్ర బృందం పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు చేరుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కోరన్ కిరణ్ కుమార్ మిత్ర బృందం ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. మూడు రోజుల సంక్రాంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు దేశం నలుమూలలో నుండి ఔత్సాహికులు ఉభయగోదావరి జిల్లాలో జరిగే సంక్రాంతి సంబరాల్లో పాల్గొనడం పరిపాటి. దీనిలో భాగంగా తెలంగాణ హైదరాబాద్ నగరం నుండి వేలల్లో పర్యాటకులు చేరుకోవడం ప్రతి ఏటా జరిగేది. ఆంధ్ర మిత్రులు ఆహ్వానం మేరకు మొగల్తూరు చేరుకున్న కోరని కిరణ్ కుమార్ స్నేహితుల బృందం. గత మూడు రోజులుగా ఉత్సాహంగా సంక్రాంతి వేడుకలలో పాలుపంచుకున్నారు. ఈ సమావేశంలో కోరని మహిపాల్, నర్వ భాస్కర్, రాజశేఖర్, జక్కంశెట్టి ప్రసాద్, నిరుడు సర్వేష్ కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ను కలసిన బృందంలో ఉన్నారు.

# భద్రాచలంలో ముచ్చటైన ముగ్గుల ఫోటోలు




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జనవరి 15, (నేటి శుభోదయ ): భద్రాచలంలో సంక్రాంతి, కనుమ



సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి. మహిళలు అందంగా వేసిన ముచ్చటైన ముగ్గుల ఫోటోలను పాత్రికేయులకు పంపించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం గ్రామానికి చెందిన భూక్య కుమారి, కైక వేసిన అందమైన ముగ్గు భద్రాచలం వాసులను ఆకట్టుకుంటోంది.

# మొగల్తూరు సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న నగరానికి చెందిన కోరని బ్రదర్స్



మొగల్తూరు 15 జనవరి **(నేటి శుభోదయ):** సంక్రాంతి సంబరాలు అంటే దేశం నలుమూలల్లో ఉన్న ఔత్సాహికులు జల్సారాయుళ్లు ఉభయ గోదావరి జిల్లాలో జరిగే ఉత్సవాల్లో పాల్గొనడానికి ప్రాధాన్యతనిస్తారు. రకరకాల పందెం పోటీలు ఈ వారం రోజులు ఔత్సాహికులను రంజింపచేస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదు. మిత్రుల పిలుపుమేరకు నగరం నుండి మొగల్తూరు చేరుకున్న గత మూడు రోజులుగా మొగల్తూరు పట్టణంలో ఉన్నారు. ఈ సందర్భంగా కోరని కిరణ్ కుమార్ తన సోదరుడు కోరని మహిపాల్, స్థానిక మిత్రుడు నర్వ భాస్కర్ తో కలసి దిగిన ఫోటో.

# సంజయ్‌ని నేనేం రాళ్లతో కొట్టలేదు: కౌశిక్‌రెడ్డి



హైదరాబాద్: కరీంనగర్ డీఆర్‌సీ మీటింగ్‌లో బట్టలు విప్పుతా అని ఎమ్మెల్యే సంజయ్ నన్ను రెచ్చగొట్టేలా మాట్లాడారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తెలిపారు. బుధవారం(జనవరి15) కౌశిక్‌రెడ్డి తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. 'మొదట సంజయ్ నాపై దాడి చేశారు. శ్రీధర్ బాబు నన్ను వేలు చూపుతూ బెదిరించారు. కాంగ్రెస్ నేతల ఆదేశాలతో పోలీసులు రౌడీలుగా తయారయ్యారు. రైతు భరోసా కోసం ప్రశ్నించా. రైతు రుణ మాఫీ 50 శాతం అయ్యింది పూర్తి చేయండని రైతుల పక్షాన అడిగాను అందులో తప్పేముంది. సంజయ్ ఏ పార్టీ నుంచి ఏ గుర్తుతో గెలిచిండు. సంజయ్ వార్డు మెంబర్‌గా కూడా గెలవలేదు. కేసీఆర్ బొమ్మతో సంజయ్ గెలిచిండు. డబ్బులకు అమ్ముడుపోయిన సంజయ్ సిగ్గు లేకుండా స్పీకర్ నాపై ఫిర్యాదు చేసాడు. స్పీకర్‌కు సంజయ్ పై ఫిర్యాదు చేస్తా. మంత్రుల సమక్షంలో నేను కాంగ్రెస్ పార్టీ అని చెప్పిన సంజయ్ డిస్ క్వాలిఫై చేయాలి. రాజీనామా చేయకుండా పార్టీ మారితే రాళ్లతో కొట్టిస్తా అని రేవంత్ రెడ్డే అన్నారు. నేను రాళ్లతో కొట్టలేదు కదా..ప్రశ్నిస్తే నా పై కేసులా'అని కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు.

# కేబినెట్ విస్తరణపై టీపీసీసీ చీఫ్ కీలక వ్యాఖ్యలు




ఢిల్లీ: ఏఐసీసీ నేత కేసీ వేణుగోపాల్ నివాసంలో టీ కాంగ్రెస్ నేతల కీలక భేటీ ముగిసింది. ఈ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. సమావేశం అనంతరం తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. 'త్వరలో సూర్యాపేట లేదా ఖమ్మంలో రాహుల్ గాంధీ సభ ఉంటుంది. ఫిబ్రవరి మొదటి లేదా రెండవ వారంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తాం.ఈ నెలాఖరు వరకు నామినేటెడ్ పదవులు, కార్పొరేషన్ల చైర్మన్ల పదవులు భర్తీ చేస్తాం. ప్రభుత్వ, పార్టీ పనితీరు భేషుగ్గా ఉందని కేసీ వేణుగోపాల్ ప్రశంసించారు. కేబినెట్ విస్తరణ అంశంపై సీఎం, అధిష్టానం కలిసి నిర్ణయం తీసుకుంటారు. జీహెచ్‌ఎంసీ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కేసీ వేణుగోపాల్ దిశా నిర్దేశం చేశారు. పీసీసీ కార్యవర్గ కూర్పుపైనా సమావేశంలో చర్చ జరిగింది. కష్టపడి పనిచేస్తూ ప్రజల్లో ఉన్న వారికే పదవులు వస్తాయి'అని మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

## కేజ్రీవాల్, మనీష్ సిసోడియాలను విచారించేందుకు ఇడికి అనుమతి




న్యూఢిల్లీ : ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఢిల్లీ మాజీ సిఎం అరవింద్ కేజ్రీవాల్‌ను, మాజీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియాలను మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) కింద విచారించేందుకు కేంద్ర మంత్రిత్వశాఖ ఇడికి అనుమతినిచ్చింది. ఈ విషయాన్ని బుధవారం అధికారిక వర్గాలు వెల్లడించాయి. అయితే ఈ కేసులో పిఎంఎల్ఎ కింద ప్రాసిక్యూట్ చేయడానికి అవసరమైన అనుమతి లేకుండా ట్రయల్ కోర్టు ఛార్జిషీటును పరిగణనలోకి తీసుకుందని కేజ్రీవాల్ వాదించారు. ఈ విషయంపై ఆయన ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఢిల్లీలోని పిఎంఎల్ఎ స్పెషల్ కోర్టు కేజ్రీవాల్‌పై అభియోగాల నమోదుపై స్టే విధించింది. ఈ పరిణామాల నేపథ్యంలో తాజాగా కేంద్ర హోంమంత్రిత్వశాఖ కేజ్రీవాల్‌ని విచారించేందుకు ఇడికి అనుమతించింది. ఈ కేసులో ఇప్పటికే విచారించేందుకు సిబిఐకి అనుమతి లభించింది. కాగా, వచ్చే నెల 5వ తేదీన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. బుధవారంరోజే కేజ్రీవాల్ తాను పోటీ చేస్తున్న న్యూఢిల్లీ అసెంబ్లీ స్థానానికి నామినేషన్ వేయనున్నారు. ఈ తరుణంలో ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఇడి విచారణకు హోంశాఖ అనుమతినివ్వడంతో పొలిటికల్ హీట్ మరింత పెరిగింది.

## 2 యుద్ధనౌకలు, ఒక జలాంతర్గామిని ప్రారంభించిన ప్రధాని మోడీ



ముంబయి : భారత వాయుసేనలోకి మరో మూడు యుద్ధనౌకలు చేరాయి. అధునాతన ఐఎన్ఎస్ సూరత్, జలాంతర్గామి ఐఎన్ఎస్ నీలగిరి, ఐఎన్ఎస్ వాఘ్ షీర్ యుద్ధనౌకలను ముంబయిలోని నేవల్ డాక్‌యార్డ్‌లో ప్రధాని మోడీ బుధవారం ప్రారంభించారు. ఈ నౌకలను మోడీ జాతికి అంకితం చేశారు. ఈ యుద్ధనౌకలతో భారత నేవీ బలం మరింత పెరగనుంది. రక్షణ తయారీ, సముద్ర భద్రతలో గ్లోబల్ లీడర్‌గా ఎదగాలనే భారతదేశ కలను సాకారం చేయడంలో ఇది ఒక ముందడుగుగా నిపుణులు వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ %" % ప్రపంచంలో బలమైన శక్తిగా భారత్ మారుతోందన్నారు. భద్రమైన సముద్ర మార్గాల కోసం ప్రయత్నిస్తున్నామని, ఈ మూడు మేడిన్ ఇండియావి అని అన్నారు. తాము విస్తరణవాదంతో కాదు.. వికాసవాదంతో పనిచేస్తామని చెప్పారు. రక్షణ రంగంలో మేకిన్ ఇండియా ఆవిష్కృతం అవుతోందన్నారు. అలాగే, వన్ ఎర్త్.. వన్ ఫ్యామిలీ.. వన్ ఫ్యూచర్ అని అన్నారు. ఈ మూడు యుద్ధ నౌకలు భారత్‌కు మరింత శక్తినిస్తాయి అని చెప్పుకొచ్చారు. అంతర్జాతీయ కార్గో మార్గాలను భారత్ కాపాడుతోందన్నారు. నేవీ బలోపేతం వల్ల ఆర్థిక ప్రగతి కూడా కలుగుతుందన్నారు. ఐఎన్ఎస్ సూరత్.. పీ15బీ గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్ ప్రాజెక్ట్ కింద అభివృద్ధి చేస్తున్న నాలుగో యుద్ధనౌక అని చెప్పారు. ప్రపంచంలోనే భారీ, అత్యాధునిక డిస్ట్రాయర్ యుద్ధనౌకల్లో ఇదొకటి అని, ఇందులో స్వదేశీ వాటా 75 శాతం ఉందని వెల్లడించారు. ఈ యుద్ధనౌకలో అధునాతన ఆయుధ-సెన్సర్ వ్యవస్థలు ఉన్నాయన్నారు. నెట్‌వర్క్ సెంట్రిక్ సామర్థ్యం దీని సొంతమని చెప్పారు. ఐఎన్ఎస్ నీలగిరి.. పీ17ఏ స్టెల్త్ ఫ్రిగేట్ ప్రాజెక్టులో తొలి యుద్ధనౌక అని తెలిపారు. శత్రువును ఏమార్చే స్టెల్త్ పరిజ్ఞానంతో దీన్ని తయారుచేశారని వివరించారు. ఐఎన్ఎస్ వాఘ్ షీర్.. పీ75 కింద రూపొందిస్తున్న ఆరో, చివరి జలాంతర్గామి అని అన్నారు. ఫ్రాన్స్‌కు చెందిన నేవల్ గ్రూప్ సహకారంతో దీన్ని అభివృద్ధి చేశారని, ఐఎన్ఎస్ సూరత్ పొడవు 164 మీటర్లు. 1565 టన్నుల సామర్థ్యం కలిగి ఉందని ప్రధాని మోడీ తెలిపారు.

## మోడీ, అమిత్ షా ఫోటోలు వాడిన ఆప్ పై ఎఫ్ఐఆర్ నమోదు




ఢిల్లీ : ఎఐ ద్వారా రూపొందించబడిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల ఫోటోలు, వీడియోలను పార్టీ అధికారిక ఎక్స్ హ్యాండిల్‌లో పోస్ట్ చేశారనే ఆరోపణలతో ఢిల్లీ పోలీసులు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)పై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఎఫ్ఐఆర్ వివరాలు ఇవ్వకుండానే నార్త్ అవెన్యూ పోలీస్ స్టేషన్‌లో సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీ అధికారిక ఎక్స్ హ్యాండిల్‌లో ప్రధానమంత్రి, హోంమంత్రికి సంబంధించిన కొన్ని అభ్యంతరకరమైన ఫోటోలు, వీడియోల గురించి తమకు ఫిర్యాదు అందిందని ఆ వర్గాలు తెలిపాయి. ఆరోపించిన వీడియోలను జనవరి 10, 13 తేదీల్లో ఆప్ పోస్ట్ చేసింది. ఆప్-డీప్‌ఫేక్ టెక్నాలజీ ద్వారా రూపొందించబడిన వీడియోలలో ఒకటి 90ల నాటి బాలీవుడ్ చిత్రం నుండి విలన్ల ముఖాలను బిజెపి నాయకుల ముఖాలతో మార్చి, ఆడియోను ఢిల్లీ ఎన్నికలపై సంభాషణగా మార్చిన దృశ్యాన్ని చూపించిందని ఒక అధికారి తెలిపారు. ఫిర్యాదును విశ్లేషించిన తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేయబడిందని, దర్యాప్తు ప్రారంభించబడిందని అధికారి తెలిపారు. ఈ పరిణామంపై ఆమ్ ఆద్మీ పార్టీ స్పందిస్తూ, ఎన్నికలు దగ్గర పడుతున్నప్పుడు ఇది బిజెపికి సర్వసాధారణమని పేర్కొంది. ప్రజలకు సంబంధించిన నిజమైన సమస్యల నుండి దృష్టిని మళ్లించడానికి తప్పుడు కేసులు నమోదు చేయబడుతున్నాయని ఆరోపించింది. దీని తరువాత రాజకీయ కక్ష్యతో ముఖ్యమంత్రి అతిషి, మనీష్ సిసోడియాలను అరెస్టు చేసే అవకాశం ఉందని, వారిని లక్ష్యంగా చేసుకునే వారిపై సోదాలు చేసే అవకాశం ఉందని ఆప్ ప్రకటన ఆరోపించింది. "అయితే, ఓటర్ల జాబితాలను తారుమారు చేయడం, నకిలీ ఎంట్రీలను జోడించడం, నిజమైన ఓటర్లను తొలగించడం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలలో స్పష్టంగా పాల్గొన్న బిజెపి నాయకులపై, ఓట్లను కొనుగోలు చేయడానికి ప్రయత్నిస్తున్న వారిపై ఎటువంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ఆప్ ఆరోపించింది.

## హర్యానా బిజెపి చీఫ్ పై గ్యాంగ్ రేప్ కేసు నమోదు



కసౌలి : హిమాచల్ ప్రదేశ్ కసౌలిలోని ఒక హోటల్‌లో ఒక మహిళపై సామూహిక అత్యాచారం చేశారని హర్యానా బిజెపి చీఫ్ మోహన్‌లాల్ బడోలి, గాయకుడు జై భగవాన్ అలియాస్ రాకీపై కేసు నమోదు అయింది. పోలీసులు ఈ ఇద్దరు వ్యక్తులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు అధికారులు మంగళవారం తెలిపారు. ఎఫ్ఐఆర్ కాపీ మంగళవారం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఎఫ్ఐఆర్ ప్రకారం, స్నేహితురాలితో కలిసి కసౌలిలోని ఒక హోటల్‌లో బస చేస్తున్నప్పుడు బడోలి, రాకీలను కలిశానని పేర్కొన్నారు. నటిగా మారేందుకు అవకాశం ఇస్తానని, తను తీయబోయే మ్యూజిక్ ఆల్బంలో అవకాశం ఇస్తానని రాకీ తెలిపాడు. తనకు విస్తృతమైన రాజకీయ పరిచయాలు ఉన్నాయని, ప్రభుత్వ ఉద్యోగం ఇస్తానని బడోలి నమ్మబలికారని ఎఫ్ఐఆర్ లో పేర్కొన్నారు. ఈ క్రమంలో నిందితులు ఫిర్యాదుదారునికి బలవంతంగా మద్యం తాగించారని ఆరోపించారు. ఆమె నిరాకరించడంతో, వారు ఆమెపై అత్యాచారం చేశారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొంది. దీనిని ఫోటోలు, వీడియోలను కూడా తీసుకున్నారని, ఎవరికైనా చెబితే మహిళను చంపేస్తామని బెదిరించారని ఎఫ్ఐఆర్ లో జోడించారు. మహిళ ఫిర్యాదు ఆధారంగా నిందితులపై 376డి, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సోలన్ ఎస్పీ గౌరవ్ సింగ్ తెలిపారు. ఇంతవరకు ఎవరినీ అరెస్టు చేయలేదని, విచారణ చేపట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు.

# ఆరున క్రిస్మస్.. 13న న్యూ ఇయర్!!

## మరెన్నో విశేషాల సమాహారంగా బ్రిటన్ బుల్లి దీవి 'ఫౌలా'



2025 ఏడాది మొదలై ఇప్పటికే రెండు వారాలు పూర్తయింది. ప్రపంచవ్యాప్తంగా కొత్త తీర్మానాలతో, ఆనందక్షణాలతో బంధుమిత్రుల సమక్షంలో జనమంతా నూతన సంవత్సరానికి స్వాగతం పలికేసి తమతమ పనుల్లో బిజీ అయిపోయారు. కానీ బ్రిటన్‌లోని 'ఫౌలా'ద్వీపంలో మాత్రం అత్యంత ఆలస్యంగా అంటే సోమవారం (జనవరి 13) రోజు ఘనంగా కొత్త ఏడాది వేడుకలు జరిగాయి. అందరూ డిసెంబర్ 31 రాత్రి నుంచే సెలబ్రేషన్లు మొదలెట్టి ముగించేస్తే వీళ్లేంటి ఇంత ఆలస్యంగా వేడుకలు చేస్తున్నారని ఆశ్చర్యపోకండి. వాళ్ల దృష్టిలో జనవరి 13వ తేదీనే అసలైన కొత్త ఏడాది. ఎందుకంటే వాళ్లు మనలా ఆధునిక గ్రెగోరియన్ క్యాలెండర్‌ను పాటించరు. ప్రాచీనకాలంనాటి సంప్రదాయ జూలియన్ క్యాలెండర్‌ను మాత్రమే అనుసరిస్తారు. జూలియన్ క్యాలెండర్ స్థానంలో నాలుగు శతాబ్దాల కిందట కొత్తగా గ్రెగరీ క్యాలెండర్ వచ్చిన సంగతి తెల్సిందే. 400 సంవత్సరల క్రితం నాటి 13వ పోప్ గ్రెగరీ కొత్త క్యాలెండర్‌ను రూపొందించారు. ఈ కొత్త క్యాలెండర్ ఆయన పేరిటే తర్వాత కాలంలో గ్రెగోరియన్ క్యాలెండర్‌గా స్థిరపడిపోయింది. కానీ ఫౌలా ద్వీపవాసులు మాత్రం తన ఐలాండ్‌లో వేడుకలను పాత జూలియన్ క్యాలెండర్‌ను అనుసరించి మాత్రమే జరుపుకుంటారు. అందుకే జూలియన్ క్యాలెండర్ ప్రకారం కొత్త ఏడాదిని జనవరి 13వ తేదీన మాత్రమే జరుపుకున్నారు. దీంతో ఆదివారం ద్వీపంలో సంబరాలు అంబరాన్ని తాకాయి. క్రిస్మస్‌ను సైతం వాళ్లు జూలియన్ క్యాలెండర్ ప్రకారమే చేసుకుంటారు. అందరూ డిసెంబర్ 25న క్రిస్మస్ చేసుకుంటే వీళ్లు మాత్రం జనవరి ఆరో తేదీన క్రిస్మస్‌ను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు.

### ఎక్కడుందీ ఫౌలా?

బ్రిటన్‌లోని అత్యంత మారుమూల ద్వీపంగా గుర్తింపు పొందిన ఈ ఫౌలా.. షెట్‌ల్యాండ్ అనే ప్రధాన ద్వీపానికి 16 మైళ్ల దూరంలో ఉంది. ఫౌలా ద్వీపం పొడవు కేవలం ఐదు మైళ్లు. ప్రధాన భూభాగం నుంచి ఇక్కడికి విద్యుత్‌లైన్ల వ్యవస్థ లేదు. అందుకే ఇక్కడ జనం సొంతంగా విద్యుత్ వ్యవస్థను ఏర్పాటుచేసుకున్నారు. పవన విద్యుత్, చిన్నపాటి జల విద్యుత్ వ్యవస్థ, సౌర ఫలకాలతో సౌర విద్యుత్‌ను సమకూర్చుకుంటున్నారు. ప్రధాన ద్వీపసముదాయమైన షెట్లాండ్‌లోని టింగ్‌వాల్ విమానాశ్రయం నుంచి ఇక్కడికి విమాన సర్వీసులు ఉన్నాయి. బ్రిటన్‌లోని అత్యంత మారుమూల ద్వీపాల్లో ఒకటైన ఫౌలాలో అత్యంత పురాతన నార్న్ భాషను మాత్రమే మాట్లాడతారు. ఇక్కడి జనాభా కేవలం 40 మంది మాత్రమే. ప్రస్తుతం 36 మంది మాత్రమే ఉంటున్నారు. పని చేయడానికి బయటి నుంచి ఎవరూ రారు. మన పని మనం చేసుకోవాల్సిందే. ప్రకృతిని ఆస్వాదిస్తూనే ఇక్కడి జనమంతా పనుల్లో బిజీగా ఉంటారు.

### రెండూ అద్భుతమైనవే: రాబర్ట్ స్మిత్

రెండు వారాల వ్యవధిలో రెండు క్రిస్మస్‌లు, రెండు నూతన సంవత్సర వేడుకలు రావడం నిజంగా బాగుంటుందని 27 ఏళ్ల రాబర్ట్ స్మిత్ వ్యాఖ్యానించారు. విద్యాభ్యాసం కోసం కొంతకాలం షెట్లాండ్ ద్వీపసముదాయంలో ఉన్న రాబర్ట్.. మళ్లీ ఫౌలాకు వచ్చేశారు. అందరు ద్వీపవాసుల మాదిరిగానే ఆయనా అనేక పనులు చేస్తాడు. పడవను నడపడం, నీటి శుద్ధి కర్మాగారంలో పనిచేయడం, టూర్లు, అవసరమైతే ఉత్తరాలు అందించడం అన్ని పనుల్లో పాలు పంచుకుంటాడు. "ఉరుకుల పరుగుల షెట్లాండ్ లైఫ్‌ను చూశా. ప్రశాంతమైన ఫౌలా జీవితాన్ని గడుపుతున్నా. ఆస్వాదించగలిగే మనసున్న ఫౌలా స్వాగతం పలుకుతోంది. ఇక్కడ అందరం ఒకే కుటుంబంలా నివసిస్తాం. ఎప్పుడూ సంగీతం వింటాం. సాధారణంగా ఏ ద్వీపంలోనైనా వృద్ధులు, మధ్యవయస్కులు ఉంటారు. కానీ ఫౌలాలో ఎక్కువ మంది యువత, చిన్నారులే. గతంలో ఇక్కడి మెజారిటీ జనాభా పక్షుల వేటనే ప్రధాన వృత్తిగా ఎంచుకునేది. పక్షులను కొట్టి తెచ్చి కూర వండుకుని తినేయడమే. ఇప్పుడంతా మారిపోయింది. ఎన్నో వృత్తులు వచ్చాయి. తోటపని, చేపలు పట్టడం, కళాకారునిగా పనిచేయడం ఇలా..."అని రాబర్ట్ అన్నారు. "ఇక్కడి వాళ్లు అందరితో కలుపుగోలుగా ఉంటారు. ప్రతి ఒక్కరి ఇంటికీ వెళ్తాం. ఆనందంగా పాడతాం. ఆడతాం. రాబర్ట్ గతంలో గిటార్ వాయించేవాడు. తర్వాత మాండలీన్ పట్టుకున్నాడు. ఇప్పుడేమో ఫిడేల్ నేర్చుకుంటున్నాడు'అని ద్వీపంలోని మరో వ్యక్తి చెప్పారు.

# చైనా దాగుడుమూతలు!



సాధారణంగా దౌత్య సంబంధాల్లో అనూహ్యతకు తావుండదు. అవతలి దేశం మనతో చెలిమి కోరుకుంటున్నదో లేదో... అది మనవైపో, వేరేవాళ్లవైపో ఊహించటం పెద్ద కష్టం కాదు. కానీ చైనా మటుకు ఇందుకు విరుద్ధం. 'నేనేంటో చెప్పుకోండి చూద్దాం' అన్నట్టు వ్యవహరిస్తుంటుంది. నోటితో నవ్వి నొసటితో వెక్కిరిస్తున్న చందాన ప్రవర్తిస్తుంటుంది. రష్యాలో మూడు నెలల క్రితం బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరిగినప్పుడు ప్రధాని నరేంద్ర మోడీ, చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌లు కలుసుకున్నారు. అంతకు రెండు రోజుల ముందు వాస్తవాధీన రేఖ ప్రాంతాలైన డెస్పాంగ్, దెమ్ చోక్‌లలో ఇరు దేశాల సైన్యాల గస్తీపై అవగాహన కుదిరింది. ఆ ప్రాంతంలో ఇకపై సైనిక విన్యాసాలకు చోటీయరాదనీ, ఉద్రిక్తతలను ఉపశమింపజేయాలనీ దాని సారాంశం. అంతేగాదు... రెండు దేశాలూ దీనిపై వేర్వేరు ప్రకటనలు విడుదల చేశాయి. చాన్నాళ్లుగా నిలిచిపోయిన ఇరుదేశాల ప్రత్యేక ప్రతినిధుల సమావేశం గత నెలలో జరిగింది కూడా. తీరా తాజాగా తూర్పు లద్దాఖ్ ప్రాంతంలో చైనా సైన్యం అధునాతన సాంకేతికతలతో, అన్నిరకాల నేలల్లోనూ పనికొచ్చే వాహనాలతో, డ్రోన్‌లతో, మానవరహిత విమానాలతో విన్యాసాలు నిర్వహించినట్టు బయటపడింది. తన సైనిక సామర్థ్యాన్ని, కొండప్రాంతాల్లో యుద్ధ సంసిద్ధతలను అంచనా వేసుకోవటానికి షిన్ జియాంగ్ మిలిటరీ కమాండ్ రెజిమెంట్ ఈ విన్యాసాలు నిర్వహించిందంటున్నారు. అంతక్రితం మాటెలావున్నా 2020 ఏప్రిల్‌లో గాల్వాన్ లోయలో మన సైన్యంతో గిల్లికజ్జాలకు దిగటం ద్వారా చైనా తన కవ్వింపు చర్యల జోరు పెంచింది. అప్పుడు జరిగిన ఘర్షణల్లో మన జవాన్లు 21 మంది చనిపోగా, చైనా కూడా గణనీయమైన నష్టాలు చవిచూసింది. ఆ ఘర్షణల్లోనే బిహార్ రెజిమెంట్‌లో 17వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ అయిన తెలంగాణకు చెందిన బి.సంతోష్‌బాబు వీర మరణం పొందారు. అనంతర కాలంలో ఇరు దేశాల మధ్యా సైనిక అధికారుల స్థాయి చర్చలు జరిగాయి. కొన్ని అంశాల్లో ఒప్పందాలు కుదిరాయి. ఆ ఏడాది ఆగస్టులో రెండు దేశాల విదేశాంగమంత్రులూ భేటీ అయ్యారు. అందులో భారత్-చైనాల మధ్య పంచసూత్ర పథకం కుదిరింది. ఇకపై సామరస్యంగా మెలగాలన్నది ఆ పథకం సారాంశం. దానికి కొనసాగింపుగా రక్షణ మంత్రులు కూడా సమావేశమయ్యారు. ఆ తర్వాత వివాదాస్పద ప్రాంతాల్లో సైనికుల ఉపసంహ రణ కూడా మొదలైంది. కానీ సమస్య ఎక్కడిదక్కడే ఉంది. డెస్పాంగ్, దెమ్‌చోక్ ప్రాంతాల విషయం మొదటి నుంచీ జటిలమే. అందువల్లే ప్రస్తుతానికి ఇరు దేశాల సైన్యాలూ ఆ ప్రాంతాల్లో గస్తీ నిర్వహించాలని, ఉద్రిక్తతలు ముదిరే విధంగా ఎవరూ సైన్యాలను మోహరించ రాదని మూడు నెలలక్రితం నిర్ణయించారు. కానీ చైనాకు ఏమైందో కానీ దాన్ని బేఖాతరు చేస్తూ తాజాగా విన్యాసాలు మొదలుపెట్టింది. వారంరోజుల క్రితం షిన్‌జియాంగ్‌లోని వీగర్ స్వయంపాలిత ప్రాంతంలో ఉన్న హొటాన్ నగరానికి సమీపంలో చైనా కొత్తగా రెండు కౌంటీలను ఏర్పాటు చేసిందన్న కథనాలు వెలువడటం గమనించదగ్గది. ఈ రెండూ కేంద్రపాలిత ప్రాంతమైన లద్దాఖ్‌లోని ఆక్సాయ్‌చిన్‌కు సమీపంలో ఉన్నాయి. దానిలోని కొంత భూభాగం ఈ రెండు కౌంటీల్లోనూ ఉన్నదంటున్నారు. ఉద్రిక్తతలు రెచ్చగొట్టడానికి ఇది చాలదా? ఇక బ్రహ్మపుత్ర నదిపై ఒక మెగా డ్యామ్‌ను నిర్మించటానికి చైనా సన్నాహాలు చేస్తున్నదన్న వార్త కూడా ఇటీవలి పరిణామమే. ఎగువ ప్రాంతాల్లో ఆనకట్టలు కట్టినప్పుడు దిగువ ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు అందక ఇబ్బందులు తలెత్తు తాయి. భారీవర్షాల సమయంలో దిగువకు నీరు వదలటం వల్ల ఆ ప్రాంతాలు మునుగుతాయి. అందువల్లే దేశాలమధ్య ప్రవహించే నదులపై నిర్మాణాలకు పూనుకున్నప్పుడు పరస్పరం చర్చించుకుంటాయి. అందరికీ ప్రయోజనం కలిగేలా ఒప్పందాలు కుదుర్చుకుంటాయి. కానీ మెగా డ్యామ్ నిర్మాణాన్ని చైనా ఏకపక్షంగా ప్రకటించింది. దీనిపై మన దేశం తీవ్ర అభ్యంతరం తెలిపింది. ఇక అరుణాచల్‌ప్రదేశ్‌కు మన నాయకులు వెళ్లినప్పుడల్లా చైనాకు ఆగ్రహావేశాలొస్తాయి. అక్కడి ఊళ్లకు సొంత పేర్లు పెట్టుకుని మనల్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేయటం చైనాకు చాన్నాళ్లుగా దురలవాటు. అందుకే చైనా వ్యవహారశైలి తెలిసినవారెవరూ దాని మాటలు విశ్వసించరు. చెప్పే మాటలకు భిన్నమైన ఆచరణ ప్రదర్శించటం చైనాకు అలవాటైన విద్య. ఇరుగు పొరుగు దేశాలన్నాక సమస్యలు సహజంగా వస్తాయి. వాటిని చర్చించుకోవటం, పరస్పర అంగీకారంతో సామరస్యపూర్వక పరిష్కారాన్ని సాధించటం వివేకవంతమైన చర్య. సమస్యలను దశాబ్దాల తరబడి అలాగే వదిలేస్తే అవి జటిలంగా మారి చివరకు శత్రుత్వానికి దారితీస్తాయి. మనతో ఉన్న వివాదాల విషయంలో చైనా మొదటినుంచీ దాగుడుమూతలు ఆడుతోంది. వివాదాలను పక్కనబెట్టి వ్యాపార వాణిజ్యాలను విస్తరించుకుంటే ఇరు దేశాలూ అభివృద్ధి చెందుతాయని ఊరించి 70వ దశకం చివరిలో మనకు మైత్రీ హస్తం అందించింది మొదలు చైనా తీరుతెన్నులు ఎన్నడూ సక్రమంగా లేవు. సరిహద్దు పరిణామాలపై మన దేశం అప్రమత్తంగానే ఉన్నదని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీ సోమవారం చేసిన ప్రకటన సూచిస్తోంది. వివాదాస్పద ప్రాంతాల్లో ప్రస్తుతానికి ప్రతిష్టంభన ఉన్నదని ఆయనంటున్నారు. బ్రహ్మపుత్ర నదిపై ఆనకట్ట నిర్మాణం విషయంలోనైనా, లద్దాఖ్ ప్రాంతంలో చైనా సైన్యం కదలికల విషయంలోనైనా మన దేశం దృఢంగా వ్యవహరించాలి. దేశ రక్షణకు అది తప్పనిసరి. కరచాలనం చేస్తూనే కత్తులు దూయటం ఏమైనా కావొచ్చుగానీ దౌత్య కళ కాదని చైనాకు తెలియచెప్పటం అవసరం.

# మౌఢ్య 'బోధ'



'పౌర్ణమి రోజుల్లో గర్భధారణ వద్దు. అలాగే తెలివైన పిల్లల కోసం సూర్యని ముందు విల్లులా వంగుతూ నమస్కారం చేస్తూ నీళ్లను సమర్పించండి' అని మహిళా డీఐజీ సవితా సోహన్ బాలికలకు ఉపదేశం చేశారు. అది కూడా బాలికల రక్షణ కోసం మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన ఒక అవగాహన కార్యక్రమంలో 12వ తరగతి విద్యార్థినులను ఉద్దేశించి ఆమె ఈ వ్యాఖ్యలు చేయడం శోచనీయం. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంతో పరుగులు తీస్తున్న 21వ శతాబ్దంలో ఈ పుక్కిట పురాణాలు బోధించి నేర్పేది కుసంస్కారమే. ఇప్పుడు బాధ్యతగల ప్రభుత్వ అధికారులు విద్యార్థినులకు ఈ విధంగా చెప్పడం అత్యంత దారుణమైన విషయం. ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన పాఠశాలలు నేడు అశాస్త్రీయ పాఠాలకు వేదికలు కావడం విషాదం. శాంతి భద్రతలను పరిరక్షించాల్సిన ఒక పోలీసు అధికారిగా, చట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యతాయుతమైన స్థానంలో ఉండి ఆడపిల్లలకు చట్టాన్ని ఎలా వినియోగించుకోవాలో చెప్పకుండా సమాజం ఉలిక్కిపడే 'తిరోగమన పాఠాలు' బోధించడం సమాజానికే చేటే గాదు, సిగ్గుచేటు కూడా. ఈ వివాదం కొనసాగుతుండగానే మధ్యప్రదేశ్ ప్రభుత్వంలో క్యాబినెట్ హోదా ఉన్న మరో ప్రబుద్ధుడు "ఈ మధ్య యువత ఒక బిడ్డను కని ఆగిపోతున్నారు. ఇది చాలా సమస్యాత్మకంగా మారుతోంది. అందుకే బ్రాహ్మణులు కనీసం నలుగురు సంతానం కనాలి. వారికి రూ.లక్ష నజరానా ఇస్తాం" అని ప్రకటించడం మరీ విడ్డూరంగా ఉంది. దేశం ఆధునికతను సంతరించుకునే కొద్దీ అంతరించ పోవాల్సిన కులం మన రాజకీయ వ్యవస్థ పుణ్యమా అని వెర్రితలలు వేస్తుంది అన్నడానికి ఇంత కంటే రుజువులేం కావాలి. వీటి ప్రభావం పడిన వారు వారి పిల్లలకు నిస్సందేహంగా తిరిగి మౌఢ్యాన్నే బోధించరా? 'విజ్ఞానంతోనే వికసించు జగత్తు/ పసిపిల్లల చదువే దానికి విత్తు' అన్న కవి వాక్కులను తిరగరాస్తూ అజ్ఞానాన్ని విద్యార్థుల మెదడులో చొప్పించే పని శరవేగంగా జరుగుతుందన్నదానికి ఇవి ఉదాహరణలు మాత్రమే. 'పుట్టేది ఆడపిల్ల అని ముందే తెలిస్తే, కడుపులోని ఆ పిండాన్ని అక్కడికక్కడే కరిగించేస్తున్నారు. భ్రూణ హత్యలు ఆపకుండా గర్భధారణ గురించి అశాస్త్రీయ విషయాలు విద్యార్థులకు చెప్పడం ఏం సంస్కారం? అంతరిక్షంలోకి ఆడపిల్లలు వెళ్తున్న కాలంలో ఇప్పటికీ ప్రజల ఆలోచనల్లోనూ వెనుకబాటుతనం స్పష్టంగా కనిపిస్తోంది. సమాజం ఎప్పుడో వదిలేసిన అమానుష ఆచారాలు మరల భుజాన వేసుకునే కుహనా 'సంస్కరణ' వాదులు బయలుదేరినంత కాలం ఎన్ని చట్టాలు వచ్చినా నిరుపయోగమే. పాలకులు చట్టాలను అమలు చేయడం కంటే ప్రజలను అశాస్త్రీయత వైపు నడిపించడానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. దాని ఫలితమే చట్ట విరుద్ధం అని తెలిసినా ఇప్పటికీ బాల్య వివాహాలు ఆగడం లేదు. తాజాగా తెలంగాణ రాష్ట్రంలో బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతున్న జిల్లాలు రాష్ట్ర రాజధాని చుట్టూ ఉన్నాయన్న అధికారిక లెక్కలు ఆందోళన కల్గిస్తున్నాయి. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలు అభివృద్ధిలోనే కాదు.. సామాజిక వెనుకబాటులోనూ ముందు ఉన్నాయన్న విషయం నిష్ఠుర సత్యం. పెళ్లంటే ఏమిటో కూడా తెలియకుండానే ముక్కుపచ్చలారని పసిమొగ్గలు కుటుంబ బరువు, బాధ్యతల బందిఖానాలో చిక్కి శల్యమైపోతున్నారు. గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో అవిద్య, అవగాహనాలేమి కారణాలుగా కనిపిస్తుంటే పట్టణాల్లో సినిమాల దుష్ప్రభావాలు, లైంగిక వేధింపులు, లైంగికదాడులు నుంచి బయట పడేందుకు చిన్న పిల్లలకే పెళ్లిళ్లు చేస్తున్నామని తల్లిదండ్రులు చెప్పడం ఒక విషాదం. బాల్య వివాహాలు జరగకుండా నివారించాల్సిన ప్రభుత్వాలు ప్రజల్లో చైతన్యం నింపడంలో విఫలమవుతున్నాయి. పిల్లలకు సామాజిక, ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా పరిపూర్ణ వ్యక్తులుగా ఎదగడానికి, అభివృద్ధి చెందటానికి రక్షణ పొందే హక్కును రాజ్యాంగం కల్పించింది. వారి హక్కులను హరిస్తున్న బాల్య వివాహాల పట్ల ప్రజల్లో అవగాహన పెంచి, భయం పోగొట్టి, మహిళలకు, ఆడపిల్లల భద్రతకు భరోసా ఇచ్చేలా ప్రభుత్వం చొరవ చేయకపోతే ఈ బాల్య వివాహాలు అడ్డుకోవడం కష్టం. శాస్త్ర సాంకేతికాభివృద్ధితో ప్రపంచమంతా పురోగమ నానికి బాటలు వేసుకుంటుంటే మన పాలకులు మాత్రం ఏ రుజువులూ లేని పుక్కిట పురాణాలూ, అంధ విశ్వాసాల ఆధారంగా దేశాన్ని తిరోగమన బాట పట్టిస్తున్నారు. సమాజ ప్రగతిని ఇలాంటి మౌఢ్యాలు ప్రశ్నార్థకం చేస్తున్నాయి. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వాల పని వాటన్నింటినీ చేష్టలుడిగి చూస్తుండటమేనా అన్నది జవాబులేని ప్రశ్నగా మిగిలిపోరాదు. "నేడు భారతదేశం అజ్ఞానం, మత ఛాందసం, మతోన్మాదాల అగాధంలోనూ, అన్నిరకాల జడ పదార్థాల పూజలలోనూ మునిగిపోయి ఉంది. ఈ గందరగోళ పరిస్థితి నుంచి దేశాన్ని ఏ శక్తి బయటపడేయ గలదు? మన జీవితంలో ఇబ్బంది పెడుతున్న సమస్యలన్నింటినీ ఒక్క దెబ్బతో ఏ శక్తి పరిష్కరించలేకపోవచ్చు. కాని, సర్ సి.వి.రామన్ చెప్పినట్టు 'విజ్ఞాన శాస్త్రమే' ఒక స్వేచ్ఛా జీవనం వికసించడానికో మార్గం పరుస్తుందనే ఎరుక భావితరాలకి అందించాలి. ఇది ప్రజలేకాదు, పాలకులూ గుర్తించాలి.

## నాన్‌సెన్స్ - ఇది దేశద్రోహం



న్యూఢిల్లీ : రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ అయోధ్యలో రామమందిరాన్ని నిర్మించిన రోజే భారతదేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని అన్నారు. మోహన్ భగవత్ చేసిన ఈ వ్యాఖ్యలపై లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మండిపడ్డారు. ఆయన వ్యాఖ్యలు దేశ ద్రోహంతో సమానమని, ప్రతి భారతీయున్ని అవమానించడమేనని రాహుల్ బుధవారం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈరోజు న్యూఢిల్లీలోని కొట్లా రోడ్డులో కొత్తగా నిర్మించిన కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం 'ఇందిరా గాంధీ భవన్' ప్రారంభోత్సవం సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. 'మన దేశ స్వాతంత్ర్య ఉద్యమం గురించి, రాజ్యాంగం గురించి తాను ఏమనుకుంటున్నారో ప్రతి రెండు మూడు రోజులకు దేశానికి తెలియజేయగల ధైర్యం మోహన్ భగవత్‌కు ఉంది. భారత రాజ్యాంగం చెల్లదని, బ్రిటీష్ వారిపై పోరాటం చెల్లదని ఆయన అంత ధైర్యంగా బహిరంగంగా చెప్పారు. ఆయన వ్యాఖ్యలు దేశద్రోహం కిందకే వస్తాయి. అదే ఇలాంటి వ్యాఖ్యలు చేసిన వారిని మరే దేశంలోనైనా అయితే అరెస్టు చేసి విచారిస్తారు. ఎన్నో పోరాటాల అనంతరం 1947లో భారత్‌కి వచ్చిన స్వాతంత్ర్యం.. అసలు స్వాతంత్ర్యం కాదని ఆయన చెప్పడం.. ప్రతి భారతీయుడిని అవమానించడమే' అని అన్నారు. ఇలాంటి మాటలు అర్థం లేనివి. వాటిని మనం వినకుండా ఉండేందుకు గల సమయం ఆసన్నమైంది. ఇలాంటి వ్యక్తులు కేవలం చిలుకల్లా బయటకు రాకుండా అరుస్తూ కేకలు వేస్తూ మాత్రం ఉంటారు అని భగవత్‌ని ఉద్దేశించి అన్నారు. కాగా, సోమవారం మోహన్ భగవత్ భారత్‌కు నిజమైన స్వాతంత్ర్యం అయోధ్యలో రామమందిరాన్ని నిర్మించినప్పుడే అని అన్నారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపింది.

## అతిషి ఓట్ల కోసం.. అడవిలో జింకలా పరుగెడుతోంది



న్యూఢిల్లీ : బిజెపి సీనియర్ నేత రమేష్ బిధూరి మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ సిఎం అతిషి ఎన్నికల్లో ఓట్ల కోసం అడవిలో జింక మాదిరిగా పరుగెడుతోందని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'ఢిల్లీ ప్రజలు వీధుల్లో అష్టకష్టాలు పడుతున్నారు. గడచిన నాలుగేళ్లలో అతిషి జనాల్ని కలవడానికి ఒక్కసారి కూడా రాలేదు. త్వరలో ఇక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నందున ఆమె ఇప్పుడు వీధుల్లో తిరుగుతున్నారు. అడవిలో జింక పరుగులు పెట్టినట్టు ఆమె ఓట్ల కోసం పరుగెడుతున్నారు' అని అన్నారు. కాగా, బిధూరి వచ్చే నెలలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కల్కాజి నియోజకవర్గం నుంచి ఢిల్లీ సిఎం అతిషిపై పోటీ చేస్తున్నారు.

## పందెం కోడి చచ్చినా వెయ్యే బతికినా వెయ్యే..!



మామిడికుదురు (కోనసీమ) : ఏనుగు చచ్చినా వెయ్యే.. బతికినా వెయ్యే..! అనే నానుడి చనిపోయిన ఏనుగుకు అంత విలువ ఉంటుందో లేదో తెలీదు కానీ పందెం కోడి మాత్రం చచ్చినా, బతికినా ఖరీదు వేలల్లోనే అన్నది నూరు శాతం నిజం. పౌరుషానికి పరాకాష్టగా ప్రాణాలకు తెగించి పోరాడే పందెం కోడిపుంజుల్లో వీర మరణం పొందిన పుంజును "కోస" అంటారు "కోస" మాంసం అన్న మాట వింటేనే నోట్లో లాలాజలం ఊరుతుంది "కోస"మాంసంలో ఒక్క కొవ్వులే కాకుండా అత్యంత రుచిగా ఉండటంతో ఎక్కువమంది ఈ మాంసము తినాలని ఉబలాటపడతారు. అధికారులను, ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకోవడం ద్వారా ప్రయోజనం పొందాలనుకునేవారు వారికోసం ఎంతైనా రేటు పెట్టి" కోస" మాంసాన్ని కొని పెద్ద పండుగ కానుకగా సమర్పించుకుంటున్నారు. పందెంలో పుంజుల కాళ్లకు కత్తులు కట్టే వాళ్ళ కన్నా, కోస మాంసాన్ని ముక్కలుముక్కలుగా నరికి కూర వండుకోవడానికి అణువుగా ముక్కలు కొట్టే వాళ్లకే సంపాదన ఎక్కువంటే అతిశ యోక్తి కాదు. జిల్లా వ్యాప్తంగా అనేక చోట్ల పందాలు జరుగుతున్నాయి. కోడి పందాల నిర్వాహకులు పోలీసు ఉన్నతాధికారులకు కోసం మాంసం పంపించడానికి అవస్థలు పడుతుంటారు. ప్రతి పందెపు బరి దగ్గర గుండాటలు, మద్యం, పేకాటలు వంటి జూదాలు జరుగుతున్నాయి వాటితో పాటు కోస మాంసాన్ని ముక్కలుగా నరికే దుకాణాలు వెలిశాయి పండగలో తొలిరోజైన భోగినాడు, జరిగిన పందేల్లో వేలాది కోళ్లు పోరాడి నేలకొరిగిపోయాయి. కోస మంచి రుచిగా ఉంటుంది. ప్రత్యేక పెంపకం వల్ల పందెం కోళ్లకు నెలల తరబడి బాదం, పిస్తా, జీడిపప్పు వంటి బలవర్ధకమైన ఆహారంతోపాటు ప్రతిరోజు వ్యాయామం చేయిస్తారు. ఈ పెంపకం వల్ల పుంజులు ఎక్కడ కొవ్వు లేకుండా కండతీరి బలముగా తయారవుతాయి. వీటి మాంసంతో పాటు ఎముకలను మాంసాహార ప్రియులు ఇష్టంగా తింటారు.

## సుప్రీం కోర్టులో చంద్రబాబుకు భారీ ఊరట



న్యూఢిల్లీ : సుప్రీం కోర్టులో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు భారీ ఊరట లభించింది. స్కిల్ డెవలప్మెంట్ కేసులో చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలని గత వైసీపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ ను సుప్రీం కోర్టు జస్టిస్ బేలా త్రివేది ధర్మాసనం కొట్టివేసింది. ఈ కేసులో ఇప్పటికే చార్జిషీట్ ఫైల్ చేశారని రాష్ట్ర ప్రభుత్వం తరపున న్యాయవాది ముకుల్ రోహిత్గి తెలిపారు. చార్జిషీట్ దాఖలు చేయడంతో బెయిల్ రద్దు పిటిషన్‌లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని జస్టిస్ బేలా త్రివేది ధర్మాసనం పేర్కొంది. స్కిల్ డెవలప్ మెంట్ కేసులో 2023 నవంబర్ లో చంద్రబాబు కు ఏపీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన బెయిల్ రద్దు పిటిషన్ డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ బెయిల్ రద్దు చేయాలని గత ప్రభుత్వం సుప్రీం కోర్టుకు వెళ్లగా.. ప్రస్తుతం ఆ పిటిషన్ ను కోర్టు కొట్టివేసింది. అవసరమైన సందర్భంలో విచారణకు సహకరించాలని చంద్రబాబుకు సుప్రీం కోర్టు సూచించింది. మరోవైపు చంద్రబాబు బెయిల్ ను రద్దు చేయాలని ఓ పత్రికా విలేకరి సుప్రీం కోర్టులో ఇంటర్ లొకేటరీ అప్లికేషన్ దాఖలు చేశారు. పిటిషన్ దారుడిపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మీరెవరు..? మీకేం సంబంధం..? పిల్ దాఖలు చేయడానికి ఉన్న అర్హత ఏమిటని ప్రశ్నించింది. బెయిల్ వ్యవహారాల్లో మూడో వ్యక్తి (థర్డ్ పార్టీ) ఎందుకు ఉంటారని ధర్మాసనం ప్రశ్నించింది. సంబంధం లేని బెయిల్ వ్యవహారాల్లో పిటిషన్ ఎలా వేస్తారని జస్టిస్ బేలా త్రివేది ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది ఇంకోసారి జరిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించిన ధర్మాసనం.. సదరు విలేకరి దాఖలు చేసిన ఇంటర్ లొకేటరీ అప్లికేషన్ ను డిస్మిస్ చేసింది.

# 'ఈ' తరంలోనూ ఇవా మన చదువులు




గత ఏడాది జులై 16న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధా విజ్ఞానం) ప్రశంసా దినోత్సవం సందర్భంగా కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వశాఖ భారతదేశం ప్రపంచ కృత్రిమ మేధ విజ్ఞాన పవర్ హౌస్‌గా స్థాయిని పెంచుకుంటోందని వెల్లడించింది. అయితే కేంద్ర ప్రభుత్వం చెబుతున్న గొప్పలకు క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న వాస్తవాలకు ఎక్కడా పొంతన కుదరడం లేదు. దేశంలోని పాఠశాలల వాస్తవ పరిస్థితుల వివరాలను వెల్లడించే 'యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ (యుడిఐఎస్ఇ) డేటా ప్రకారం అటువంటి ఆశయాలు నెరవేరడం చాలా బలహీనంగా ఉంటోందని తెలుస్తోంది. దేశంలోని మొత్తం పాఠశాలల్లో కంప్యూటర్ సౌకర్యాలు కేవలం 57.2%, అలాగే ఇంటర్నెట్ సౌకర్యం 53.9% మాత్రమే అందుబాటులో ఉంటోందని వెల్లడైంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వేగంగా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు కంప్యూటర్‌లో లేదా ఇంటర్నెట్ ప్రక్రియలను అందిపుచ్చుకునే పూర్తి సామర్థ్యాన్ని ఇంకా పొందలేకపోతుండటం మన దేశం ఎంత వెనుకబడి ఉందో ఆందోళన కలిగిస్తోంది. విద్యాబోధనలో డిజిటల్ పరిజ్ఞానం ప్రభుత్వ పాఠశాలల్లో 44%, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో 70%, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 71% విద్యార్థులకు లోపిస్తోందని నివేదిక వెల్లడించింది. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా రాష్ట్రాల వారీగా ఈ ఆధునిక విద్యాబోధన సౌకర్యాల కల్పనలో తేడా బహిర్గతమవుతోంది. బీహార్‌లో 11%, బెంగాల్‌లో 18%, ఉత్తరప్రదేశ్‌లో 21% వరకు కంప్యూటర్, ఇంటర్నెట్ సౌకర్యాలు విద్యార్థులకు అందుబాటులో ఉంటున్నాయి. దక్షిణాది రాష్ట్రాల్లో ధనిక, ఇతర రాష్ట్రాల్లో కూడా ఈ సౌకర్యాల కల్పనలో తేడాలు ఉంటున్నాయి. కర్ణాటకలో 33 శాతం వరకు ఈ సౌకర్యాలు ఉండగా, కేరళలో 99 శాతం వరకు ఉన్నాయి. ఇక్కడ గమనించవలసిన విషయం ఏమంటే ఒక ప్రభుత్వం తరువాత వచ్చిన మరో ప్రభుత్వం పాఠశాలలో కంప్యూటర్ అనుసంధాన సౌకర్యాలను మరింత విస్తరింపచేయడానికి ప్రయత్నించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే చదువుల పునాదుల్లోనే విద్యార్థులకు ఆధునిక విద్యాబోధన సౌకర్యాలను దూరం చేస్తే వారి వ్యక్తిగత, వృత్తిపరమైన ఉజ్వల భవిష్యత్తును చిదిమివేసినట్టు అవుతుంది. అంతేకాదు ఇతర మార్గాల ద్వారా కూడా డిజిటల్ నిరక్షరాస్యత ప్రభావం తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందన్న హెచ్చరికలు వస్తున్నాయి. మిశ్రమ డిజిటల్ స్వీకరణ సూచిక ప్రకారం అమెరికా వంటి దేశాల కన్నా భారత దేశంలో ప్రజలు, వ్యాపార సంస్థలు డిజిటల్ వినియోగంలో చాలా తక్కువ స్థాయిలో ఉన్నారని తెలుస్తోంది. దేశంలో గ్రామీణ యువతలో సోషల్ మీడియాను ఉపయోగిస్తున్న దాదాపు 50% మంది పాస్‌వర్డ్‌ను మార్చగలగడం, ప్రొఫైల్‌ను బ్లాక్ చేయడం వంటి కనీస రక్షణ చర్యలను చేయలేకపోతున్నారని స్పష్టమవుతోంది. ఈ రోజు డిజిటల్ స్కూలింగ్ లోటు రేపటికి విద్యార్థులకు ఏ విధమైన అభివృద్ధికి దారి తీస్తుందన్నది ప్రశ్న. ప్రపంచంలోనే ఐదో భారీ ఆర్థిక స్థాయికి ఎదుగుతున్న భారత్‌లో అన్ని పాఠశాలలకు కంప్యూటర్, ఇంటర్నెట్ సౌకర్యాలు సమకూరితేనే భావిభారత పౌరుల భవిష్యత్ ప్రగతి పథంలో ముందుకెళ్తుంది. ఈ మేరకు ప్రభుత్వం పెట్టుబడి పెట్టడం అత్యంత ముఖ్యం కూడా. కృత్రిమ మేధ, రోబోటిక్స్, బిగ్‌డేటా ఎనలిటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ తదితర అత్యంత ఆధునిక ప్రక్రియల విస్తరణతో అనేక రంగాల్లో వినూత్న మార్పులు సంతరించుకుంటున్నాయి. వాటి వల్ల ఉపాధి అవకాశాలు కూడా విరివిగా లభిస్తున్నాయి. ఇటువంటి ప్రక్రియల్లో యువతకు నైపుణ్యం అందించడంలోమన చదువులు ఎంతవరకు ఉపయోగపడుతున్నాయో పరిశీలిస్తే అగమ్యగోచరమే. ఈ కారణాల వల్ల గ్లోబల్ టాలెంట్ కాంపిటీటివ్‌నెస్ ఇండెక్స్ (జిటిసిఐ)లో 134 దేశాల జాబితాలో మన దేశం 103వ స్థానంలో ఉంది. బ్రిక్స్ సభ్య దేశాలైన చైనా 40వ ర్యాంకు, రష్యా 52, దక్షిణాఫ్రికా 68, బ్రెజిల్ 69 స్థానాల్లో ఉన్నాయి. వీటితో పోలిస్తే మన దేశం ఎంతో వెనుకబడే ఉందని చెప్పవచ్చు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఫిన్‌లాండ్ దేశాల్లో 90 శాతానికి మించి విద్యార్థులు విద్యాభ్యాసం కోసం డిజిటల్ సాధనాలను వినియోగిస్తున్నారు. పోర్చుగల్ ప్రభుత్వం ఇరవై ఏళ్ల క్రితమే పాఠశాల తరగతి గదుల్లో కంప్యూటర్, ఇంటరాక్టివ్ బోర్డులను ఏర్పాటు చేసింది. అమెరికా పాఠశాలల్లో కంప్యూటర్ కోడింగ్ ఫక్కాగా అమలవుతోంది. జర్మనీలో ఉపాధ్యాయులకు డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించడంతో పిల్లలకు బోధన సులభతరమవుతోంది. మన దేశంలో మొత్తం 10.17 లక్షల ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం ఐదు లక్షల పాఠశాలలకు మాత్రమే కంప్యూటర్లు, ఇంటర్నెట్ సౌకర్యాలు ఉన్నాయి. తొమ్మిది నుంచి ఆపై తరగతుల విద్యార్థులకు బోధన కోసం ఆధునిక సాంకేతిక సౌకర్యాలు సమకూర్చడానికి 2019లో ఆపరేషన్ డిజిటల్ బోర్డు అనే ప్రణాళిక ప్రారంభమైనప్పటికీ, దేశంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 1.30 లక్షల స్మార్ట్ క్లాస్ రూమ్‌ల ఏర్పాటుకే ఈ ప్రణాళిక పరిమితం అయింది. దీనికి తోడు విద్యారంగానికి ప్రభుత్వ కేటాయింపులు రానురాను దిగజారుతున్నాయి. గత ఆరేళ్లలో జిడిపిలో విద్యకు కేటాయింపులు కేవలం 2.7 నుంచి 2.9 శాతం మధ్యలోనే ఉండడం గమనార్హం. స్వీడన్ 6.7 శాతం నుంచి 6.9 శాతం, బ్రిటన్ 5.3 5.6 శాతం, థాయిలాండ్ 4 4.3 శాతం ఈ విధంగా ఆయా వర్ధమాన దేశాలు తమ జిడిపిలో విద్యకు కేటాయింపులను 5 నుంచి 7 శాతం వరకు పెంచుతుంటే మన దేశం మాత్రం కేవలం కంటితుడుపుగా నిధులను కేటాయిస్తోంది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మన చదువులు ఉండాలంటే జిడిపిలో 6 శాతానికి మించి నిధులను కేటాయించాల్సిన అవసరం ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి.

# ఎంఎస్‌పి సాధనకు మరోమార్గం




పంటలకు చట్టబద్ధంగా కనీస మద్దతు ధరల సాధనకోసం రైతు సంఘాలు ఢిల్లీ హర్యానా సరిహద్దుల్లో రోజులు, సంవత్సరాలుగా రోడ్డెక్కి ఆందోళనలు సాగిస్తున్నా ప్రభుత్వ వర్గాలనుంచి స్పందన లేదు సరికదా పోలీస్ బలగాలతో రైతుల ఉద్యమాన్నిఅణగదొక్కుతున్నారు. రానురాను ఈ సమస్య జటిలమవుతోంది. నిరవధిక నిరాహార దీక్ష కొనసాగిస్తున్న రైతు నాయకుడు జగ్‌జిత్ సింగ్‌దల్లేవాల్ ఆరోగ్యం క్షీణిస్తుండడంతో చివరకు సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని వైద్య చికిత్స అందించాలని అక్కడి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించవలసి వచ్చింది. దల్లేవాల్ చేపట్టిన నిరాహార దీక్ష మంగళవారం (జనవరి 7) నాటికి 43 రోజులు కావస్తోంది. ఈ పరిస్థితుల్లో ఎంఎస్‌పి కోసం కేంద్ర ప్రభుత్వ నిర్ణయం కోసం నిరీక్షించకుండా రాష్ట్రాల వారీగా సాధించుకోవచ్చని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. ప్రత్యామ్నాయంగా రైతులకు ప్రయోజనం కలిగించే చర్యలు చేపట్టవచ్చని ది డబ్లింగ్ ఫార్మర్స్ ఇంకమ్ (డిఎఫ్ఐ) కమిటీ సూచిస్తోంది. పంటల ఉత్పత్తి వ్యయం, ఇతర ఖర్చుల ఆధారంగా వ్యయసాయ మార్కెట్ యార్డు ( మండీ)ల్లోనే కనీస ధరకు పంటల వేలం రేటు నిర్ణయించవచ్చని సూచిస్తోంది. దీని వల్ల రైతులకు డిమాండ్, సరఫరా ఆధారంగా లాభం నిర్ణయమవుతుందని సూచించింది. రైతులు రెక్కలు ముక్కలు చేసుకుని పండించే పంటలను ప్రలోభాలతో అతి తక్కువ ధరకు కాజేసే దళారీల నిలువు దోపిడీ విధానాలను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వాలు అగ్రికల్చరల్ ప్రొడ్యూస్ మార్కెటింగ్ కమిటీ (ఎపిఎంసి) యార్డులను నిర్వహిస్తున్నాయి. ఈ యార్డులకు రైతులు తమ పంటలను తీసుకువచ్చి వేలం ద్వారా లాభదాయకమైన ధరలకు పంటలను అమ్ముకోవచ్చు. అయితే ఈ అగ్రికల్చరల్ ప్రొడ్యూస్ మార్కెటింగ్ కమిటీ (ఎపిఎంసి) యార్డుల్లో వ్యవసాయ ఉత్పత్తులపై వేలంలో పాల్గొనే పాటదారులు అంతా కుమ్మక్కు (రింగ్) కాకుండా జాగ్రత్తపడాలి. అలాగే పంటల ఉత్పత్తి వ్యయ ఆధారిత ధర కన్నా తక్కువ ధరకు వేలం పాడటానికి అవకాశం ఇవ్వకూడదు. అలా జరగాలంటే పంటకు గిట్టుబాటు ధరను కనీస రిజర్వు ధర (ఎంఆర్‌పి)గా చట్టపరంగా పరిగణించాలి. ఈ విధమైన నిబంధన రాష్ట్ర ఎపిఎంసి చట్టాల్లో పొందుపరిచేలా సవరణలు చేయాలని డిఎఫ్ఐ కమిటీ మాజీ ఛైర్మన్ అశోక్ కె దల్వాల్ సూచించారు. ఇలా చేస్తే కమిషన్ ఏజెంట్లుగా వ్యవహరించే దళారుల ప్రలోభాలకు ఏ రైతు లొంగకుండా నిరోధించడానికి వీలవుతుంది. ఈ కమిషన్ ఏజెంట్లు రైతుల సమ్మతి లేకుండానే తమకు నచ్చిన ధరనే కనీస రిజర్వేషన్ ధరగా ప్రతిపాదిస్తుంటారు. పండించే అన్నదాతకు ధర నిర్ణయించుకునే హక్కులేకుండా ప్రలోభ పరుస్తుంటారు. సాధారణంగా ఈ మార్కెట్ యార్డుల్లో దళారులదే రాజ్యంగా సాగుతుంది. అలాంటి దోపిడీ విధానాలు సాగకుండా వేలం పాటలను నిబంధనల ప్రకారం నిర్వహించగలగాలి. అయితే ఓపెన్ మార్కెట్‌లో చట్టబద్ధమైన కనీస మద్దతు ధర అన్నది ఎక్కడా లభించదని, మొత్తం వ్యవసాయం అంతా ప్రభుత్వ నియంత్రణలోనే ఉండడమే దీనికి కారణమని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ (ఎన్ఎఎఎస్) ఉపాధ్యక్షుడు పికె జోషి వ్యాఖ్యానించారు. మొత్తం పంటలను సేకరించి, నిల్వచేసి, లాభదాయకమైన మద్దతు ధరకు అమ్మడం అన్నది ప్రభుత్వ నిర్వహణలో సాధ్యం కాదు. పక్కాగా మార్కెటింగ్ వ్యవస్థ నిర్వహించాలంటే దానికి తగిన వ్యవస్థల నిర్వహణకు ఎంతో వ్యయప్రయాసలు అవసరం. ఈ విషయంలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సిఐ) బియ్యం, గోధుమలను ఏ విధంగా సేకరిస్తోందో, ఎలా నిల్వచేసి విక్రయిస్తోందో ఉదాహరణగా చెప్పవచ్చు. బియ్యం, గోధుమల సేకరణ, నిల్వ, విక్రయాలకు ఎఫ్‌సిఐ చేసే వ్యయం, ప్రైవేట్ వ్యాపారులు చేసే ఖర్చు కన్నా ఎంతో ఎక్కువగా ఉంటోందని జోషి ఉదహరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు వివాదాస్పద వ్యవసాయ చట్టాల పరిశీలనకు సుప్రీం కోర్టు నియమించిన నిపుణుల కమిటీలో జోషి సభ్యునిగా 2020 వరకు పనిచేశారు. జోషి పరిశీలన ప్రకారం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)ను చట్టబద్ధం చేయడం అంటే ప్రైవేట్ వ్యాపారస్తుడ్ని పూర్తిగా కనుమరుగు చేయడమే అవుతుంది. అయితే ఈ మేరకు ప్రభుత్వం ఎఫ్‌సిఐ రీతిలో ప్రతి పంట సేకరణకు, నిల్వకు, విక్రయానికి కావలసిన మౌలిక సౌకర్యాలు కల్పించవలసిన అవసరం ఉంటుంది. అలాగే దీనికి అనుసంధానంగా కొత్త వ్యవస్థలను ఏర్పాటు చేయక తప్పదు. ఇవన్నీ సమకూర్చాలంటే భారీ ఎత్తున పెట్టుబడులు చాలా వరకు భరించవలసి వస్తుంది. పంటలకు లాభదాయకమైన ధరలు రావాలంటే ధరల లోటును భర్తీ చేసే వ్యవస్థ తప్పని సరి. అంటే కనీస మద్దతు ధరకు మార్కెట్ రేటుకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని భర్తీ చేయడం. ధరల బీమా వ్యవస్థ, పంటకు గిట్టుబాటు ధర ముందుగా నిర్ణయించడం, అది వచ్చేవరకు గిడ్డంగిలో పంటకు భద్రత, నాణ్యత పరిరక్షణ వంటి గిడ్డంగి రశీదు పద్ధతి (వేర్‌హౌస్ రిసీప్ట్) ని అనుసరించడం వల్ల రైతులకు మేలే జరుగుతుంది. మిగులు ఉత్పత్తులను సమర్ధవంతంగా విక్రయించే వాణిజ్య విధానాన్ని ప్రభుత్వం నిర్వహించాల్సి ఉంటుంది. డిఎఫ్ఐ కమిటీ సిఫార్సు చేసిన పంటకు రిజర్వు ధర (ఎంఆర్‌పి) అనేది చాలా కష్టతరమైనది. ఒక జిల్లాలో ఎకరాకు వచ్చే దిగుబడి బట్టి పంటకు రిజర్వు ధర ఆధారపడి ఉంటుంది. అన్నిచోట్లా రిజర్వు ధర ఒకేలా ఉండదు. ఇందులో ఆయా ప్రాంతాల వ్యవసాయ పరిస్థితి బట్టి కూడా రిజర్వు ధర నిర్ణయమవుతుంది.

# ఆదివాసీల ఆరాధ్యుడు



మన దేశం కాదు, మన ఊరు కాదు, మన భాష కూడా తెలియదు. ఆయనకు తెలిసిందల్లా ఆదివాసీలకు అభివృద్ధిని పరిచయం చేయడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు గిరిజనులదరికి చేరవేసేలా ఆదివాసీ గూడాలలో చెరగని ముద్ర, శాశ్వత స్థానం పదిలపరుచుకున్న ఆదివాసీల ఆత్మబంధువు, మానవ పరిణామ శాస్త్రవేత్త, దివంగత ప్రొఫెసర్ క్రిస్టఫర్ వాన్ ఫ్యూరర్ హైమెన్‌డార్ఫ్ ఆస్ట్రియా దేశం వియన్నా నగరంలో 199 సంవత్సరంలో జన్మించాడు. లండన్ విశ్వవిద్యాలయం నుంచి మానవ పరిణామ శాస్త్రంలో డాక్టరేట్ పొందారు 1936లో ఉద్యోగరీత్యా భారత్‌కు వచ్చి నిజాం కాలేజీలో ప్రొఫెసర్‌గా పని చేశాడు. 1928 నుండి 1940 వరకు బ్రిటిష్ పాలనలో కెరమెరి మండలం జోడేఘాట్ అటవీ ప్రాంతంలో కుమురం భీం ఆధ్వర్యంలో జల్, జంగిల్, జమీన్ నినాదంతో నిజాం సైనికులకు గోండులకు మధ్య తీవ్ర పోరాటం జరిగింది. నిజాం సైన్యాన్ని ముప్పుతిప్పలు పెట్టిన భీమ్ ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమినాడు ద్రోహి ఇచ్చిన సమాచారంతో జోడేఘాట్ గుట్టల్లో ఈ యుద్ధ వీరుడు అసువులు బాశారు. ఈ నేపథ్యంలో ఆదివాసీల తిరుగుబాటుకు గల కారణాలను, మూలాలను వెతకాలని పరిశోధించడానికి నిజాం ప్రభుత్వం ప్రొఫెసర్ హైమెన్‌డార్ఫ్‌ను ఆదిలాబాద్‌కు పంపింది. అలా 1940 సంవత్సరంలో ఆయన తన సతీమణి బెట్టి ఎలిజబెత్‌ను వెంటబెట్టుకొని వచ్చి ఆదివాసీల జీవితాలపై అధ్యయనం చేయడానికి జైనూర్ మండలం మార్లవాయి గ్రామంలో అడుగుపెట్టాడు. వారి రాక గిరిజనుల తలరాతలు మార్చింది. అక్కడ చుట్టూ కొండల మధ్య జీవనం సాగిస్తున్న లచ్చు పటేల్ వీరికి ఆవాసం కల్పించడం జరిగింది. ఇతడు ఆదివాసీల జీవితాలను పరిశోధించడమే కాకుండా వారి సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి ప్రభుత్వానికి నివేదికలు పంపారు. ఆదివాసీల అభివృద్ధికి సూచనలు చేయడమే కాకుండా పలు ప్రామాణిక గ్రంథాలు రాశారు. ది గోండ్స్ ఆఫ్ ఆదిలాబాద్ అనే గ్రంథంలో ఆదివాసీల జీవన విధానం, సంస్కృతి, సాంప్రదాయాలను పొందుపరిచారు. శక్తివంచన లేకుండా పరిశోధన చేసి ఆదివాసీలకు జల్, జంగిల్, జమీన్‌పై పూర్తి అధికారాలు ఉండాలని గ్రంథంలో సూచించారు. హైమెన్‌డార్ఫ్ నిజాం సర్కారుకు ఆదివాసీల జీవన విధానం ఉద్యమాలను నిజాం సర్కారుకు నివేదించడంతో ఆదివాసీలకు సర్వహక్కులు కల్పించారు. ఆదివాసీలతో మమేకమైన మూలంగా గిరిజనుల్లో శాశ్వతంగా ఉండిపోయారు. ఆదివాసీల గుండెల్లో చెరగని ముద్ర వేయించుకున్నారు. ఆదివాసీలతో ఏర్పడిన అనుబంధానికి ప్రత్యేకగా డార్ఫ్ దంపతులు తమ కుమారుడికి లచ్చు పటేల్ అని గిరిజనుడి పేరు పెట్టుకున్నారు. కొంత కాలానికి 1990లో బెట్టి ఎలిజబెత్ కన్నుమూయడంతో ఆమె కోరిక మేరకు మార్లవాయి గ్రామంలో గోండు సాంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు జరిపించారు. 1995లో ఇంగ్లాండులో మృతి చెందిన హైమెన్‌డార్ఫ్‌కు కూడా మార్లవాయిలోనే ఎలిజిబెత్ సమాధి పక్కన ఇతని సమాధి కట్టారు. వారి విగ్రహాలను కూడా గ్రామంలో ఏర్పాటు చేశారు. అయితే డార్ఫ్ మరణం తర్వాత 17 సంవత్సరాలకు అంటే 2012 ఫిబ్రవరి 27న అతని కుమారుడు లచ్చు పటేల్ అలియాస్ నికోలస్ తండ్రి అస్థికలను మార్లవాయికి తీసుకువచ్చి తల్లి సమాధి పక్కన ఉన్న తండ్రి సమాధిలో ఐక్యం చేశాడు. ప్రతి సంవత్సరం ఇక్కడి ఆదివాసులు హైమెన్‌డార్ఫ్ వర్ధంతిని ప్రతి ఏట జనవరి 11న గోండు సాంప్రదాయం ప్రకారం నిర్వహించి గిరిజనుల అభివృద్ధి కోసం వారు అందించిన సేవలను సహకారాన్ని స్మరించుకుంటారు. ప్రతి ఏటా పుష్యమాసంలో నిర్వహించే కేస్లాపూర్ నాగోబా జాతరలో గిరిజన దర్బార్ ఏర్పాటు చేయడం ఆయన పుణ్యమే. ఈ విధంగా హైమెన్‌డార్ఫ్ ఒక శాస్త్రవేత్తగానే మిగిలిపోకుండా ఆదివాసీల బతుకుల్లో వెలుగులు నింపిన బాంధవ్యుడు.

## ఇండోనేషియాలో పిల్లలకు సోషల్ మీడియా నిషేధం!



ఇండోనేషియా: సోషల్ మీడియా వినియోగదారులకు కనీస వయస్సును నిర్ణయించడానికి ఒక నిబంధనను జారీ చేయాలని యోచిస్తోందని ఇండోనేషియా పేర్కొంది. ఈ చర్య పిల్లలను రక్షించే లక్ష్యంతో చేస్తున్నట్లు ఆ దేశ కమ్యూనికేషన్ మంత్రి అన్నారు. 16 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియాను యాక్సెస్ చేయకుండా నిషేధించాలని ఆస్ట్రేలియా తీసుకున్న నిర్ణయం తర్వాత ఈ ప్రణాళికలు రూపొందించబడ్డాయి. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ యజమాని మెటా నుండి టిక్‌టాక్ వరకు టెక్ దిగ్గజాలు పిల్లలు తమ ప్లాట్‌ఫామ్‌లను యాక్సెస్ చేయకుండా నిరోధించడంలో విఫలమైతే వారికి జరిమానాలు విధించబడతాయి. ఇండోనేషియాలో కనీస వయస్సు ఎంత ఉంటుందో మంత్రి ముత్య హఫీద్ చెప్పలేదు. డిజిటల్ స్పేస్‌లో పిల్లలను ఎలా రక్షించాలో తాము చర్చించామని ఆమె అధ్యక్ష కార్యాలయం యొక్క యూట్యూబ్ ఛానెల్‌లో అప్‌లోడ్ చేసిన వీడియోలో చెప్పారు. ఇండోనేషియా ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్ల సంఘం 8,700 మందిపై నిర్వహించిన సర్వే ప్రకారం, దాదాపు 280 మిలియన్ల జనాభా కలిగిన ఇండోనేషియాలో ఇంటర్నెట్ వ్యాప్తి గత సంవత్సరం 79.5%కి చేరుకుంది. 12 ఏళ్ల లోపు పిల్లలలో 48% మందికి ఇంటర్నెట్ యాక్సెస్ ఉందని, ఆ వయసులోని కొంతమంది ప్రతివాదులు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ మరియు టిక్‌టాక్‌లను ఉపయోగిస్తున్నారని సర్వేలో తేలింది.

## చైనాలో శ్రీలంక అధ్యక్షుడు పర్యటన





చైనా: శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస్సనాయకే చైనాలో నాలుగు రోజులు పర్యటన చేయనున్నారు. మంగళవారం చైనాకు చేరుకున్న దిస్సనాయకే బుధవారం చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్‌తో చర్చలు జరపనున్నారు. ఆ తర్వాత ఇరు పక్షాలు ఒప్పందాలపై సంతకం చేస్తాయని అధికారులు తెలిపారు. చైనాకు చేరుకున్న దిస్సనాయకేకు ఆ దేశ సైన్యం స్వాగతం పలికింది. కొలంబోలోని దిస్సనాయకే కార్యాలయం విడుదల చేసిన పత్రికా ప్రకటన ప్రకారం, చైనా ఉప విదేశాంగ మంత్రి చెన్ జియాడోంగ్ దిస్సనాయకేను అధికారికంగా స్వాగతం పలికారు. గత సంవత్సరం సెప్టెంబర్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత దిస్సనాయకే రెండవ విదేశీ పర్యటన ఇది. ద్వైపాక్షిక సంబంధాలను చర్చించడానికి దిస్సనాయకే బుధవారం జి జిన్‌పింగ్ ని కలుస్తారని, ఆ తర్వాత ఇరు పక్షాలు సంబంధాలను మరింతగా పెంచుకోవడానికి ఒప్పందాలపై సంతకం చేస్తాయని శ్రీలంక అధికారులు తెలిపారు. ప్రధాన మంత్రి లి కియాంగ్, చైనా జాతీయ పీపుల్స్ కాంగ్రెస్ స్టాండింగ్ కమిటీ చైర్మన్ జావో లెజీని కూడా దిస్సనాయకే కలవనున్నారు. ఈ పర్యటనలో దిస్సనాయకే అనేక కీలక కార్యక్రమాలలో పాల్గొననున్నారు. సాంకేతిక, వ్యవసాయ అభివృద్ధిపై దృష్టి సారించిన క్షేత్ర పర్యటనలు, అలాగే పేదరిక నిర్మూలనకు ఉద్దేశించిన చొరవలను చేపట్టనున్నారు. ఈ పర్యటనలో ఉన్నత స్థాయి వ్యాపార సమావేశాలు, చర్చలు కూడా ఉన్నాయని కొలంబోలోని అధ్యక్ష కార్యాలయం తెలిపింది. పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా పర్యటన రెండు దేశాల మధ్య దీర్ఘకాలసంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని శ్రీలంక విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇటీవల పేర్కొంది.

## హమాస్-ఇజ్రాయిల్ చర్చల్లో పురోగతి!



గాజా సిటీ: కాల్పుల విరమణ చర్చల్లో పురోగతి సాధించాయని, రేపోమాపో ముసాయిదా ఒప్పంద ప్రతులను ఇరు పక్షాలు మార్పిడి చేసుకోనున్నాయని పేరు తెలపడానికి ఇష్టపడని ఓ అధికారి తెలిపినట్లు అసోసియేటెడ్ ప్రెస్ వార్తా సంస్థ పేర్కొంది. బందీల విడుదల, కాల్పుల విరమణకు సంబంధించి మధ్యవర్తిత్వం వహించిన అరబ్, అమెరికా ప్రతినిధులను ఉటంకిస్తూ అధికారులు ఈ విషయం తెలిపారు. అయితే దీనిపై ఇరు పక్షాలు ఒక ఒప్పందానికి రావడానికి ఇంకా కొన్ని అవరోధాలు ఉన్నాయని, వాటిని పరిష్కరిస్తే ఒప్పందానికి మార్గం సుగమం అవుతుందని హమాస్ ప్రతినిధి ఒకరు తెలిపారు. గతంలో కూడా అమెరికా అధికారులు ఒప్పందం దాదాపు ఖరారైపోయిందన్నట్టుగా ఇలాగే ప్రకటనలిచ్చారు. కానీ, అవేవీ వాస్తవ రూపం దాల్చలేదు. ఇది కూడా అటువంటి ప్రచారమేనా అన్న అనుమానం కలుగుతోంది. అందునా, మరో వారం రోజుల్లో అధ్యక్షుడిగా పదవి నుంచి నిష్క్రమించనున్న బైడెన్ ప్రభుత్వం జరిపే చర్చలకు ఏపాటి విలువ ఉంటుందన్నది ప్రశ్న. పదిహేను మాసాలుగా సాగుతున్న ఇజ్రాయిల్ దురాక్రమణ పూరిత దాడులకు స్వస్తి చెబితేనే బందీల విడుదల గురించి ఆలోచిస్తామని హమాస్ ఎప్పటి నుంచో చెబుతోంది. బందీలను బేషరతుగా విడుదలజేయాలని, ఆ తర్వాతే కాల్పుల విరమణ గురించి పరిశీలిస్తామని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అనడంతో చర్చల ప్రక్రియ ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్న చందంగా తయారైంది. పశ్చిమాసియాను అస్థిరపరిచేందుకు అమెరికా అండతో ఇజ్రాయిల్ ఇష్టానుసారంగా చెలరేగిపోతోంది. గాజాలో మొదలై యెమెన్, లెబనాన్, సిరియా కు దాడులను విస్తరింపజేసేందుకు ఇజ్రాయిల్ యత్నిస్తోంది. తాజా చర్చల విషయానికి వస్తే మధ్యవర్తిత్వం వహిస్తున్న గల్ఫ్ దేశం ఖతార్ ఇజ్రాయిల్‌తో ఏదో ఒక రకమైన ఒప్పందానికి రావాలని హమాస్‌పై ఒత్తిడి పెంచుతున్నట్లు వార్తలొస్తున్నాయి. మరో వైపు ట్రంప్ దూత స్టీవ్ విట్‌కాఫ్ ఇటీవల ఈ చర్చల్లో పాల్గొని హమాస్‌తో ఒప్పందానికి రావాలని ఇజ్రాయిల్‌ను కోరినట్లు పాశ్చాత్య మీడియా తెలిపింది.

## ఇన్ఫోసిస్ నారాయణమూర్తి నిజంగా అలా అన్నారా



ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి ఆ మధ్య పని గంటల మీద చేసిన వ్యాఖ్యలు.. ఎంత దుమారం రేపాయో తెలియంది కాదు. దానికి ఇప్పుడు కొనసాగింపుగా.. ఎల్‌అండ్‌టీ చైర్మన్ ఎస్‌ఎన్ సుబ్రహ్మణ్యన్ వ్యాఖ్యలపై చర్చ నడుస్తోంది. అయితే.. తాజాగా ఇన్ఫోసిస్ మూర్తి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారంటూ సోషల్ మీడియాలో చర్చ నడుస్తోంది. ఇంతకు ముందు వారంలో 70 పనిగంటల ఉండాల్సిందేనని బహిరంగంగా స్టేట్‌మెంట్ ఇచ్చిన ఇన్ఫోసిస్ మూర్తి.. ఇప్పుడు యువతపై సంచలన వ్యాఖ్యలు చేశారు. మన దగ్గర అమ్మాయిలు, అబ్బాయిల మధ్య మాటలు ఎంత పరిమితంగా ఉంటే దేశానికి అంత మంచిదంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. అమ్మాయిలు, అబ్బాయిల మధ్య మాటలు ఎంత తక్కువగా ఉంటే అంత మంచిది. అప్పుడే జీవితంలో విజయం బాట పడతారు అంటూ ఆయన మాట్లాడారు. ఈ మేరకు ఓ జాతీయ మీడియా కథనం ప్రచురించింది. దీంతో ఆ వార్త ఆధారంగా నారాయణమూర్తి పై సోషల్ మీడియాలో మళ్లీ చర్చ మొదలైంది. ఆయనకేమైందంటూ.. పలువురు విమర్శించడం, ట్రోల్ చేయడం మొదలుపెట్టారు. ఈ చర్చ ఇలా నడుస్తుండగానే.. అసలు విషయం తెలిసింది. పీటీఐ ఫ్యాక్ట్ చెక్ లో నెట్టింట్ హల్‌చల్ చేస్తున్న ఆ వార్త తాలుకా స్క్రీన్ షాట్ ఫేక్‌గా నిర్ధారణ అయ్యింది. అది డిజిటల్‌గా ఎడిట్ చేసిందని తేలింది. ఈ విషయాన్ని సదరు మీడియా సంస్థ కూడా తన సోషల్ మీడియా ద్వారా ధృవీకరించింది.

# సెల్‌ఫోన్‌లో బందీ అవుతున్న బాల్యం



అనంతపురంలో నాలుగు సంవత్సరాల పిల్లవాడు సరిగా మాట్లాడలేకపోవడం, వింతగా ప్రవర్తిస్తుండడంతో తల్లిదండ్రులు ఆ పిల్లాడిని డాక్టరు దగ్గరకు తీసుకెళ్లారు. మీ వాడు ఎన్ని గంటలు సెల్ ఫోన్ చూస్తాడని డాక్టర్ అడగడంతో వారు బిక్కమొహం వేశారు. ఆ చిన్నారి సగటున రోజుకు కనీసం మూడున్నర గంటలు సెల్ చూస్తున్నాడని డాక్టర్ నిర్ధారించుకున్నాడు. ఎందుకు చూస్తున్నాడు? ఆ తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగులు. తమ పనికి అడ్డు రాకుండా, గోల చేయకుండా వుండాలంటే సెల్ ఇవ్వడంతో ప్రారంభించి, చివరకు సెల్ లేకుంటే వుండలేని స్థితికి చేర్చారు. దీనివల్ల మాటలు, పరిసరాల పరిశీలన, తిండి, విశ్రాంతి అన్నింటికీ దూరమయ్యాడు. ఇది ఆ ఒక్క పిల్లాడి సమస్య కాదు. దేశంలో కోట్లమంది పిల్లల సమస్య. తల్లిదండ్రులను తీవ్రంగా ఆందోళన పరుస్తున్న ఆధునిక సమస్య.

## బాల్యాన్ని చిదిమేస్తున్న 'సెల్'

చిన్నపిల్లల్లో సెల్‌పోన్ వాడకంపై 'లోకల్ సర్కిల్' అనే సంస్థ గత సంవత్సరం దేశవ్యాప్తంగా 296 జిల్లాల్లోని పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న 46 వేల మంది తల్లిదండ్రులను సర్వే చేసింది. తమ పిల్లలు ఫోన్‌లో గేమ్స్ ఆడటం, ఓటిటి సినిమాలు చూడటం లాంటి వాటితో ఎక్కువ సమయం గడుపుతున్నారని తెలిపింది. దేశంలో 47 శాతం తల్లిదండ్రులు తమ బిడ్డలకు స్మార్ట్‌ఫోన్ వ్యసనం ఉందని, పాఠశాలకు వస్తున్న పిల్లల్లో 67 శాతం మంది పిల్లలు పరధ్యాన్యంగా వుంటున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. ఆరు నెలల నుండి నాలుగు సంవత్సరాల లోపు వయసు చిన్నారుల్లో 73.34 శాతం మంది సెల్‌ఫోన్ చూస్తున్నారు. ఇందులో 19 శాతం మంది పిల్లలు మూడున్నర గంటల కంటే ఎక్కువ సమయం సెల్‌ఫోన్‌తో గడుపుతున్నారట! సెల్ ఫోన్ వాడకం వల్ల సమస్యలు ఎదుర్కొంటున్న తల్లిదండ్రుల్లో 89 శాతం మంది తమ పిల్లలకు సెల్ అలవాటు చేసింది తామేనని బాధపడుతున్నారు. అమెరికాలోని 'శాండియాగో స్టేట్ యూనివర్శిటీ' సైకాలజీ ప్రొఫెసర్ జీన్‌త్వెంగె 8 నుండి 13 సంవత్సరాల లోపు పిల్లల్లో సెల్‌ఫోన్ వాడకంపై చేసిన అధ్యయన నివేదిక విస్తుపోయే నిజాలను బయటపెట్టింది. మొబైల్ వాడుతున్న యుక్తవయసు పిల్లలు ఒంటరితనంతో బాధపడుతున్నారని, తమను తాము గాయపరచుకోవడం, దూకుడుగా, అసహనంగా, వికృతంగా ప్రవర్తించడం, ఆత్మహత్యలు చేసుకోవడం 2020-23 మధ్య పెద్ద సంఖ్యలో పెరిగిందని ప్రకటించింది. 'అలీగఢ్ ముస్లిం యూనివర్శిటీ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రిసెర్చ్' అధ్యయనం ప్రకారం మన దేశంలోని కాలేజీ విద్యార్థుల్లో రోజుకు 2,617 సార్లు తమ సెల్‌ఫోన్లను క్లిక్ చేస్తున్నారని తెలిపింది. ఒకసారి సెల్‌ఫోన్, ఇంటర్నెట్ వాడడం మొదలెట్టిన వారిలో 85 శాతం మంది వాటి వాడకాన్ని మానేయడం కష్టమని తెలిపారు. 33 శాతం మంది యువత భౌతికంగా స్నేహితులను కలవడం కంటే సెల్ ద్వారా మాట్లాడు కుంటున్నారు. సెల్ వాడుతున్న వారిలో 67 శాతం మంది ఆలస్యంగా నిద్ర పోవడం లేదా నిద్ర లేమితో బాధపడుతున్నారు. దేశంలో 19 సంవత్సరాల లోపు వారిలో అశ్లీల వీడియోలు చూసే వారి సంఖ్య వేగంగా పెరిగిపోతున్నది. దీనివల్ల బాలనేరాలు పెరుగుతున్నాయి.

### దివాళాలో బిఎస్ఎన్ఎల్-లాభాల్లో ప్రైవేట్ కంపెనీలు

దేశంలో దశాబ్దన్నర కాలంలో పెద్ద సంఖ్యలో విజృంభించిన అతి పెద్ద వ్యాపారం మొబైల్ సర్వీసే. 2015లో భారతదేశ జిడిపిలో టెలికాం రంగం వాటా 6.5 శాతం వుండగా, 2023 నాటికి 14.5 లక్షల కోట్ల వ్యాపారంగా మారింది. ఇందులో ప్రభుత్వ బి.ఎస్.ఎన్.ఎల్ నష్టాల్లో కూరుకుపోతుంటే ప్రైవేట్ కంపెనీలు కోట్లకు పడగలెత్తాయి. రిలయన్స్ జియో కంపెనీ 2018-19లో రూ.48,660 కోట్ల వ్యాపారం చేస్తే 2019-20లో రూ.68,462 కోట్లకు, ఇదే కాలంలో ఎయిర్‌టెల్ రూ.80,780 కోట్ల నుండి రూ.87,539 కోట్లకు, 'వి' కంపెనీ 37,823 కోట్ల నుండి 45,996 కోట్లకు వ్యాపారాన్ని విస్తరించుకున్నాయి. రిలయన్స్ జియో 40 శాతం, 'వి' 21 శాతంగా పెరిగితే, అనేక కష్టాలను, ఆటంకాలను ఎదుర్కొని టెలి కమ్యూనికేషన్ వ్యవస్థను ఏర్పాటు చేసిన బి.ఎస్.ఎన్.ఎల్ మాత్రం రూ.19,308 కోట్ల నుండి రూ.18,906 కోట్లకు దిగజారింది. నష్టాలు వస్తున్నాయనే సాకుతో 2019లో బి.ఎస్.ఎన్.ఎల్, మహనగర్ టెలికాం నిగమ్ లిమిటెడ్‌కు చెందిన 93 వేల మంది ఉద్యోగులను 'స్వచ్ఛంద' పదవీ విరమణ పేరుతో ఇంటికి పంపారు. ఇది చాలదని ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 19 వేల మంది ఉద్యోగులను బలవంతాన బయటకు పంపాలని కేంద్రం నిర్ణయించింది. అంపశయ్యపై వున్న భీష్ముని లాగా బి.ఎస్.ఎన్.ఎల్ పరిస్థితి వుంటే అమృతం తాగిన సురుల వలే ప్రైవేట్ కంపెనీలు వెలుగుతున్నాయి.




### సెల్‌ఫోన్లను నియంత్రిస్తున్న దేశాలు

సెల్‌ఫోన్ వినియోగం చిన్నారుల జీవితాలను నాశనం చేస్తోంది. పొరపాటున పెద్దలు 'చందమామ రావే' అంటే సెల్ ఇవ్వవే అని పిల్లలు అంటున్నారు. అమ్మమ్మ, నానమ్మ కథలు వినేవారిని వెతుక్కోవలసి వస్తున్నది. ముక్కుపచ్చలారని పిల్లలు సెల్ ఇవ్వకపోతే తిండి తినే పరిస్థితి లేని దౌర్భాగ్యం అలుముకుంది. సెల్ చేతిలో వుంటే ఏం తింటున్నారో, ఎంత తింటున్నారో కూడా తెలుసుకోలేని నిస్సహాయ స్థితిలో బాల్యం బందీ అయిపోయింది. అభం, శుభం తెలియని వయసులో ప్రేమలు, వ్యసనాలు పెరిగిపోవడానికి సెల్‌లు కారణమం అవుతున్నాయి. చిన్న వయసులో కంటి చూపు, వెన్నెముక, మెడనొప్పులు పెరిగిపోతున్నాయి. భావితరాలకు వస్తున్న సెల్ ప్రమాదాన్ని ప్రపంచంలో చాలా దేశాలు గుర్తించాయి. నివారణా చర్యలు తీసుకుంటున్నాయి. మన దేశంలోకి సెల్ ఫోన్ రావడానికి కారణమైన అస్ట్రేలియా 2020 నుండి అన్ని పాఠశాలల్లో సెల్ ఫోన్‌ను నిషేధించింది. 18 సంవత్సరాల లోపు వున్న పిల్లలు సెల్ వాడాలంటే తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరని ఇటీవల ఆ దేశ పార్లమెంట్ చట్టం చేసింది. జులై 2024 నుండి ప్రాథమిక, సెకండరీ విద్యార్థులు సెల్ వాడడాన్ని బెల్జియం నిషేధించింది. కెనడా 2024 నుండి పాఠశాలలతో పాటు, జూనియర్ కాలేజీలలో సెల్‌ఫోన్ల అనుమతి రద్దు చేసింది. చైనా 2021 నుండి పిల్లలు సెల్ వాడాలంటే తల్లిదండ్రులు సమ్మతి పత్రాన్ని ప్రభుత్వానికి సమర్పించాల్సిందేనని చట్టం చేసింది. ఫిన్లాండ్, ఫ్రాన్స్, గ్రీస్, బ్రిటన్, అమెరికా, ఇటలీ, డెన్మార్క్ ఇలా 19 దేశాలు చిన్న పిల్లలు సెల్‌ఫోన్ వాడకాన్ని నిషేధించాయి. కానీ స్వయం ప్రకటిత మన విశ్వగురువుకు మాత్రం సెల్ ప్రమాదం నుండి పిల్లల జీవితాలను కాపాడడానికి తీరిక లేదు. పైగా ఆ సెల్ నెట్‌వర్కులనే మతోన్మాద భావజాల వ్యాప్తికి, మూఢనమ్మకాల విస్తృతికి, ప్రత్యర్థుల వ్యక్తిత్వాన్ని దెబ్బ తీయడానికి వినియోగిస్తున్నారు. పిల్లల ఆరోగ్యం, విజ్ఞాన వికాసం, బంగారు భవిష్యత్తును కాపాడుకునేందుకు అనేకమంది తెలుగు నేలపై బాలోత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తూ 'మీదే మీదే సమస్తం' అంటూ భరోసా ఇచ్చే ప్రయత్నం చేస్తుస్తున్నారు. సెల్‌ఫోన్ల నుండి పిల్లలను విముక్తి కల్గించాల్సిందిగా ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూనే, ఇలాంటి బాలోత్సవాలను ప్రోత్సహించడం మనందరి కర్తవ్యం.

# పెరుగుతున్న అంతరాలు!



ఆత్మనిర్భర్ భారత్ అని మొదలుబెట్టి, ఆ తరువాత వికసిత్ భారత్ అని చెబుతూ దేశం కోవిడ్ సంక్షోభం అనంతరం మళ్లీ ఆదాయాలు పుంజుకొని అభివృద్ధి ఉరకలు వేస్తుందన్నారు. అందుకు ఇంగ్లీషు అక్షరం వి తరహా అభివృద్ధి అంటే గతంలో క్షీణించిన వృద్ధి రేటు తిరిగి పెరుగుతూ పోతుందన్నారు. ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ వంటి వామపక్ష ఆర్థికవేత్తలు బిజెపి పాలనలో భారత ఆర్థిక వ్యవస్థ ఇంగ్లీషు అక్షరం వి నమూనా కాకుండా కె తరహాలో పరిణామం చెందుతోందన్నారు. అంటే కొద్దిమంది సంపన్నుల సంపద పెరుగుతోందనీ (కె లో పైభాగం) అత్యధికులుగా వున్న మధ్యతరగతి, పేదలు ఇంకా కునారిల్లుతున్నారని (కె లో కింది భాగం) వివరించారు. తాజా ఆదాయ అంతరాల నివేదిక ఈ విశ్లేషణ ఎంత సత్యమో విదితపరుస్తోంది. దేశంలోని సంపన్నులు జాతీయాదాయంలో తమ వాటాను గణనీయంగా పెంచుకుంటుంటే గ్రామీణ, అల్పాదాయ వర్గాల ప్రజలు అత్యవసర సేవలు, విద్య, ఆరోగ్య రక్షణ, ఆర్థికావసరాలు పరిమితంగానే పొందగలుగుతున్నారని ఆ పత్రం తెలిపింది. వరల్డ్ ఇనీక్వాలిటీ డాటాబేస్ (విడ్) ప్రకారం 2023లో దేశంలో అత్యంత సంపన్నులైన ఒక శాతం ప్రజలు 22.6 శాతం జాతీయాదాయంపై ఆధిపత్యాన్ని చెలాయించారని పేర్కొంది. దేశంలో ఓ మోస్తరు సంపాదన కలిగిన 40 శాతం జనాభా వాటా జాతీయాదాయంలో 43.9 నుండి 46.6 శాతం వరకూ ఉన్నదని కుటుంబ సర్వేలు తెలిపాయి. అయితే విడ్ అంచనాల ప్రకారం జాతీయాదాయంలో మధ్య తరగతి ప్రజల వాటా గణనీయంగా పడిపోయింది. 1953-55లో 41.5 శాతంగా ఉన్న వాటా 2022-23లో కేవలం 27.3 శాతానికి తగ్గిపోయింది. ఇక జనాభాలో చివరి 50 శాతంగా ఉన్న పేదలు, అల్పాదాయ వర్గాల ప్రజలు జాతీయాదాయంలో 25.5 (1961-65) నుండి 15.8 (2020-21) శాతం మధ్య ఆదాయ వాటాను కలిగి ఉన్నారని కుటుంబ సర్వేలు తెలిపాయి. కాబట్టి జాతీయ అంతర్జాతీయ నివేదికలు వేటిని పరిశీలించినా అదానీ, అంబానీ, టాటా, బిర్లా వంటి శత కోటీశ్వరుల సంపద పెరగడం, పేదలు మరింత నిరుపేదలవుతున్న వాస్తవాన్ని నివేదిస్తున్నాయి. ప్రపంచంలో పేదరికం తగ్గింపు కోసం అనేక దేశాల్లో ఆయా ప్రభుత్వాలు ఆర్థిక విధానాలను రూపొందిస్తున్నాయి. అయితే ముఖ్యంగా సోషలిస్టు దేశాలు అదేవిధంగా స్కాండినేవియా దేశాలు ఆదాయ అంతరాల తగ్గింపు కోసం కృషి చేస్తున్నాయి. అందులో భాగంగా సంపద పోగు పడుతున్న వారి నుండి అధిక పన్నులు వసూలు చేయడం, మధ్య, అల్పాదాయ వర్గాల వారికి ప్రభుత్వ తోడ్పాటు పెంచడం వంటి విధానాలు అనుసరిస్తున్నాయి. ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వరంగ పాత్రను పెంచుతున్నాయి. ఇంకొన్ని దేశాల్లో ఆదాయంలో పన్ను చెల్లింపు వాటాను కొలబద్దగా తీసుకొని, అధికాదాయ వర్గాలవారి నుండి ఎక్కువగా వసూలు చేస్తున్నారు. అంతరాల తగ్గింపు లక్ష్యంగా వివిధ చర్యలు చేపడుతున్నారు. అందుకు భిన్నంగా నరేంద్ర మోడీ పాలనలో సంపన్నులపై విధించే కార్పొరేట్ పన్ను తగ్గించారు. వారు బ్యాంకులకు చెల్లించవలసిన లక్షల కోట్ల రూపాయల రుణాన్ని మాఫీ చేశారు. ప్రోత్సాహకాల పేరిట కేంద్ర బడ్జెట్‌లో ఏటా లక్షల కోట్ల రూపాయలు కుమ్మరిస్తున్నారు. మరోవైపున మధ్యతరగతి వారిపై విధించిన ఆదాయ పన్ను ఖజానాకు ఏడాదికేడాది ఎక్కువగా పోగుపడుతోంది. ఇక పేదలను ఎంతలా దిగజార్చుతున్నదీ అందరికీ తెలిసిన విషయమే! ప్రభుత్వ విధానాలే ఆదాయ అంతరాల పెరుగుదలకు కారణం కనుక వాటిని మార్చాల్సిందే. అందుకు బలమైన ప్రజా ఉద్యమాలు కావాలి.

ప్రస్తుతం దేశంలో ఆదాయ అంతరాలు 1950వ దశకంలో కంటే అధికంగా ఉన్నాయని పీపుల్ రిసెర్చ్ ఆన్ ఇండియాస్ కన్స్యూమర్ ఎకానమీ (ప్రైస్) సంస్థ ఇటీవల విడుదల చేసిన పత్రంలోని సమాచారం ఆందోళన కలిగిస్తోంది. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లయిడ్ ఎకనమిక్ రిసెర్చ్, ప్రైస్ తదితర సంస్థలు నిర్వహించిన కుటుంబ ఆదాయ సర్వేల ఆధారంగా ఈ పత్రాన్ని రూపొందించారు. అసమానతలను నిర్ధారించడానికి ఉపయోగించిన గణాంక పద్ధతి 'గినీ కోయిఫిషెంట్' ప్రకారం అసమానతల సూచీ 1953-55 మధ్య 0.371గా ఉంటే 2022-23లో 0.410గా ఉంది. అంటే ఆదాయ అంతరం అంతకంతకూ పెరిగిపోతోందన్నమాట. కేంద్ర ప్రభుత్వం

# యుద్ధ అనాథల జీవితాల్లో 'కాంతిరేఖ'



ఉక్రెయిన్, ఆర్మేనియా - అజర్ బైజాన్, అఫ్ఘానిస్తాన్, ఇథియోపియాలోని టిగ్రే ప్రాంతాల్లోని వర్గాల మధ్య యుద్ధాలు, ఘర్షణల కారణంగా యుద్ధ అనాథల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. యూనిసెఫ్ లెక్కల ప్రకారం యుద్ధాలు మిగిల్చిన విషాదం కారణంగా 140 మిలియన్లకు పైగా అనాథలుండగా, అత్యధికంగా ఆసియా ఖండంలోనే 61 మిలియన్ల మంది అనాథలు ఉన్నారు. 18 శతాబ్దం నుండి 20వ శతాబ్దం ప్రారంభంలో జరిగిన యుద్ధాల్లో బాధితుల సంఖ్య 2001 వరకు క్రమంగా పెరిగింది. మొదటి, రెండవ ప్రపంచ యుద్ధ సమయాల్లో అధికారిక అంచనాల ప్రకారం పోలాండ్‌లో 30 లక్షల మంది, యుగోస్లేవియాలో 2 లక్షల మంది పిల్లలు అనాథలు అయినట్లు లెక్కలు తేలాయి. ప్రపంచ యుద్ధాలలో 1990 నాటికి అనాథ బాధితుల సంఖ్య 146 మిలియన్లులుండగా, 1995 నాటికి 151 మిలియన్లు, 2000 నాటికి 155 మిలియన్లకు బాధితులు చేరుకోవడం విషాదకరమైన పరిణామం. సేవ్ ది చిల్డ్రన్ లెక్కల ప్రకారం ప్రపంచంలో ఆరు మంది పిల్లల్లో ఒక్కరు యుద్ధాలు, వర్గాల సంఘర్షణ జోన్‌లో నివసిస్తున్నారు. ప్రపంచంలో పది దేశాలు అఫ్ఘానిస్తాన్, కాంగో, సిరియా, యెమెన్, సోమాలియా, మాలి, నైజీరియా, కామెరూన్, సూడాన్, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ దేశాల్లో నివసిస్తున్న పిల్లలు ఈ ఘర్షణల కారణంగా అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఉన్నారని అంతర్జాతీయ బాలల హక్కుల సంస్థ గతంలో ప్రకటించింది. సూడాన్‌లో ప్రతి వంద మంది చిన్నారుల్లో 10 మంది అనాథాశ్రమాల్లో మగ్గిపోతున్నారు. ఇటీవల రష్యా సుమారు 14 వేల ఉక్రెయిన్ కుటుంబాల పిల్లలను విడదీసి తమ యుద్ధ క్యాంపులకు తరలించుకుపోయినట్లు తెలుస్తుంది. ప్రపంచంలో ప్రతి దేశంలో ఏదో రూపంలో జరిగిన యుద్ధాలు, ఘర్షణల ఫలితంగా తల్లిదండ్రులును కోల్పోయిన పిల్లలు అనాథలుగా, జీవచ్ఛావాలుగా బతుకీడుస్తున్నారు. ప్రపంచంలోని యుద్ధ అనాథల సంక్షేమానికి ఎస్ఒఎస్ ఎన్ఫాంట్స్ ఎన్ డెట్రాసెస్' అనే ఫ్రెంచ్ సంస్థ నడుం బిగించింది. ప్రతి సంవత్సరం యుద్ధ అనాథల దినోత్సవాన్ని (వరల్డ్ డే ఆఫ్ వార్ ఆర్ఫాన్స్) నిర్వహిస్తుంది. యుద్ధాల సమయంలో అనాథలైన పిల్లల గురించి అవగాహన కల్పించడం, పిల్లల మానవ హక్కులను పరిరక్షించేలా కార్యక్రమాలు రూపొందించడంతో పాటు బలహీన వ్యక్తులకు మద్దతు, రక్షణ అవసరాన్ని చాటిచెప్పేలా చేయడం, వారి అవసరాలను తీర్చి ఉత్తములుగా ఎలా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఈ సంస్థ పనిచేస్తుంది. మిగిలిన పిల్లలలాగే యుద్ధంలో అనాథలైన పిల్లలు కూడా తమ హక్కుల కోసం, స్వేచ్ఛగా జీవించాల్సిన భరోసాని, తమ హృదయాల్లో పడిన గాయాలు తొలగేలా సమాజ జీవనంలో వారిని ఉన్నతంగా ఎదిగేలా చేయాల్సిన బాధ్యత ప్రపంచంలోని అన్ని దేశాలకు ఉంది. సమష్టిగా ప్రపంచ దేశాలు చేతులు కలిపి వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉంది. యుద్ధ అనాథలు అనారోగ్యం బారినపడటంతో పాటు లైంగిక దోపిడీకి, మానవ అక్రమ రవాణాకు గురవుతున్నారు. భిక్షాటన ముఠాలు వారిని ఆదాయ వనరులుగా మార్చుకుంటున్నారు. కొన్ని దేశాలు ఈ బాలలను బాల సైనికులుగా మార్చి యుద్ధ భూమి లో బలి పశువులను చేస్తున్నారు. ప్రపంచ యుద్ధ అనాథల దినోత్సవం అంటే జ్ఞాపకార్థం కోసమో, స్మరించుకొనే రోజే కాదు. ఇది అనాథల కోసం అండగా నిలిచే చర్యలకు, సహాయాలకు నడుం కట్టించే పిలుపు. యుద్ధంలో తమ తల్లి దండ్రులను కోల్పోయిన పిల్లవాడి అక్రందనను, హృదయ గాయాలను మాన్పించే సమష్టి సమాజం కోసం పయనించాల్సిన సందర్భాన్ని ఎలుగెత్తి చాటే ఓ ఓదార్పు. సంఘర్షణకు గురైన అమాయక బాధితులకు ఓ వెలుగునిచ్చే ప్రయాణం కోసం అడుగులు వేయాల్సిన మానవీయ కోణం. కోట్ల మంది యుద్ధ అనాథ బాలల ఉజ్వల భవిష్యత్ కోసం అవగాహన పెంచడానికి ప్రపంచ యుద్ధ అనాథల దినోత్సవం వారి జీవితాల్లో ప్రేమను పంచే ఓ కాంతిరేఖ. 'ప్రపంచంలో చాలా మంది చిన్నరొట్టె ముక్క కోసం చనిపోతున్నారు, కానీ చిన్నప్రేమ కోసం ఇంకా చాలా మంది చనిపోతున్నారు' అన్న మదర్ థెరిస్సా వాక్కులు ఒక్కసారి గుర్తుచేసుకోవాల్సిన సందర్భం ఇది.

ప్రతి యుద్ధానికి అనాథలు ఉంటారు. ప్రతి సంఘర్షణ దాని మచ్చలను అమాయకులపై వదిలేస్తుంది. ఈ మాట ప్రపంచంలో గతంలో జరిగినా, వర్తమానంలో జరుగుతున్నా, భవిష్యత్‌లో జరగబోయే యుద్ధాలు మిగిల్చే కన్నీటి గాథల గురించే. యుద్ధాలు మిగిల్చే విషాదంలో అత్యంత భయానకమైన జీవితాలు అనాథలదే. అహంకారపూరితమైన ఆధిపత్య కోసం, సంఘర్షణల కారణంగా జరుగుతున్న యుద్ధ భూమిలోని పోరు కోట్లమంది అనాథలను మిగిల్చిపోతుంది. ఈ కన్నీటి ఆవేదనకు ముగింపు ఎక్కడో తెలియక బిక్కుబిక్కుమంటున్న అనాథ పిల్లలు కారుస్తున్న కోట్ల క్యూసెక్కుల కన్నీరుకు కారకులెవ్వరో అన్ని దేశాలకు తెలిసినా వారికి అడ్డుకట్ట వేసి శాంతి మార్గం వైపు నడిపించేందుకు ఆయా దేశాలు ఇప్పటికీ సమాయత్తం కాకపోవడం ప్రపంచ మానవ సమాజంలో ఓ విషాద పరిణామం. గత రెండు మూడు సంవత్సరాల నుండి పలు దేశాలు, వర్గాల మధ్య జరుగుతున్న యుద్ధాలు సంఘర్షణలో లక్షలాది మంది పిల్లలు అనాథలుగా మారుతున్నారు. గాజా -ఇజ్రాయెల్, రష్యా-



## జ్ఞానేశ్వరి హై వోల్టేజ్ గ్లామర్..

# అదరహో అనాల్సిందే..



టాలీవుడ్ క్యూట్ బ్యూటీ, వైజాగ్ అమ్మాయి జ్ఞానేశ్వరి కంద్రేగుల గురించి అందరికీ తెలిసిందే. పెళ్లి చూపులు షోతో మంచి పాపులారిటీ సొంతం చేసుకున్న ఆమె.. ఫుల్ ఫేమస్ అయ్యారు. ఆ తర్వాత వరుస అవకాశాలు అందుకుంటూ అటు సినిమాల్లో.. ఇటు వెబ్ సిరీసులతో బిజీగా ఉన్న జ్ఞానేశ్వరి.. సోషల్ మీడియాలో చేసే సందడి మాములుగా ఉండదు. / నెట్టింట ఎప్పుడూ యాక్టివ్ గా ఉండే జ్ఞానేశ్వరి.. తన పర్సనల్ విషయాలతో పాటు ప్రొఫెషనల్ లైఫ్ కు సంబంధించిన విషయాలు అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. తరచూ తన గ్లామర్ పిక్స్ పోస్ట్ చేస్తూ కుర్రకారును హీటెక్కిస్తుంటారనే చెప్పాలి. తన వయ్యారంతో మైమరిపించే అమ్మడు.. సెగలు రేపుతుంటారు. తాజాగా ముద్దుగుమ్మ ఇన్ స్టాగ్రామ్ లో అదిరిపోయే పిక్స్ షేర్ చేయగా.. ఒక్కోటి ఒక్కో జెమ్. అందాల ఆరబోత అంటే అదే అన్నట్లు పోజులిచ్చారు జ్ఞానేశ్వరి. స్కిన్ టైట్ ఫిట్ డ్రెస్సుల్లో సందడి చేసిన జ్ఞానేశ్వరి ఇచ్చిన ఎక్స్ప్రెషన్స్ మాములుగా లేవు. ఎవరైనా కచ్చితంగా ఫిదా అవ్వాల్సిందే. ప్రస్తుతం ఆమె పిక్స్ వైరల్ గా మారాయి. మోడ్రన్ డ్రెస్ లో అమ్మడు తన థైస్ షోతో సింపుల్ గా అగ్గిరాజేశారు. మిర్రర్ ముందు కొంటెగా చూస్తూ పోజులిచ్చిన ఆమె.. తన గ్లామరస్ స్కిన్ తో ఫిదా చేసేశారు. కొత్త కొత్త స్టిల్స్ తో అదరగొట్టిన బ్యూటీ.. తన నవ్వుతో మైండ్ బ్లాక్ చేయడం పక్కా. బాత్ టబ్ లో పిక్ అయితే వేరే లెవెల్. బ్లాక్ కలర్ షైనింగ్ డ్రెస్ లో బ్యాక్ షో చేసిన జ్ఞానేశ్వరి.. క్లీన్ బౌల్డ్ చేసేశారనే చెప్పాలి. ఓవరాల్ గా ప్రతి పిక్ కూడా సూపరే. దీంతో నెటిజన్లు ఓ రేంజ్ లో సందడి చేస్తున్నారు. ఫొటోస్ సూపర్ అని చెబుతున్నారు. చూస్తూ ఉండిపోవాలనిపిస్తుందని అంటున్నారు. లైకులు కొడుతూ.. కామెంట్స్ పెడుతూ.. షేర్ చేస్తూ రచ్చ రచ్చ చేస్తున్నారు. అయితే మోడల్ గా కెరీర్ స్టార్ట్ చేసిన జ్ఞానేశ్వరి.. షార్ట్ ఫిల్మ్స్ తో మంచి ఫేమ్ సంపాందిచుకున్నారు. ఆ తర్వాత పెళ్లి చూపులు షోలో విజేతగా నిలిచి మరింత దగరయ్యారు. వరుసగా సినిమా అవకాశాలు అందుకున్న ఆమె.. పలు చిత్రాలతో మెప్పించారు. మిస్టర్ అండ్ మిస్ లో లిప్ లాక్స్ తో టాక్ ఆఫ్ ది టౌన్ గా మారారు. ఇప్పుడు మరిన్ని ప్రాజెక్టుల్లో భాగమయ్యారు.

## పింక్ డ్రెస్‌లో యుక్తి అందాల షో



గత ఏడాది ప్రేక్షకుల ముందుకు వచ్చిన నాగశౌర్య మూవీ 'రంగబలి' సినిమాలో హీరోయిన్‌గా నటించిన ముద్దుగుమ్మ యుక్తి తరేజా అందంతో అలరించింది. ఆ సినిమా కమర్షియల్‌గా నిరాశ పరచినా నటిగా ఆమెకు ఒక వర్గం ప్రేక్షకుల్లో గుర్తింపు తెచ్చి పెట్టింది. ఆ సినిమా తర్వాత పెద్దగా ఆఫర్లు రాకున్నా సోషల్ మీడియాలో మాత్రం ఈమె జోరు కంటిన్యూ అవుతోంది. మిలియన్ ఫాలోవర్స్‌కి చేరువ అయిన ఈ అమ్మడు రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను, వీడియోలను షేర్ చేయడంతో పాటు, తన రెగ్యులర్ యాక్టివిటీస్‌కి సంబంధించిన ఫోటోలు వీడియోలను షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా మరోసారి ఈమె తన అందమైన ఫోటోలను షేర్ చేసి వార్తల్లో నిలిచింది. పింక్ డ్రెస్‌లో ఈ అమ్మడు చూపు తిప్పుకోనివ్వకుండా అందాలతో ఆకట్టుకుంది. క్లీ వేజ్ షో తో కవ్విస్తున్న యుక్తి తరేజా అందంపై ప్రశంసలు చేస్తున్న వారు చాలా మంది ఉన్నారు. ఇంత అందంగా ఉన్న యుక్తికి సినిమా ఇండస్ట్రీలో నిరాశ మిగలడం దారుణం అంటూ కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఆమెకు ఉన్న ఫాలోయింగ్ నేపథ్యంలో, ఆమె అందం నేపథ్యంలో వరుసగా ఆఫర్లు రావాల్సి ఉంది. కానీ ఆమెకు మాత్రం పెద్దగా ఆఫర్లు రాకపోవడం చర్చనీయాంశంగా ఉంది అంటూ కొందరు అంటున్నారు. ముందు ముందు అయినా ఈమెకు మంచి ఆఫర్లు వస్తాయని అంతా నమ్మకంగా ఉన్నారు. ప్రస్తుతం ఈ అమ్మడు ఒక వెబ్ సిరీస్‌తో పాటు రెండు సినిమాల్లో నటిస్తోంది. ఆ సినిమాలకు సంబంధించిన షూటింగ్ వివిధ దశల్లో ఉంది. తెలుగులో మాత్రం పెద్దగా ఈమెకు ఆఫర్లు రావడం లేదు. ఇతర భాషల్లోనే ఈమె సినిమాలు చేస్తోంది. తెలుగులో మంచి ఆఫర్స్ కోసం ఈ అమ్మడు ఎదురు చూస్తుందని తెలుస్తోంది. సోషల్ మీడియాలో ఇలాంటి అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా కచ్చితంగా ముందు ముందు ఈమెకు మంచి ఆఫర్లు దక్కే అవకాశాలు ఉన్నాయి అంటూ కొందరు సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈమధ్య కాలంలో ఎక్కువ మంది సోషల్ మీడియాలో అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం ద్వారా ఎక్కువగా వార్తల్లో నిలుస్తున్నారు. కనుక ఈమె సైతం ఇలాంటి అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా ఎక్కువగా వార్తల్లో నిలిచే అవకాశాలు ఉన్నాయి. అన్ని వర్గాల వారిని ఆకట్టుకునే విధంగా ఈ అమ్మడి అందాల ఆరబోత ఫోటోలు వైరల్ అవుతున్నాయి. కనుక ముందు ముందు మంచి పాత్రలతో ఈమె ప్రేక్షకుల ముందుకు వస్తే హీరోయిన్‌గా టాప్ రేంజ్‌కి వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. యుక్తి కి వెబ్ సిరీస్‌ల్లోనూ మంచి భవిష్యత్తు ఉందనే అభిప్రాయంను కొందరు వ్యక్తం చేస్తున్నారు.

## మెహ్రీన్.. నల్లని డ్రెస్సులో బికినీ అందాలను దాచేస్తూ..

మెహ్రీన్ పిర్జాదా లేటెస్ట్ ఫోటోషూట్ లో మరింత గ్లామర్ తో కనిపించి, తన ఫ్యాన్స్ ని మరోసారి ఆకట్టుకుంది. నల్లని డిజైనర్ డ్రెస్ లో మెహ్రీన్ వేసుకున్న స్టైలిష్ అవుట్‌ఫిట్ ఆమె అందాన్ని మరింతగా హైలైట్ చేస్తోంది. సన్‌కిస్డ్ లుక్ తో తీసిన ఈ ఫోటోలు, ఆమె గ్లామర్‌ను ఒక కొత్త స్థాయికి తీసుకెళ్లాయి. హ్యాండ్ బ్యాగ్ స్టైల్, సన్ గ్లాసెస్ తో ఈ బ్యూటీ ఇచ్చిన పోజులు ట్రెండింగ్ అయ్యేలా కనిపిస్తున్నాయి. మెహ్రీన్ తన ఫ్యాషన్ సెలక్షన్, హుందాతనంతో ఎల్లప్పుడూ ప్రత్యేకంగా నిలుస్తూ ఉంటుంది. మెహ్రీన్ సోషల్ మీడియా వేదికగా తన కొత్త లుక్స్ తో పలు సార్లు తన ఫ్యాన్స్‌కి గ్లామర్ ట్రీట్ ఇస్తూ ఉంటుంది. ఆమె పంచుకున్న తాజా పిక్స్ నెట్టింట వైరల్ అవుతుండగా, ఫ్యాన్స్ నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది. "మెహ్రీన్ సో బ్యూటిఫుల్," "బ్లాక్ డ్రెస్లో అద్భుతంగా కనిపిస్తోంది" అంటూ నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఈ ఫోటోల్లో మెహ్రీన్ కళ్ల సొగసుతో, హుందాతనంతో ఫ్యాన్స్‌ని మంత్ర ముగ్దుల్ని చేసింది. మెహ్రీన్ కెరీర్ విషయానికి వస్తే, ఆమె తన ప్రయాణం "కృష్ణ గాడి వీర ప్రేమగాథ" సినిమాతో ప్రారంభించింది. మొదటి సినిమాతోనే మంచి గుర్తింపు పొందిన మెహ్రీన్, ఆ తర్వాత "మహానుభావుడు," "రాజా ది గ్రేట్," వంటి సినిమాలతో వరుస విజయాలను సాధించింది. ముఖ్యంగా, అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన "%ఫ్%2" మరియు "%ఫ్%3" సినిమాలలో ఆమె హనీ పాత్రతో అందరినీ ఆకట్టుకుంది. ఈ పాత్ర ఆమెకు మరింత గుర్తింపు తీసుకువచ్చింది. ఇప్పుడు మెహ్రీన్ బాలీవుడ్‌లో కూడా కొన్ని ప్రాజెక్టులపై దృష్టి పెట్టింది. అయితే, టాలీవుడ్‌లో గతంలో లాగే అవకాశాలు అందుకోవాలని ఆమె ఆశపడుతోంది. తన కెరీర్‌ను మళ్లీ ట్రాక్ లోకి తీసుకురావడానికి ఆమె కృషి చేస్తూ, సోషల్ మీడియా వేదికగా తన గ్లామర్ షో తో అభిమానులను ఆకట్టుకుంటోంది. మెహ్రీన్ ఎప్పుడు కొత్తగా, ట్రెండీగా కనిపించడం ఆమెకు ప్రత్యేకతని చూపిస్తుంది. ఇక ఆమె పర్సనల్ లైఫ్ విషయానికి వస్తే, గతంలో ఎంగేజ్‌మెంట్ రద్దు తరువాత, మెహ్రీన్ పూర్తిగా తన కెరీర్ పై ఫోకస్ పెట్టింది. ఆమె యొక్క ఫ్యాషన్ సెలక్షన్, నటనా ప్రతిభ ఆమెను టాలీవుడ్‌లో ఒక ప్రత్యేక స్థాయికి తీసుకెళ్లాయి. ఇప్పుడు ఆమె కొత్త సినిమాల అప్‌డేట్స్ తో పాటు, ఈ కొత్త గ్లామర్ లుక్స్ ఆమె కెరీర్‌లో మరో లెవెల్ హిట్స్ గా నిలుస్తాయని ఆమె అభిమానులు నమ్ముతున్నారు.



## కొత్త ఇన్నింగ్స్ కోసమేనా సీనియర్ నటి పాట్లు?



అల్లరి నరేష్ సరసన సిద్ధు ఫ్రం శ్రీకాకుళం, శుభప్రదం చిత్రాల్లో నటించింది మంజరి ఫడ్నిస్. కానీ ఈ భామకు ఆశించినంత పెద్ద కెరీర్ సౌత్‌లో దక్కలేదనే చెప్పాలి. అందం, ప్రతిభ ఉన్నా కానీ పోటీలో నిలదొక్కుకోలేకపోయింది. ఆ తర్వాత మంజరి బాలీవుడ్ లోను నటించింది. తమిళం, మలయాళం, మరాఠా భాషల్లోను ఒక్కో సినిమా చేసింది. కానీ ఏ పరిశ్రమలోను నిలదొక్కుకోలేకపోయింది. / ఇదిలా ఉంటే మంజరి ఫడ్నిస్ కి తన కెరీర్ లో 2024 కీలక సంవత్సరంగా మారింది. ఈ ఏడాది వరుసగా సినిమాలు, వెబ్ సిరీస్ లతో బిజీ అయింది. పూణే హైవే, పెంట్‌హౌస్ వంటి చిత్రాలలోను ఈ బ్యూటీ నటించింది. ఇటీవలే ఒక కొత్త కారును కూడా కొనుగోలు చేసానని తెలిపింది. 2025లో తన నటన, గానంలోను కెరీర్‌లను సమతుల్యం చేసుకోవడానికి ఎదురుచూస్తోంది. చాలా ఆత్మపరిశీలన తర్వాత నన్ను నేను మళ్లీ ఆవిష్కరించుకున్న సంవత్సరం ఇది అని మంజరి తెలిపింది. నా సిస్టమ్‌ను రీవైరింగ్ చేయడం వల్ల చాలా అద్భుతమైన విషయాలు జరిగాయి... గత 2 సంవత్సరాలుగా ఎన్నో ఉత్సవాల్లో విపరీతమైన ప్రేమను పొందుతున్న నా చిత్రం - చల్తీ రహే జిందగీ - ఈ సంవత్సరం ఎట్టకేలకు విడుదలైంది. విమర్శకుల ప్రశంసలతో పాటు, ప్రేక్షకుల ప్రేమను పొందింది. అలాగే నేను నా ఒకటవ సింగిల్ విడుదల చేయడంతో సంగీత పరిశ్రమలో నా ప్రయాణాన్ని ప్రారంభించాను. నేను చిన్నప్పటి నుంచి ఆరాధించే మీనాక్షి శేషాద్రి మేడమ్‌తో కలిసి పని చేస్తున్నాను. 2024లో ఫెమినా మహారాష్ట్ర అచీవర్ పుర స్కారాన్ని గెలుచుకోవడం ఆనం దాన్నిచ్చింది. నా సినిమా %-%పూణే హైవేని 2%-% కొన్ని వారాల క్రితం IFFI గోవాలో ప్రదర్శించాం. ఇంకా సంవత్సరం చివరి వరకు ఎదురుచూడాలి. . అని తెలిపింది. మంజరి ఫడ్నిస్ 2.0 గా మారాను. నేను నటించినవి ఇంకా రావాల్సి ఉంది. నా సినిమాలు కొన్ని విడుదలకు సిద్ధంగా ఉన్నాయి - పూణే హైవే, పెంట్‌హౌస్, జిందగీ నమ్‌కీన్ రిలీజ్ కి వస్తున్నాయి.. అలాగే నటిగా నాలోని కొత్త కోణాన్ని చూపిస్తాను అని తెలిపింది. మంజరి సోషల్ మీడియాల్లో షేర్ చేసిన ఫోటోగ్రాఫ్స్ లో టూ హాలిగా కనిపిస్తోంది. ఎరుపు రంగు టాప్, కాంబినేషన్ రెడ్ కలర్ బాటమ్ తో మంజరి హాట్ గా కనిపించింది.



Printed Published and owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao RNI Title Code :- RNI TELTEL/2024/89620